మంగళవారం
29-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 217
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

ఉక్రెయిన్ యుద్ధానికి తాత్కాలిక విరమణ

మాస్కో: ఉక్రెయిన్‌పై రష్యా 3 రోజులపాటు కాల్పుల విరమణను ప్రకటించింది. వచ్చే నెల 8 నుంచి 10 వరకు కాల్పులు విరమణ అమల్లో ఉంటుందని వెల్లడించింది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా రష్యా ఏటా నిర్వహించే విక్టరీ డే వేడుకలు ఆయా తేదీల్లోనే జరగనున్నాయి. ఈ కారణంగానే రష్యా కాల్పుల విరమణను ప్రకటించింది. మే 7 అర్ధరాత్రి రెండున్నర గంటల నుంచి కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ తెలిపింది.

సంయమం పాటించండి: చైనా

న్యూదిల్లీ: ఇండియా, పాకిస్థాన్ దేశాలు సంయమం పాటించాలని చైనా కోరింది. పహల్గాం ఉగ్రదాడితో ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మరో వైపు నియంత్రణ రేఖ వద్ద ఇరు దేశాల బలగాలు కాల్పులకు పాల్పడితున్నాయి. ఈ నేపథ్యంలో చైనా విదేశాంగ ప్రతినిధి గువో జాయికున్ మీడియాతో మాట్లాడుతూ ... ఇరు దేశాలు సంయమం పాటిస్తాయని ఆశిస్తున్నామని, ఒకర్ని ఒకరు కలుసుకుని... చర్చల ద్వారా విభేధాలను పరిష్కరించుకోవాలని, ప్రాంతీయ స్థిరత్వాన్ని, శాంతిని నెలకొల్పాలని భావిస్తున్నట్లు

- మిగతా 2 లో



నావికాదళంలోకి 'రఫేల్'

న్యూదిల్లీ: భారత సైనిక దళాల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రఫేల్ మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఫ్రాన్స్‌తో చేసుకున్న ఒప్పందంపై ఇరు దేశాలూ సంతకాలు చేశాయి. భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య కుదిరిన ఈ భారీ ఒప్పందం విలువ 7.6 బిలియన్ డాలర్లు. అంటే భారత కరెన్సీలో రూ.64,000 కోట్లు. భారత నావికాదళానికి ఫ్రాన్స్ నుంచి 22 సింగిల్ సీటర్, నాలుగు టు సీటర్ ఎయిర్‌క్రాఫ్టులు

- మిగతా 2 లో

చట్ట ప్రకారం నడుచుకుంటా

- 'కగార్'పై జాతీయస్థాయిలో చర్చ అవశ్యం
- బీఆర్ఎస్‌ను నమ్మేస్థితిలో ప్రజలు లేరు
- సంక్షేమ పథకాల ప్రచారంలో వేగం పెంచండి
- విధిలేకనే కొందరు అధికారులను కొనసాగిస్తున్నాం
- సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్టు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మాజీ మంత్రి జానారెడ్డితో... సీఎంతో పాటు ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేంనరేందర్‌రెడ్డి ఆయన నివాసంలో సోమవారం భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ... ప్రస్తుతం సంక్షేమ పథకాలను సరళీకృతం చేస్తున్నామని వివరించారు. తాను 20 ఏళ్ల వరకు రాజకీయాలలో ఉంటానని, చట్ట ప్రకారమే నడుచుకుంటూ ప్రజలకు మేలు చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై అక్కసును కక్కేందుకే బీఆర్ఎస్ రజతోత్సవ సభ పెట్టినట్లుగా కనిపిస్తుందని రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్, మోదీ వాళ్ల అవసరాలకు అనుగుణంగా మాట్లాడతారని విమర్శించారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలను కూడా మరోసారి హెచ్చరించారు. చాలా మంది కేసీఆర్, కేటీఆర్‌లను కేసులలో ఇరికించి ఆరెస్టులు చేయాలని కోరుతున్నారని, అయినా తాను చట్ట ప్రకారం చేయాల్సిన పని చేస్తాను తప్ప అక్రమంగా ఎవరిని ఇబ్బంది పెట్టనని సీఎం స్పష్టం చేశారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిన ఆయన ఇప్పుడు మాపై నిందలు వేయడం విడ్డురంగా ఉందన్నారు. బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, సభలో కేసీఆర్ పూర్తి అభద్రతాభావంతో మాట్లాడారనే విషయం చాలా స్పష్టంగా అర్థమైందన్నారు. పార్టీలో ఎవరికైన హామీ ఇస్తే చేసి తీరుతానని, అందులో భాగంగానే అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇస్తా అని చెప్పి ఇప్పించానని రేవంత్ పేర్కొన్నారు. చేసిన పనులు అమలు చేస్తున్న పథకాలను ప్రచారం చేయడంలో కొంత వెనకపడ్డామన్నారు. వేగం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కొందరు అధికారుల తీరుపై అసంతృప్తిగా ఉందన్న వార్తల నేపథ్యంలో మీడియా ప్రశ్నించగా... గత్యంతరం లేకనే కొంతమంది అధికారులను కొనసాగిస్తున్నామని, ఉన్నపళంగా తీసేస్తే పాత విషయాలన్నీ తెలిసేది ఎలా అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తనకు రాహుల్ గాంధీకి మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని ఈ విషయంలో తాను ఎవరిని నమ్మించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీ ఏర్పాటు చేస్తామని రేవంత్ తెలిపారు. మావోయిస్టుల అంశంపై జానారెడ్డి, కె.కేశవరావు చర్చిస్తారని అన్నారు. కగార్ అంశంపై జాతీయ స్థాయిలో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. కగార్ పై నిర్ణయం తీసుకున్నాక, ప్రభుత్వ విధానం ప్రకటిస్తామని రేవంత్ చెప్పారు. అంతకుముందు జానారెడ్డితో తెలంగాణ-చత్తీస్‌గఢ్ సరిహద్దులో నెలకొన్న పరిస్థితులు, కర్రెగుట్టలో కూంబింగ్ తదితర అంశాలపై చర్చించారు. తాము నిర్ణయం ప్రకటించాకే కేంద్రానికి లేఖ రాస్తామంటూ కేసీఆర్ ప్రకటించారని రేవంత్ గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు రేవంత్‌రెడ్డి మరోసారి వార్నింగ్ ఇచ్చారు. ఇటీవల నిర్వహించిన సీఎల్పీలో ఎమ్మెల్యేలు తమ పద్ధతులను మార్చుకోవాలని సూచించినా ఇంకా కొంతమంది మార్చుకోవడం లేదని అగ్రహం వ్యక్తం చేశారు. మరికొంతమంది ఎమ్మెల్యేలకు పొగరు పెరిగిందని, ఇది సరైన పద్దతి కాదని సూచించారు. ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లో కాకుండా నియోజకవర్గాల్లో ఎక్కువ సమయం గడపాలని ఇప్పటికే తాను అదేశించినా కూడా కొంతమంది హైదరాబాద్ చుట్టే తిరగడం పట్ల అయన అసహనం వ్యక్తం చేశారు. పార్టీలో ఎంత ఓపికగా ఉంటే అంత తొందరగా పదవులు వస్తాయి తప్ప ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చివరకు నష్టపోయేది వారే అనే విషయం గ్రహిస్తే మంచిదని అన్నారు. కొందరు పదవులు రాలేదని నోరు జారుతున్నారని అలాంటి వారికి ఎప్పటికీ పదవులు రావని అయన అన్నారు.

మహిళా సాధికారతకు కృషి

మంత్రి సీతక్క

ఐఐఎం కోల్‌కతా ద్వారా సెర్ప్ సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర - హైదరాబాద్: సెర్ప్ తన లక్ష్యాలను చేరుకునేలా అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సీతక్క అన్నారు. పేదరిక నిర్మూలన దిశలో మహిళా సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ప్రతిష్టాత్మకమైన ఐఐఎం కోల్కతా ద్వారా సెర్ప్ సిబ్బందికి మూడు రోజులపాటు జరిగే శిక్షణ తరగతులకు సోమవారం మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఏర్పాటై 25 సంవత్సరాలయిందన్నారు. బ్యాంకుల ద్వారా వేలాది కోట్ల రూపాయలను మహిళా సంఘాలకు ఇప్పిస్తోందని వివరించారు. స్వయం ఉపాధి నుంచి మహిళా సంఘాలను సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దుతున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. వ్యాపార మెలకువలను, కొత్త ఆలోచనలను ఇతరులతో పంచుకోవాలని పిలుపునిచ్చారు. డిమాండ్ ఉన్న వ్యాపారాలను గుర్తించి మహిళా సంఘాలను ప్రోత్సహించాల్సిందిగా మంత్రి సూచించారు. మహిళా సంఘాలు, ఒంటరి మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా సామాజిక భద్రత లభిస్తోందన్నారు. శిక్షణలో ఎంతో నేర్చుకున్నామని సెర్ప్ సిబ్బంది తెలిపారు. మహిళలకు వ్యాపార మెళుకువలు నేర్పే విశాల ప్రపంచాన్ని తమకు పరిచయం చేసిన ఐఐఎం ప్రొఫెసర్లకు, లక్షలు ఖర్చు చేసి తమకు నేర్చుకునే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అదనపు డీఆర్‌డీవోలు, ప్రాజెక్ట్ మేనేజర్లు మొత్తం 70 మంది శిక్షణ తరగతులకు హాజరయ్యారు.

లోకాయుక్త, ఉపలోకాయుక్త ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర-హైదరాబాద్: రాజ్‌భవన్‌లో తెలంగాణ లోకాయుక్త, ఉప లోకాయుక్త ప్రమాణస్వీకారం చేశారు. లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, ఉప లోకాయుక్తగా బీఎస్ జగ్జీవన్ కుమార్‌తో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, షబ్బీర్ అలీ, వేం నరేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

'పది' ఫలితాలు రేపు?

విశాలాంధ్ర - హైదరాబాద్: పదో తరగతి ఫలితాలు విడుదల చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. అంతా ఒకే అయితే ఈనెల 30వతేదిన ఫలితాలు విడుదల అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఇంటర్ ఫలితాలు రావడంతో పదో తరగతి పరీక్షల ఫలితాల కోసం విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. అధికారులు ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే టెన్త్ మూల్యాంకన ప్రక్రియ, మార్కుల కంప్యూటరీకరణ, పలు దఫాలుగా సమాధాన పత్రాలు వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయింది. విద్యాశాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధీనంలోనే ఉండడంతో ఫలితాలను ఆయన చేతుల మీదుగా విడుదల చేయించాలని అధికారులు భావించారు. ఈ విషయంపై ఇటీవల రేవంత్ రెడ్డిని విద్యాశాఖ ఉన్నతాధికారులు కలిసి ఫలితాల విడుదల విషయంపై చర్చించారు. ఈ క్రమంలో ఫలితాల విడుదల బాధ్యత డిప్యూటీ సీఎంకు అప్పగించినట్లు తెలిసింది.

పీఓకేలో అలజడి

ఉగ్రవాదులను తరలిస్తున్న పాక్ సైన్యం

- సరిహద్దు భద్రతపై మోదీతో రాజ్‌నాథ్ కీలక భేటీ
- పాక్ యూట్యూబ్ చానల్స్‌పై నిషేధం



న్యూదిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో భారత్- పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ... భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తోంది. వారిని ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలిస్తోంది. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది. భారత భద్రతా సంస్థలు క్రియాశీలకంగా ఉన్న పలు లాంచ్‌ప్యాడ్‌లను గుర్తించిన నేపథ్యంలో పాక్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. పీఓకేలోని కెల్, సర్ది, దుధ్నియల్, అత్ముఖం, జురా, లిపా, పచ్చిబన్, ఫార్వర్డ్ కహుతా, కొట్లి వంటి ప్రాంతాల నుంచి ఉగ్రవాదులను తరలిస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం. ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లోకి చొరబడటానికి ముందు వారు నివసించే కీలక కేంద్రాలుగా ఈ లాంచ్‌ప్యాడ్స్ పనిచేస్తాయి. వీటిలో 150 నుంచి 200 మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఉన్నారని, వారంతా చొరబాటుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నాయి.

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయ్యారు. దాదాపు 45 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పహల్గాంలో పరిస్థితులతో పాటు భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. దీనికిముందు భారత్ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు రాజ్‌నాథ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ ఆదివారం భేటీ అయ్యారు. ఇక.. మోదీతో భేటీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా పాల్గొన్నారు. మరోవైపు.. రక్షణ వ్యవహారాలపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కూడా భేటీ అయింది. పార్లమెంట్ ప్రాంగణంలో జరిగిన సమావేశానికి ఎంపీలు రాధా మోహన్ సింగ్, రాహుల్ గాంధీ, విష్ణుపాల్ రే, జగన్నాథ్ సర్కార్, శక్తి సింగ్ గోహిల్, సంజయ్ సింగ్ తదితరులు హాజరయ్యారు.

పాకిస్థానీ యూట్యూబ్ చానల్స్‌పై భారత్ నిషేధం విధించింది. మొత్తం 16 యూట్యూబ్ చానల్స్‌పై వేటు వేసింది. ఈ ఉగ్రదాడి అనంతరం సదరు యూట్యూబ్ ఛానెల్స్ మతపరమైన సున్నితమైన అంశాలను

- మిగతా 2 లో

పాక్‌కు టర్కీ విమానాలు...

పహల్గాం దాడితో సరిహద్దుల్లో అలజడి వాతావరణం నెలకొంది. భారత్ వైపు నుంచి దాడి ఉండొచ్చన్న అంచనాలతో పాక్ ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే సరిహద్దుల్లో అదనపు బలగాలను మోహరించినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా టర్కీకి చెందిన సీ-130 హెర్క్యులస్ విమానాలు పాక్‌లో దిగాయి. ఈ విమానాల్లో సైన్యానికి అవసరమైన కార్గోను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. దీంతో భారత్ కూడా అప్రమత్తమైంది.

రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకం?

గవర్నర్ దగ్గర దస్త్రం

విశాలాంధ్ర - హైదరాబాద్: చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఒక చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌తో పాటు ఏడుగురు సమాచార కమిషనర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు పేర్లను ప్రతిపాదిస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అమోదం కోసం దస్త్రం పంపింది. సీఐసీగా ఐఎఫ్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేరును ప్రతిపాదించగా సమాచార కమిషనర్లుగా పి.వి.శ్రీనివాస్‌రావు, అయోధ్యరెడ్డి బోరెడ్డి, కప్పర హరిప్రసాద్, పీఎల్ఎన్ ప్రసాద్, రాములు, వైష్ణవి, పర్వీన్ మోహిసిన్ పేర్లను ప్రతిపాదించారు. దస్త్రంపై గవర్నర్ సంతకం కాగానే ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేయనుంది.

ఇదీ లోకం!

హైకోర్టుకు ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్

రంజన్ మిశ్రా కమిషన్ మార్గదర్శకాలు పాటించలేదన్న పిటిషనర్

కౌంటర్ దాఖలుకు ఏపీ ప్రభుత్వానికి కోర్టు ఆదేశం

2 లో

పీవీ సునీల్‌కుమార్ సస్పెన్షన్ పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్ సస్పెన్షన్‌ను ప్రభుత్వం మరో నాలుగు నెలలు పొడిగించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. రివ్యూ కమిటీ సిఫార్సుల మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. అఖిల భారత సర్వీసు నిబంధనల ఉల్లంఘన అభియోగంపై సునీల్‌కుమార్‌పై వేటు పడింది. అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లినట్లు ఆయనపై ఆరోపణలున్నాయి. 2025 మార్చి 25న వివిధ అభియోగాలపై సునీల్ కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. 2019 డిసెంబరు నుంచి 2024 మార్చి మధ్య మొత్తం ఆరు సార్లు సునీల్‌కుమార్ ఇలా విదేశాల్లో

- మిగతా 2 లో

ఘనంగా 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం

పద్మవిభూషణ్, పద్మభూషణ్ అందుకున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ

8 లో

తాడిపత్రి మున్సిపల్ వైస్ చైర్మన్ 2గా

సీపీఐ కౌన్సిలర్ తలారి అరుణ

8 లో

బీజేపీకే రాజ్యసభ సీటు

పాకా వెంకట సత్యనారాయణ అభ్యర్థిత్వం ఖరారు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాన్ని ముందుగా ఊహించినట్లే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బీజేపీకి కేటాయించారు. అయితే అనూహ్యరీతిలో కొత్తపేరు తెరపైకి వచ్చింది. ఎన్డీయే అభ్యర్థిగా పాకా వెంకటసత్యనారాయణను ప్రకటించింది. ఆయన ప్రస్తుతం ఏపీ బీజేపీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారు. గతంలో భీమవరం మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా, బీజేపీ రాష్ట్ర ప్రతినిధిగా పనిచేశారు. విజయ సాయిరెడ్డి రాజీనామాతో రాజ్యసభలో ఒక స్థానం ఖాళీ అయిన విషయం తెల్సిందే. మరో రెండేళ్ల పదవీ కాలం ఉన్న నేపథ్యంలో ఉపఎన్నికకు ఎన్నికల సంఘం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. మంగళవారం

- మిగతా 2 లో

సమస్యను బాధ్యతాయుతంగా పరిష్కరించుకోండి

భారత్-పాక్‌లకు అమెరికా సూచన

వాషింగ్టన్: పహల్గాంలోని పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతలను ఇరు దేశాలు బాధ్యతాయుతంగా పరిష్కరించుకోవాలని అమెరికా విదేశాంగ శాఖ సూచించింది. 'పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ విషయంలో భారత్‌కు వాషింగ్టన్ అండగా ఉంటుంది. ఇది చాలా క్లిష్టమైన పరిస్థితి. భారత్-పాక్ మధ్య నెలకొన్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాం. పరిస్థితిని చక్కదిద్దేలా బాధ్యతాయుతమైన పరిష్కారం కోసం ఇరు దేశాలు కలిసి పని చేయాలని మేం ప్రోత్సహిస్తున్నాం' అని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఓ ప్రకటనలో వెల్లడించారు. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా పహల్గాం ఉగ్రదాడిపై మాట్లాడారు. ఈ దాడి చెత్త పని అని పేర్కొన్నారు. కశ్మీర్ సమస్యను భారత్-పాక్‌లు పరిష్కరించుకుంటాయని తాము నమ్ముతున్నట్లు వ్యాఖ్యానించారు.

గ్రూప్-1 పిటిషనర్లకు జరిమానా

విశాలాంధ్ర-హైదరాబాద్: తప్పుడు ప్రమాణ పత్రాలతో పిటిషన్ దాఖలు చేసిన గ్రూప్ -1 అభ్యర్థులకు రాష్ట్ర హైకోర్టు రూ.20వేల జరిమానా విధించింది. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనంలో అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ మొత్తం 19 మంది పిటిషన్ దాఖలు చేశారు. మెమోకు, వెబ్‌సైట్‌లోని మార్కులకు తేడాలున్నాయని పిటిషన్‌లో ఆరోపించారు. పునర్ మూల్యాంకనం చేసి మార్కులు పారదర్శకంగా వెల్లడించాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్లు తప్పుడు ప్రమాణ పత్రాలు దాఖలు చేశారని టీజీపీఎస్సీ తరపు న్యాయవాది కోర్టుకు వాదనలు వినిపించారు. ప్రాథమిక వివరాలను పరిశీలించిన కోర్టు... అభ్యర్థులు తప్పుడు అఫిడవిట్ ఇచ్చారని స్పష్టం చేసింది. వాస్తవాలను దాచిపెట్టి కోర్టును తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషనర్లపై చర్యలు తీసుకోవాలని జ్యుడీషియల్ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది.

కశ్మీరీ విద్యార్థినిపై దాడి

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ క్యాంపస్‌లో కశ్మీరీ మహిళా విద్యార్థిని(24)పై మెస్ వర్కర్ దాడి చేశాడు. ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో ఎంఏ రెండో ఏడాది చదువుతున్న విద్యార్థినిని మెస్‌లో పనిచేస్తున్న కార్మికుడు అబిద్ (22) కొట్టాడు. కాగా, వర్సిటీలోని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఈ దాడిని తీవ్రంగా ఖండించింది. ఇది తీవ్రమైన భద్రతా లోపమని పేర్కొంది.

పీవీ సునీల్‌కుమార్ సస్పెన్షన్ పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించినట్లు కూటమి ప్రభుత్వ విచారణలో తేలింది. దీంతో ఆయనను సస్పెండ్ చేస్తూ ఇటీవల సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఐడీ విభాగాధిపతిగా పీవీ సునీల్‌కుమార్ పనిచేశారు. జగన్ జమానాలో ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకుండా తరచూ విదేశాల్లో పర్యటించారన్న ఆరోపణలున్నాయి. ఒకటి, రెండు సందర్భాల్లో అనుమతి పొందినా, ఆ దేశాలకు కాకుండా వేరే దేశాలకు వెళ్లారు. ఇవన్నీ అనుమతి లేని పర్యటనలే. జార్జియా వెళ్లేందుకు అనుమతి తీసుకుని నేరుగా యూఏఈకి వెళ్లారని, అమెరికా వెళ్లేందుకు అనుమతి పొంది బ్రిటన్‌లో పర్యటించారన్న అభియోగాలున్నాయి.

సంయమం పాటించండి: చైనా

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఉద్రిక్త పరిస్థితుల్ని చల్లార్చే ఎటువంటి చర్యనైనా స్వాగతిస్తామని చైనా పేర్కొంది. ఈ నెల 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. పెగల్గాం దాడికి తామే కారణమని చెప్పుకున్న ద రెసిస్టెన్స్ ఫ్రంట్... ఇప్పుడు ఆ ఘటనతో తమకు సంబంధం లేదని చెప్పింది. ఉగ్రదాడి ఘటనపై తటస్థ విచారణకు సహకరించాలని పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ కోరారు.

పీఓకేలో అలజడి

(మొదటిపేజీ తరువాయి)

రెచ్చగొట్టేలా ఈ చానెల్స్ వ్యాప్తి చేసిన నేపథ్యంలో భారత్ ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. నిషేధం విధించబడిన యూట్యూబ్ చానల్స్‌లో డాన్,సమా టీవీ, ఏఆర్‌వై న్యూస్, బోల్ న్యూస్, రఫ్తార్, జియో న్యూస్‌తోపాటు సునో న్యూస్ తదితర వార్తా సంస్థలకు చెందిన యూట్యూబ్ చానళ్లు న్నాయి. అలాగే జర్నలిస్టులు ఇర్షాద్ భట్టి,అస్మా షిరాజీ,ఉమర్ చీమాతోపాటు మునీబ్ ఫరూక్‌ల యూట్యూబ్ చానెల్స్ కూడా నిషేధించినట్లు స్పష్టం చేసింది.

ఎల్‌ఓసీ వద్ద పాక్ కాల్పులు

జమ్మూ కశ్మీర్‌లోని కుప్వారా, పూంచ్ జిల్లాల్లో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఏప్రిల్ 27, 28 తేదీల మధ్య రాత్రి జరిగిన ఈ సంఘటనలో, పాకిస్థాన్ ఆర్మీ కవ్వింపు లేకుండా చిన్న ఆయుధాలతో కాల్పులు జరిపింది. ఈ క్రమంలో వెంటనే స్పందించిన భారత సైన్యం దాడులను తిప్పికొట్టింది. కుప్వారా జిల్లాలోని కేరన్ సెక్టార్‌లో, పూంచ్ జిల్లాలోని కృష్ణఘాటి సెక్టార్‌లో ఈ కాల్పులు జరిగాయి. పాకిస్తాన్ సైన్యం రాత్రి సమయంలో భారత సైనిక పోస్టులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు ప్రారంభించింది. పాకిస్తాన్ సైన్యం చిన్న ఆయుధాలతో పాటు ఆటోమేటిక్ రైఫిల్స్‌ను కూడా ఉపయోగించినట్లు భారత సైన్యం వెల్లడించింది. ఈ దాడులు దాదాపు గంటసేపు కొనసాగాయని, ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం నమోదు కాలేదని తెలిపింది.

భారత్‌పై ఆంక్షల ఫలితం...పాక్‌కు తీవ్ర నష్టం

ఇస్లామాబాద్: పహల్గాం దాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తిన నేపథ్యంలో పాక్ పై భారత్ అనేక ఆంక్షలు విధించగా... ప్రతిగా పాక్ కూడా భారత్‌ను దెబ్బతీసేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంది. కానీ ఆ నిర్ణయాలు ఆ దేశానికే తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. పహల్గాం ఘటన అనంతరం భారత్ నుంచి వచ్చే విమానాలకు ఆ దేశం తన గగనతలాన్ని పాక్ మూసివేసిన విషయం తెలిసిందే. ఆ ప్రభావం అంతర్జాతీయ విమాన సర్వీసులపై పడింది. ముఖ్యంగా ఢిల్లీ, ఇతర ఉత్తర ప్రాంత నగరాల నుంచి బయలుదేరే విమానాలు తాము చేరుకునే గమ్యస్థానాల దూరం పెరిగింది. విమాన ప్రయాణ సమయం, ఇంధన ఖర్చు పెరిగింది. అదే సమయంలో భారత్ విమానయాన సంస్థలతోపాటు పాక్ కూడా భారీగా నష్టపోతోంది. విమానాలు ఒక దేశ గగనతలం మీదుగా ప్రయాణించినప్పుడు ఆ దేశానికి 'ఓవర్‌ఫ్లైట్ ఫీజులు' చెల్లించాల్సి ఉంటుంది. పశ్చిమ దేశాలకు వెళ్లే భారత విమానాలు ఎక్కువగా పాకిస్థాన్ గగనతలాన్ని ఉపయోగిస్తుంటాయి. పాక్ గగనతలాన్ని వినియోగించుకున్నందుకు ఏటా మిలియన్ల డాలర్లు ఆ దేశానికి ఓవర్‌ఫ్లైట్ ఫీజుల కింద చెల్లిస్తుంటాయి. దీని ద్వారా పాక్‌కు ఏటా కోట్లాది డాలర్ల ఆదాయం సమకూరేది. తాజా ఆంక్షల వల్ల పాక్‌కు ఈ ఆదాయం నిలిచిపోనుంది. పాక్ ఏకంగా లక్షల డాలర్ల నష్టం చవిచూడాల్సి వస్తోంది. దీని ప్రభావం పాక్ ఆర్థిక వ్యవస్థపై గణనీయంగా ఉంటుందని ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. పాకిస్థాన్ గగనతలం మీదుగా ప్రయాణించే బోయింగ్ 737 విమానాలు ఓవర్‌ఫ్లైట్ ఫీజుగా దాదాపు 580 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. పెద్ద విమానాలకు ఈ ఫీజులు ఇంకా ఎక్కువగానే ఉంటాయి. తాజా నిర్ణయంతో ఓవర్ ఫ్లైట్ చార్జీల ద్వారానే ప్రతిరోజూ దాదాపు 232,000 డాలర్ల మేర పాక్ నష్టపోతోందని అంచనా. దీనికి తోడు ల్యాండింగ్, పార్కింగ్ వంటి ఇతర చార్జీలతో కలిపి రోజువారీ నష్టం దాదాపు 300,000 డాలర్ల వరకూ ఉంటుంది.

హౌతీలపై అమెరికా భీకర దాడి

సనా: యెమెన్ లోని హౌతీ తిరుగుబాటుదారులపై అమెరికా సైన్యం భీకర దాడులు చేస్తోంది. తాజాగా హౌతీల నియంత్రణలో ఉన్న వాయువ్య యెమెన్‌లోని ఆఫ్రికన్ వలసదారుల నిర్బంధ కేంద్రంపై అమెరికా వైమానిక దాడులు చేసింది. ఈ దాడిలో కనీసం 68 మంది మరణించినట్లు మీడియా నివేదికలు వెల్లడించాయి. సాదా ప్రావిన్స్‌లో జరిగిన ఈ దాడిలో 47 మంది గాయపడగా... చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అయితే, ఈ దాడిపై అమెరికా ఇంకా స్పందించలేదు. ఈ నెల 18న కూడా యెమెన్‌లోని కీలక ప్రాంతమైన రాస్ ఇసా చమురు పోర్టు లక్ష్యంగా అమెరికా విరుచుకుపడిన విషయం తెలిసిందే. అగ్రరాజ్యం జరిపిన వైమానిక దాడుల్లో 38 మంది మృతి చెందారు. మరో 102 మందికి గాయాలయ్యాయి. గత నెల 17న కూడా హౌతీలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. యెమెన్ రాజధాని సనా, సదా, హౌతీల బలమైన ప్రాంతం అల్‌బేద్, రాడాలపై అమెరికా సేనలు బాంబుల వర్షం కురిపించాయి. ఎర్రసముద్రంలో అగ్రరాజ్య నౌకపైకి హౌతీలు దాడికి సమాధానంగా అమెరికా పెద్దఎత్తున జరిపిన బాంబు దాడుల్లో 31 మంది మరణించగా, 100 మందికి పైగా గాయపడ్డారు. బాంబు దాడులతో ఆయా ప్రాంతాలు భూకంపం వచ్చినట్టు కంపించిపోయాయని స్థానికులు తెలిపారు.

ఉద్రిక్తతలకు దౌత్య పరిష్కారం వెతకండి

పాక్ ప్రధానికి నవాజ్ షరీఫ్ సూచన

ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులను దౌత్య మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ వ్యాఖ్యానించారు. 'రెండు అణ్వాయుధ దేశాల మధ్య శాంతిని పునరుద్ధరించేందుకు అందుబాటులో ఉన్న అన్ని దౌత్యమార్గాలను వినియోగించుకోవాలి' అని తన సోదరుడు, ప్రస్తుత ప్రధాని షెహబాజ్‌కు షరీఫ్ సూచించినట్లు వార్తలొచ్చాయి. నవాజ్ నివాసంలో వీరి మధ్య సమావేశం జరిగింది. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో పాక్ అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు వెల్లడించింది. భారత్‌పై దాడి చేసేందుకే 130 అణుబాంబులు సిద్ధంగా ఉంచినట్లు పాకిస్థాన్ మంత్రి హనీఫ్ అబ్బాసీ బహిరంగ బెదిరింపులకు దిగారు. 'మతం, ఆచారాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షల్లో హిందూ, ముస్లింలు వేర్వేరు. వీటి ఆధారంగానే రెండు దేశాలు ఉండాలనే భావన ఏర్పడింది. పాకిస్థాన్ ఏర్పాటుకు పూర్వీకులు ఎన్నో త్యాగాలు చేశారు. వాటిని ఎలా కాపాడుకోవాలో మనకు తెలుసు' అని పాక్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ వ్యాఖ్యలు చేసిన తరుణంలో నవాజ్ స్పందించారు.

ప్రపంచ దేశాల్లో ఎన్నారైల నిరసనలు

పహల్గాం బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్

ఫ్రీమాంట్ (కాలిఫోర్నియా): పహల్గాం ఉగ్ర దాడి తర్వాత ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాల్లో నివాసం ఉంటున్న ప్రవాస భారతీయులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. హిందువులకు వ్యతిరేకంగా జరుగుతున్న హింసపై ప్రపంచ దేశాలు స్పందించాలని డిమాండ్ చేశారు. కాలిఫోర్నియాలోని ఫ్రీమాంట్‌లో ఎన్నారైలు జాతీయ జెండాలు చేత పట్టి నిరసనలు తెలిపారు. 400 మందికిపైగా కాశ్మీరీ పండితులు, మిత్రులు, స్నేహితులంతా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పహల్గామ్ ఉగ్ర దాడికి వ్యతిరేకంగా గళమెత్తారు. అమెరికా, ఫ్రాన్స్, ఇంగ్లండ్, జర్మనీ, కెనడా, డెన్మార్క్, ఫిన్లాండ్, స్పెయిన్‌లో భారతీయులంతా రోడ్లపైకి వచ్చి భారీ నిరసనలు తెలిపారు. బాధితులకు న్యాయం చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు జేశారు. జాతీయ జెండాలను పైకి ఎత్తి ఊపారు. ఇలా పెద్ద ఎత్తున ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులంతా నిరసనలు తెలిపారు. పహల్గామ్ ఉగ్ర దాడిలో చనిపోయిన 26 కుటుంబాలకు న్యాయం జరగాల్సిందేనని డిమాండ్ చేశారు.

హైకోర్టుకు ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ వివాదాల్లో చిక్కుకుంది. 59 షెడ్యూల్డ్ కాస్ట్ ఉపకులాలను 3 గ్రూప్ లుగా విభజిస్తూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్డినెన్స్‌ను జైభీమ్ రావ్ భారత్ పార్టీ ప్రధాన కార్యదర్శి పరసా సురేష్ కుమార్ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం సోమవారం విచారణకు స్వీకరించింది. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్డినెన్స్ సుప్రీంకోర్టు మార్గ నిర్దేశాలకు వ్యతిరేకంగా ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తుంగలో తొక్కి ఎటువంటి శాస్త్రీయమైన డేటా తయారు చేయకుండా తప్పుల తడకగా ఆర్డినెన్స్ ఇచ్చారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన డేటాను శాస్త్రీయంగా పరిశీలించకుండా రిపోర్ట్ సమర్పించారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ ఆర్డినెన్స్ వల్ల లక్షలాదిమంది భవిష్యత్తు అంధకారమవుతుం దన్నారు. కమిషన్ ఇచ్చిన నివేదిక బహిర్గతం చేయకుండా ప్రజల నుంచి ఎటువంటి వినతులు స్వీకరించకుండా ప్రభుత్వం ఆమోదించిందని వివరించారు. ఈ పిటిషన్ విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరత్ సింగ్ ఠాకూర్, చీమలపాటి రవి ధర్మాసనం...రంజన్ మిశ్రా కమిటీ రిపోర్ట్ బహిర్గతం చేశారా అంటూ అడ్వకేట్ జనరల్‌ని ప్రశ్నించింది.

సుప్రీంకోర్టు ఉప కులాలకు సంబంధించిన డేటా సేకరించడానికి ఏమైనా మార్గ నిర్దేశాలు నిర్దేశించిందా అని ప్రశ్నించగా...కొంత సమయమిస్తే ప్రతి అంశాన్ని తమ కౌంటర్లో వివరిస్తామని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ వేసవి సెలవుల తర్వాత విచారణ చేస్తామని చెపుతూ, ఈలోగా ప్రభుత్వాన్ని పూర్తిస్థాయిలో కౌంటర్ దాఖలు చేయవలసిందిగా ఆదేశించింది.

విద్యార్థితో కోడి కోయించిన టీచర్‌పై వేటు

జైపూర్: పరీక్ష రాస్తున్న విద్యార్థిని ప్రభుత్వ ఉపాధ్యాయుడు మధ్యలో ఆపించాడు. అతడితో కోడి కోయించి, తోలు తీయించి, ముక్కలుగా కొట్టించాడు. కూర వండేందుకు మాంసాన్ని ఇంటికి పంపించాడు. ఈ విషయం గ్రామస్తుల దృష్టికి వెళ్లింది. మంత్రికి వారు ఫిర్యాదు చేశారు. ఆ టీచర్‌ను సస్పెండ్ చేశారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. వివరాలివి. కొటాడలోని ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు జరుగుతున్నాయి. తొమ్మిదో తరగతి విద్యార్థి రాహుల్ కుమార్ పరీక్ష రాస్తుండగా టీచర్ మోహన్‌లాల్ దోడా పిలిచాడు. విద్యార్థి రాస్తున్న పరీక్ష మధ్యలోనే ఆపించాడు. అతడిచేత కోడిని కోయించి మాంసాన్ని తన ఇంటికి పంపాడు. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు ఉపాధ్యాయుడు మోహన్‌లాల్ ప్రవర్తనపై మండిపడ్డారు. మంత్రి బాబులాల్ ఖరారీని కలిసి ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేయాలని విద్యాశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. మరోవైపు ప్రభుత్వ ఉపాధ్యాయుడు మోహన్‌లాల్ నెల కిందట స్కూల్ కుక్‌ను తొలగించాడు. నాటి నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందడం లేదు. అలాగే ఆ టీచర్ విద్యార్థులతో వ్యక్తిగత పనులు చేయిస్తున్నాడని స్థానికులు ఆరోపించారు. ఈ రిపోర్ట్ ఆధారంగా ఉపాధ్యాయుడు మోహన్‌లాల్‌ను విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు.

హోంగార్డుల భర్తీకి నోటిఫికేషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంట్ (సీఐడీ) విభాగంలో 28 మంది హోంగార్డులు(వలంటరీ సర్వీసెస్, కేటగిరి బి-టెక్నికల్, ఇతర విభాగాలు) పోస్టుల భర్తీకిగాను నోటిఫికేషన్ జారీజేశారు. మే 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. జనరల్ అభ్యర్థుల వయోపరిమితి 18 నుంచి 50 ఏళ్లలోపు ఉండాలి. ఈ పోస్టులకు ఇంటర్ విద్యను అర్హతగా భావించారు. అభ్యర్థులకు ఖచ్చితంగా కంప్యూటర్‌పై నాలెడ్జ్, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలి. బి.టెక్/ఎంసీఏ/బీసీఏ/బీఎస్సీ(కంప్యూటర్స్) కోర్సులు చేసిన వారికి పాధాన్యత ఇస్తారు. పూర్తి వివరాలను https://cid.appolice.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

పహల్గాం ఉగ్ర దాడి రికార్డ్ చేసిన పర్యాటకుడు

శ్రీనగర్ : జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్ర దాడికి సంబంధించిన కొత్త వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. బైసరన్ వ్యాలీలో పర్యటించేందుకు వచ్చిన అహ్మదాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి తనకు తెలియకుండానే ఉగ్ర దాడిని రికార్డు చేశాడు. జిప్‌లైన్‌పై రైడ్ చేస్తున్నప్పుడు అతను సెల్ఫీ వీడియో తీసుకోగా... అందులో ఉగ్ర దాడి దృశ్యాలు కనిపించాయి. జిప్‌లైన్‌పై ప్రయాణిస్తూ అతను కేరింతలు కొడుతుండగా... దిగువన ఉన్న వ్యక్తుల కేకలు, తుపాకీ శబ్దాలు అందులో రికార్డయ్యాయి. ఉగ్ర దాడి ఘటనలో ఒక వ్యక్తి నేలకొరిగిన దృశ్యాలు ఆ వీడియోలో కనిపించాయి. అయితే దిగువన జరుగుతున్న విషయాలేవీ ఆ పర్యాటకుడు గుర్తించకపోవడం గమనార్హం. తన చెవులు కప్పి ఉంచడం వల్ల వినిపించకపోయి ఉండొచ్చని పేర్కొన్నారు. దీనికితోడు రైడ్‌కు ముందు జిప్‌లైన్ ఆపరేటర్ వ్యవహార శైలి తీరు పైనా అనేక మంది అనుమానం వ్యక్తం చేశారు.

సామాజిక మాధ్యమాల్లో భారత్‌కు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ నడుమ ఉద్రిక్త వాతావరణం నెలకొన్న తరుణంలో భారత్‌కు వ్యతిరేకంగా కొంతమంది తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు. తాజాగా భారత సైన్యం సన్నద్ధతకు సంబంధించిన రహస్య పత్రాలు బయటకొచ్చాయంటూ పాక్ అనుకూల సామాజిక మాధ్యమ ఖాతాల్లో పోస్టులు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై కేంద్రం స్పందిస్తూ.. వాటిని నకిలీ పత్రాలుగా కొట్టిపారేసింది. "భారత సైన్యం సంసిద్ధతకు సంబంధించిన రహస్య పత్రాలు లీకయ్యాయంటూ కొన్ని పాకిస్థాన్ అనుకూల సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టులు కనిపిస్తున్నాయి. అయితే, అవి తప్పుడు విషయాన్ని పేర్కొంటున్నాయి. సంబంధిత పత్రాలు నకిలీవి. అధికారికంగా ధ్రువీకరించని వివరాలను ఎవరూ షేర్ చేయొద్దు. కచ్చితమైన సమాచారం కోసం కేంద్ర ప్రభుత్వ అధికారిక ప్రకటనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోండి" అని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం 'ఎక్స్' వేదికగా పోస్ట్ పెట్టింది. అంతకుముందు.. సైన్యం ఆధునికీకరణ కోసం విరాళాలు సేకరిస్తున్నారని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ బ్యాంకు ఖాతా తెరిచిందంటూ చక్కర్లు కొడుతున్న ఓ సందేశాన్నీ కేంద్రం కొట్టిపారేసింది. వాట్సప్‌లో తప్పుడు ప్రచారం జరుగుతోందని రక్షణశాఖ స్పష్టం చేసింది.

డాక్టర్ కే.ఎస్.రావుకు జీ న్యూస్ పురస్కారం

న్యూఢిల్లీ: కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు ప్రముఖ మీడియా సంస్థ జీ న్యూస్ ప్రత్యేక పురస్కారం లభించింది. న్యూఢిల్లీలో నిర్వహించిన జీ విద్యా సమ్మేళనంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కే.ఎస్. రావుకు పురస్కారం ప్రదానం చేశారు. విద్యా రంగంలో ప్రతిభను ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఉత్తమ విధానాలను పంచుకోవడానికి జీ న్యూస్ ఎడ్యుకేషన్ కాంక్లేవ్ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా విద్యా వ్యవస్థను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి అనుసరించవలసిన దార్శనికత పైన డాక్టర్ కే శ్రీనివాసరావు ప్రసంగించారు. సాహిత్యం ద్వారా విద్యారంగానికి కేంద్ర సాహిత్య అకాడమీ అందించిన సేవలను వివరించారు.

ఓటీటీ, సోషల్ మీడియాలో 'అశ్లీల కంటెంట్'

కేంద్రానికి సుప్రీం నోటీసు

న్యూఢిల్లీ: ఓటీటీలతో పాటు సోషల్ మీడియాల్లో అశ్లీల కంటెంట్‌ను నిషేధించాలా... వద్దా అన్న అంశంపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వ వివరణ కోరింది. ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయ స్థానం కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. సెక్సువల్ కంటెంట్ స్ట్రీమింగ్ విషయంలో తీసుకోవాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన నిబంధనల గురించి వెల్లడించాలని కేంద్రాన్ని కోరింది. జస్టిస్ బీఆర్ గవాయి, ఆగస్టిన్ జార్జ్ మాషితో కూడిన ధర్మాసనం ఈ అంశాన్ని విచారించింది. ఓటీటీతో పాటు సోషల్ మీడియాల్లో అశ్లీల కంటెంట్ అంశంపై నిర్ణయం తీసుకునే అధికారం ఎగ్జిక్యూటివ్, శాసన వ్యవహారాల పరిధిలో ఉంటుందని కోర్టు చెప్పింది. ఎగ్జిక్యూటివ్, శాసన వ్యవహారాలను ఆక్రమిస్తున్నట్లు ఇప్పటికే సుప్రీంకోర్టుపై ఆరోపణలు వస్తున్నాయని జస్టిస్ గవాయి తన తీర్పులో చెప్పారు. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. సెక్సువల్ కంటెంట్ అంశంలో ప్రభుత్వమే ఏదైనా చేయాలని సుప్రీం ధర్మాసనం తుషార్ మెహతాను కోరింది. ప్రస్తుతం కొన్ని నిబంధనలు అమలులో ఉన్నాయని, కొన్నింటి అంశంలో సమాలోచనలు జరుగుతున్నట్లు ఆయన చెప్పారు. పిటీషనర్ల తరపున అడ్వకేట్ విష్ణు శంకర్ జైన్ వాదించారు. లైంగిక ప్రేరేపిత కంటెంట్‌ను నియంత్రించే అంశంలో నిబంధనలు రూపొందించాలని నేషనల్ కంటెంట్ కంట్రోల్ అథారిటీని అయిదుగురు పిటీషనర్లను కోరారు. ఆ పిల్‌పై సోమవారం సుప్రీం వాదనలు చేపట్టింది. కేంద్రంతో పాటు ఎక్స్ కార్పొరేషన్, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్, ఉల్లు డిజిటల్, ఆల్ట్‌బాలాజీ, ఎంయూబీఐ, గూగుల్, యాపిల్, మెటా సంస్థలకు కూడా సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది.

పోలీసు అధికారిపై సిద్ధరామయ్య దురుసు ప్రవర్తన

బెంగళూరు: కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరో వివాదంలో చిక్కుకున్నారు. పాక్‌తో యుద్ధం వద్దంటూ చేసిన వ్యాఖ్యలతో ఇటీవల వార్తలకెక్కిన సిద్ధూ... తాజాగా ఓ పోలీసు అధికారిపై దురుసుగా ప్రవర్తించి మరోసారి వార్తల్లో నిలిచారు. తాను ప్రసంగించబోయే సభా ప్రాంగణం వద్ద గందరగోళం ఏర్పడడంతో సహనం కోల్పోయిన ఆయన.. పోలీసు అధికారిపై చేయి చేసుకోబోయారు. దీంతో సిద్ధరామయ్య చర్యను ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. బెళగావిలో సోమవారం జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న సిద్ధరామయ్య తాను ప్రసంగించబోయే సమయంలో ప్రాంగణంలో బీజేపీ మహిళా మోర్చా సభ్యులు నల్ల జెండాలతో సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. తన ప్రసంగానికి ఆటంకం కలిగిస్తుండటంతో సభా బాధ్యతలను చూస్తున్న పోలీసు అధికారి ఏఎస్పీ భరమణిని పిలిచి సీఎం మందలించారు. ఈ క్రమంలోనే సహనం కోల్పోయి చేయి ఎత్తి... అంతలోనే వెనక్కి తగ్గారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో జేడీఎస్ 'ఎక్స్'లో పోస్టు చేసింది. పోలీసు అధికారితో సీఎం వ్యవహరించిన తీరును తప్పుబట్టింది. "మీ అధికారి కేవలం ఐదేళ్లే. ప్రభుత్వ అధికారి 60 ఏళ్లు పాటు సేవలందిస్తారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని గుర్తుంచుకోండి" అంటూ పోస్ట్ చేసింది. పోలీసు అధికారి పట్ల దురుసుగా వ్యవహరించినందుకు ఆయనకు క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్ చేసింది.

అమరావతి ఏపీకి ఆత్మ

ఏపీ సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రానికి అమరావతి ఆత్మ వంటిదని, రాజధాని పనుల పున: ప్రారంభానికి మే 2న రాష్ట్రానికి వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలకడంతో పాటు సభను విజయవంతం చేద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. అమరావతి రాజధాని తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నేతలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ పర్యటనపై ఎన్డీఏ నేతలతో సీఎం సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఒక కుటుంబం నివసించేందుకు మంచి ఇల్లు ఉండాలని ఎలా అనుకుంటామో ప్రజలు గర్వంగా చెప్పుకోవడానికి కూడా రాజధాని ఉండాలి. అభివృద్ధి వికేంద్రీకరణ ఎన్డీఏ విధానం అయినందునే 2014 నుంచి కేంద్ర విద్యా సంస్థలు ఉత్తరాంధ్ర, కోస్తా, సీమ జిల్లాల్లో ఏర్పాటు చేశాం. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తాం. తెలంగాణకు హైదరాబాద్, కర్నాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై రాజధానుల ద్వారా 70 శాతం ఆదాయం వస్తోంది. మనకు కూడా పెద్ద నగరం ఉంటే రాష్ట్రానికి సమృద్ధిగా ఆదాయం సమకూరుతుందని అమరావతిని నిర్మిస్తున్నామని తెలిపారు.

రాజధాని నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని, వారు ఇచ్చిన భూముల్లోనే రాజధాని నిర్మించడంతో పాటు తిరిగి వారికి రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లు అభివృద్ధి చేసి ఇస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాజధానిలో రైతులను భాగస్వాములను చేస్తున్నాం.

రాష్ట్రానికి పరిశ్రమలు వస్తే యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయి. రోడ్ల నిర్మాణం జరిగితే రవాణా సౌకర్యం పెరగడంతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. కానీ కొన్ని వ్యతిరేక శక్తులు కుట్రతో ప్రజలను కావాలనే తప్పుదోవ పట్టిస్తాయి అన్నారు.

నావికాదళంలోకి 'రఫేల్'

(మొదటిపేజీ తరువాయి)

రానున్నాయి. దీంతోపాటు వీటి నిర్వహణ, స్పేర్లు, లాజిస్టికల్ సపోర్ట్, శిక్షణకు సంబంధించిన అంశాలు సకాలంలో పూర్తయ్యేలా ఫ్రాన్స్ ప్రభుత్వం చూసుకుంటుంది. వాయుదళ శక్తిని పటిష్టం చేసే లక్ష్యంతో రఫేల్ యుద్ధ విమానాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. శక్తిమంతమైన ఆధునిక ఆయుధ వ్యవస్థలను కలిగి ఉండే రఫేల్ యుద్ధ విమానాలు భారత నౌకాదళ పోరాట శక్తిని బలోపేతం చేయనున్నాయి. నాలుగేళ్లలో రఫేల్ యుద్ధ విమానాల సరఫరా ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఒప్పందం ప్రకారం... తొలిబ్యాచ్ 2029లో రావొచ్చని... 2031 నాటికి మొత్తం చేతికొచ్చే అవకాశాలున్నాయి.

బీజేపీకే రాజ్యసభ సీటు

(మొదటిపేజీ తరువాయి)

మధ్యాహ్నం 3 గంటలతో నామినేషన్ గడువు ముగియనున్న నేపథ్యంలో సోమవారం కూటమి పార్టీ వర్గాల్లో ఉత్కంఠత రేగింది. తమిళనాడుకు చెందిన అన్నామలై, ఎంఆర్‌పీఎస్ అధినేత మందా కృష్ణమాదిగ, స్మృతి ఇరానీ తదితరుల పేర్లు వెలుగులోకి వచ్చాయి. చివరి నిముషంలో వెంకట సత్యనారాయణకు అభ్యర్థిత్వం ఖరారైంది. బీజేపీ అధిష్టానం ఆదేశాలతో ఏపీ కోర్ కమిటీ సోమవారం సమావేశమైంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రస్తుతం యూరప్ పర్యటనలో ఉన్నారు. ఆమె అక్కడ నుంచే కోర్ కమిటీ నేతలతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. పాకా వెంకటసత్యనారాయణవైపు మొగ్గు చూపిన పార్టీ అధిష్టానం రాజ్యసభ అభ్యర్థిగా ఖరారు చేసింది.

విద్యార్థులు స్వీయ లక్ష్యాలతో ముందుకు సాగాలి : మంత్రి కొండా సురేఖ

విశాలాంధ్రబ్యూరో - సంగారెడ్డి : విద్యార్థులు సంప్రదాయ మార్గాలను మాత్రమే ఆశ్రయించకుండా, స్వీయ లక్ష్యాలతో ముందుకు సాగాలని అటవీ, దేవాదాయ ధర్మాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం హత్నూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ రెసిడెన్షియల్ కళాశాలలో ఒక కోటి రూపాయలతో నిర్మించిన భోజన శాలకు, 60.50 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లకు, ఎంపీ రఘు నందన్ రావు, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎమ్మెల్సీ అంజిరెడ్డిలతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తుకు ఉత్తమ పునాది వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో రాష్ట్రంలోనే ఉత్తమ ర్యాంకులు సాధించిన 25 మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శాలువాతో సత్కరించి మొమెంటులో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో కాకుండా ఉజ్వలమైన భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ఈ కళాశాలల్లో ఐఐటి, జేఈఈ లకు శిక్షణ కార్యక్రమాన్ని అందిస్తున్నామని, విద్యార్థులకు అన్ని విధాలుగా అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మెదక్ జిల్లా గ్రంధాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, అదనపు కలెక్టర్ మాధురి, ఆర్‌డిఓ రవీందర్ రెడ్డి, తాసిల్దార్ పర్వీన్ షేక్, కళాశాల ప్రిన్సిపల్ మధుసూదన్, కళాశాల అధ్యాపకులు, ప్రజా ప్రతినిధులు, తల్లితండ్రుల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భూభారతి చట్టం సులభతరమైనది : కలెక్టర్

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్/ తొర్రూరు: చారిత్రాత్మకం, సులభతర పారదర్శకమైనది, నూతన భూభారతి చట్టం 2025, సామాన్యులకు బడుగు, బలహీన వర్గాల రైతులు, ప్రజలందరికీ న్యాయమైన సత్వర సేవలు, భూ సమస్యను క్షేత్రస్థాయిలోనే పరిష్కార మార్గం చూపే భూభారతి చట్టమని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. సోమవారం పెద్ద వంగర, తొర్రూరు మండలాల రైతు వేదికలలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే.వీర బ్రహ్మచారి, రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, తదితరులు హాజరై తెలంగాణ గీతం ఆలపించి, ఆర్డీఓ గణేష్ పిపిటి, చదివి భూభారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టం 2025 పై అవహన కల్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ధరణి వలన రెవెన్యూ అధికారులు సమస్యలను పరిష్కరించలేకపోయారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన భూభారతి ఆర్.ఓ.ఆర్ చట్టం-2025 ద్వారా ప్రతి భూసమస్యకు పరిష్కార మార్గాలు సెక్షన్ల వారిగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏడి ఎస్‌ఎల్‌ఆర్ ఏ.నరసింహ మూర్తి, స్థానిక తహసిల్దార్లు మహేందర్, శ్రీనివాస్ ఎంపిడిఓలు వేణుమాధవ్, పూర్ణచందర్ రెడ్డి, ఎడిఏ విజయ్ చంద్ర పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్ : ప్రజావాణిలో ఫిర్యాదు చేసే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. సోమవారం ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 78 దరఖాస్తులను వచ్చాయని వాటిని అధికారులు సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్ ఆర్డీఓ కృష్ణవేణి, సి.పి.ఓ సుబ్బారావు, డి.సి.ఓ వెంకటేశ్వర్లు, డి.హెచ్.ఎస్.ఓ మరియన్న, బి.సి, ఎస్.సి డెవలప్మెంట్ అధికారులు నరసింహ స్వామి, శ్రీనివాసరావు, గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్, జి.ఎం.ఇండస్ట్రీస్ శ్రీమన్నారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు దేశారాం, ఎంప్లాయ్ మెంట్ అధికారి రజిత, హౌసింగ్ అధికారి రాజయ్యఎల్.డి.ఎం సత్యనారాయణ మూర్తి, పెన్షన్ విభాగం అధికారి శంకర్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ పవన్ కుమార్, వివిధ మండలాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి చలువ కళ్ళజోళ్ళు, వాటర్ బాటిల్స్ పంపిణీ

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల వాసవి, వనిత క్లబ్బుల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బందికి గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి సహకారంతో ఎండకి చలువ కళ్ళజోళ్లను, స్థానిక శ్రీ సాయి స్టీల్ అండ్ జనరల్ స్టోర్స్ యజమాని ఐత శంభు లింగం సహకారంతో వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. ఎస్ఐ రవీందర్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బందికి పంపిణీ చేశారు. గవర్నర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది ఎండ తీవ్రతతో, దాహంతో ఇబ్బందులు ఎదుర్కొంటారని వీటి నుండి కొంత మేరకు ఉపశమనం పొందడానికి కళ్ళజోళ్ళు వాటర్ బాటిల్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. డిస్ట్రిక్ట్ పిఆర్‌ఓ గరిణె అరుణకుమారి, ఐఐసి అధికారులు పవిత్రం శ్రీనివాస్, రేణిగుంట్ల శ్రీనివాస్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఉప్పల విద్యాసాగర్, జిల్లా ఆరోగ్య శిబిరాల ఇంచార్జ్ రాచకొండ శ్రీనివాసరావు, జిల్లా సాంప్రదాయాల ఇంచార్జ్ విరవల్లి శ్రీలత కోటేశ్వరరావు, రీజియన్ చైర్మన్ వెచ్చ సతీష్, జోన్ చైర్మన్ గెల్లి లక్ష్మీ నరసింహారావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు ఐత కృష్ణ సుమంత్, వనిత క్లబ్ అధ్యక్షురాలు గరిణెజ్యోతి, మాజీ అధ్యక్షుడు ఊటుకూరు నటరాజ్ పాల్గొన్నారు.

మే 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కొమురం భీం : కాగజ్ నగర్ పట్టణంలో సిఐటియు అనుబంధ సంఘాల సమావేశం కృష్ణమాచారి అధ్యక్షతన కాగజ్ నగర్‌లోని రిటైర్మెంట్ భవన్‌లో జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు గారు మాట్లాడుతూ మే ఒకటో తేదీన ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే స్ఫూర్తితో నాడు 18 గంటల పని విధానం నుండి 8 గంటలకు కార్మికులు పోరాడి సాధించుకున్న చరిత్ర వున్నది. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ. మరోవైపు ధరలు విపరీతంగా పెంచి పేద ప్రజలపై మోయలేని భారాలు వేస్తుంది అని బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తున్నదని, విమర్శించారు. కార్మికవర్గ సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాల్లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లను ముందుకు తీసుకొచ్చి కార్మికులను కట్టు ఆధునిక బానిసత్వంలోకి నెట్టే కుట్ర చేస్తున్నారని దుయ్యబట్టారు.

జిల్లాను సస్యశ్యామలం చేస్తాం : మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ఉమ్మడి నల్గొండ జిల్లాలో చేపట్టిన అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని బక్కతాయి కుంట వద్ద 20 కోట్ల 22 లక్షల రూపాయల అంచనాతో నిర్మించనున్న బక్కతాయకుంట లిఫ్ట్ ఇరిగేషన్‌కు 6 కోట్ల 8 లక్షలు రూపాయలతో నిర్మించే పునుగోడు ఎత్తిపోతల పథకానికి, 19.95 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నర్సింగ్ బట్ల ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేశారు. అంతేకాక 36 కోట్ల రూపాయల వ్యయంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్మించనున్న అదనపు బ్లాక్‌కు శంకుస్థాపన చేశారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫోటో ప్రదర్శనను తిలకించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం నల్గొండ జిల్లాలో ఎలాంటి ఇరిగేషన్ పనులు చేపట్టలేదని తెలిపారు. ఎన్నో ఏళ్ల నుండి రైతులు ఎదురుచూస్తున్న డిండి లిఫ్ట్ ఇరిగేషన్‌కు ఎదుల ద్వారా నీరు అందించేందుకు తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 1800 కోట్ల రూపాయలను మంజూరు చేసి పనులు మొదలు పెట్టామన్నారు. అలాగే హై లెవెల్ కెనాల్ కు 442 కోట్లు మంజూరు చేశామని, పిల్లాయ పల్లి కాలువ, శివన్న గూడెం నుండి నారాయణపూర్, చౌటుప్పల్ మీదుగా సాగునీరు అందించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ తప్పనిసరిగా మంజూరు చేస్తామని ప్రకటించారు. మూసిని పునరుద్ధరణ చేసి ఉమ్మడి నల్గొండ జిల్లా రైతులకు మేలు చేస్తామన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ 36 కోట్ల రూపాయలతో జిల్లా కలెక్టర్ కార్యాలయం అదనపు బ్లాకుకు శంకుస్థాపన, సుమారు 50 కోట్ల రూపాయలతో ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేయడం సంతోషమని తెలిపారు. ఉద్యోగులకు మంచి వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఆర్ అండ్ బి శాఖ ద్వారా 36 కోట్లు రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, 9 నెలల్లో ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే ఇది వరకే బయట ఉన్న డీఈఓ, డిఎంహెచ్ కార్యాలయాలు సైతం జిల్లాబ్ కలెక్టర్ కార్యాలయానికి వస్తాయని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం సన్న బియ్యం పథకాన్ని ఇస్తున్నదని, ప్రతినెల మొదటి తేదీన ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని, దీనితో పాటు, అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - తొర్రూర్: రైతులు పండించిన వరి ధాన్యాన్ని రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే. వీరబ్రహ్మ చారి రెవిన్యూ డివిజనల్ అధికారి గణేష్, సంబంధిత సిబ్బందితో కలిసి పెద్ద వంగర, మండల కేంద్రం, తొర్రూరు మండలం వెలికట్టే గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార శాఖ ఆధ్వర్యంలో నడిచే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి ప్యాడి క్లీనర్, మాయిశ్చర్ ధాన్యానికి సంబంధించిన రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని, వేసవికాలం నేపథ్యంలో కావలసిన మౌలిక వసతులు కల్పించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించా లని, ధాన్యానికి సంబంధించిన రైతు వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి డబ్బులు త్వరగా వారి ఖాతాలలో జమ అయ్యే విధంగా సంబంధిత కేంద్రాల నిర్వహకు లు చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోళ్ల కేంద్రాలలో రైతులకు సరిపడా గన్ని సంచులు, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.కలెక్టర్ వెంట పిఎసిఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, స్థానిక తహసీల్దారులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - ములుగుజిల్లాబ్యూరో : పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 53 మంది తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అట్టి అర్జీలను సత్వరమే పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దర్బార్ లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించాలి : పిఓ

ఏటూరునాగారం ఐటిడిఏ గిరిజన దర్బార్‌లో అందచేసిన, దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని, ఏటూరునాగారం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి చిత్ర మిశ్రా సెక్టర్ అధికారులని ఆదేశించారు. సోమవారం ఐటడిఏ పిఓతో పాటు సెక్టర్ అధికారులతో కల్సి గిరిజన దర్బార్ నిర్వహించారు.దర్బార్లో మూడు దరఖాస్తు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఏఓ యం రాజ్ కుమార్, మేనేజర్ శ్రీనివాస్, పీసా కోర్డినేటర్ కొమురం ప్రభాకర్, మహేందర్, శిరీష్, ప్రభాకర్, జగన్ మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాకుల ఆలయ హుండీ ఆదాయం రూ.2,88,593

విశాలాంధ్ర- మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రసిద్ధిగాంచిన మాకుల వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీఆదాయం రూ. 2,88,593లు వచ్చినట్లు ఆలయ ఈఓ కలకోట వేణుగోపాల్ సోమవారం తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సమత కార్యనిర్వాహణాధికారి కలకోట వేణుగోపాల్, వ్యవస్థాపక చైర్మన్ నల్లాన్ చక్రవర్తుల జగన్నాధాచార్యుల పర్యవేక్షణలో హుండీని లెక్కించారు. 28 మార్చి నుంచి ఏప్రిల్ 28 వరకు జరిగిన స్వామివారి వార్షిక బహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన జాతర సందర్భంగా 30 రోజులకు గానూ రూ. 2,88,593లు ఆదాయం ఉన్నట్లు తెలిపారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గంట్ల రంగారెడ్డి, బోడ రమేష్, అర్చకులు నల్లాన్ చక్రవర్తుల లక్ష్మణాచార్యులు, లక్ష్మీ నర్సింహాచార్యులు, రాఘవాచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనాధ శరణాలయాన్ని సజావుగా నడపండి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : అశ్వారావుపేట మండలం వినాయకపురంలో ఉన్న పిల్లల ఆశ్రమాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్ సందర్శించారు. న్యాయమూర్తి పిల్లలకు అందిస్తున్న కనీస సౌకర్యాల గురించి ఆశ్రమ నిర్వహకుడిని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన పిల్లలకు సంరక్షణ, విద్య, ఆహారం తదితర అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. న్యాయమూర్తి రిజిస్టర్ లు, ఆశ్రమం ఆవరణ, కిచెన్ రూమ్, స్టోర్ రూమ్, సౌచలయాలును పరిశీలించారు. ఆశ్రమంను సజావుగా నిర్వహించాలని చెప్పారు. డిప్యూటీ కౌన్సిల్ పి. నిరంజన్‌రావు, అశ్వారావుపేట ఎస్.ఐ రామ్మూర్తి పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: చెక్ బౌన్స్ కేసుల విషయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక లోక్ అదాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ కోరారు. జూన్ 9 నుండి 14 వరకు ప్రత్యేక లోక్ అదాలత్ ను నిర్వహించడం జరుగుతుందన్నారు. సోమవారం దమ్మపేట కోర్ట్‌లో న్యాయవాదులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో బ్యాంకు, చిన్న చిన్న ఆర్థిక సంస్థలు, ప్రతివాదులు అందరు వారి సంబంధిత కోర్టులకు వెళ్లి రాజీ కొరకు ప్రయత్నం చేసి త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మేజిస్ట్రేట్ భవాని, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి. నిరంజన్‌రావు, దమ్మపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సతీష్, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

విశాలాంధ్ర - ఖమ్మం : ఖమ్మం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని సిపిఐ నగర కార్యదర్శి ఎస్కె జానిమియా తెలిపారు. నగరంలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. సిపిఐ ఖమ్మం నగర 53, 66, 58 డివిజన్ల సంయుక్త సమావేశం సోమవారం స్థానిక రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. సైదా అధ్యక్షతన జరిగిన సమావేశంలో జానిమియా మాట్లాడుతూ ఖమ్మం నగరం దశాబ్ద కాలంలో విస్తరించిందని జిల్లాలోని నాలుగింట ఒక వంతు జనాభా ఖమ్మం నగరంలోనే జీవిస్తున్నారని ఆయన తెలిపారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనలో పాలకులు విఫలనువుతున్నారన్నారు. నగరంలో పేదలను గుర్తించి వారందరికి నివాస స్థలాలు పంపిణీ చేయడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని జానిమియా డిమాండ్ చేశారు. మేడేను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని జానిమియా పిలుపునిచ్చారు. ఈ మహాసభలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, తాటి వెంకటేశ్వర రావు, మేకల శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు తాటి నిర్మల, నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, పట్టణ నాయకులు జ్వాలా నర్సింహారావు, చానా, భద్రం, అల్లాభక్షి పాల్గొన్నారు.

ఘనంగా అమరవీరుల సంస్కరణ వారోత్సవాలు

విశాలాంధ్ర - గూడూరు: ఎంసిపిఐ (యు) పార్టీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్కరణ వారోత్సవాలు సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అమర వీరుల చిత్రపటాలకు పూల మాలలు వేశారు. ఎంసిపిఐ(యు) పార్టీ మహబూబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ పార్టీ నాయకత్వంలో ప్రజా ఉద్యమాల కొరకు వారు ప్రాణాలను త్యాగం చేశారని స్మరించుకున్నారు. అమరవీరులైన పెసరి. సంజీవ, జోగ చంద్రయ్య, జోగరంగమ్మ, జల్లి వెంకన్న, ఎస్ కే యాకూబ్ జానీ, కిషన్ నాయక్‌లు ప్రజా ఉద్యమంలో అనారోగ్యం భారిన పడి మరణించడం జరిగిందని వారి ఆశయాలను ఎల్లప్పుడు సాధిస్తామని సమ సమాజ స్థాపన కోసం పాటుపడాలని అప్పుడే అమరవీరుల ఆశయాలను సాధించే వారిమయితామని కంచ వెంకన్న తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్ మండల కార్యదర్శి బంధాల వీరస్వామి, కటకం బుచ్చి రామయ్య, ధరావత్ రమేష్, బండారి సత్యం, కిషన్లు ఉన్నారు.

సింగరేణి ఉచిత వేసవి శిక్షణ శిబిరం

విశాలాంధ్ర ప్రతినిధి -పెద్దపల్లి, సింగరేణి : సింగరేణి ఆర్ జి 1 ఏరియా క్రీడా మైదానంలో వివిధ క్రీడలలో శిక్షణ ఇచ్చేందుకు, అదే విధంగా సింగరేణి స్కూల్ లో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహించేందుకు విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నామని సింగరేణి ఆర్జీ వన్ డిప్యూటీ పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ ఆర్జీ వన్ ఏరియాలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు, మాజీ ఉద్యోగుల పిల్లలకు, పరిసర ప్రభావిత ప్రాంత పిల్లలకు నెల రోజుల పాటు ఈ శిబిరం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన పర్సనల్ డిపార్ట్మెంట్, జియం ఆఫీస్‌లో కలిసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు



విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ పట్టణంలో పోలీస్ వాహన తనిఖీలో మైనర్ అయినా పిల్లలు వాహనాలు నడిపి స్తున్న వారిని గుర్తించి అట్టి మోటార్ సైకిల్స్‌ని పోలీస్‌స్టేషన్‌కి తరలించి మైనర్లు డ్రైవింగ్ చేస్తున్న వారి తల్లిదండ్రులని ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌కి పిలిపించి కౌన్సెలింగ్ చేసి మైనర్ డ్రైవింగ్‌పై అవగాహనా కలిపించామని ఖానాపూర్ సిఐసిహెచ్ అజయ్ ఖానాపూర్ ఇంచార్జి ఎస్సై శ్రావణి తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : కోడిపందాలు, పేకాట, బెట్టింగుల లాంటి అసాంఘిక కార్యకలాపాలకు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హెచ్చరించారు. సోమవారం ఆయన దమ్మపేట పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కోడిపందాలు, పేకాట, బెట్టింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పట్టుకుంటామని హెచ్చరించారు. దొంగల ముఠాల కదలికలపై నిఘా పెంచి కట్టడికి కృషి చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట సిఐ నాగరాజు రెడ్డి, దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భూమి ఉన్న ప్రతి రైతుకు

భూ భద్రత కల్పిస్తాం : మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ప్రతి పౌరుల గుర్తింపుకు ఆధార్ కార్డు లాగే భూభారతి చట్టం ద్వారా ప్రతి భూమికి ఆధార్ ఉంటుందని రెవిన్యూ, గృహ నిర్మాణ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అశ్వరరావు పేటలోని ఫంక్షన్ హాల్‌లో నూతన రెవెన్యూ చట్టం భూభారతి పై నిర్వహించిన అవగాహన కార్యక్రమం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధ్యక్షతన జరిగింది. మంత్రి మాట్లాడుతూ భూమి హక్కులను రక్షించడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమన్నారు. దశాబ్దాలుగా తెలంగాణలో భూ రికార్డుల నిర్వహణలో చాలా తప్పులు ఉన్నాయన్నారు. తెలంగాణ భూభారతి చట్టం ద్వార ఇప్పుడు అవన్నీ పరిష్కారం అవుతాయని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టిన ప్రజల ప్రయోజనార్థం కోసమే ప్రవేశపెడుతుందని వెల్లడించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వివాదాలు పరిష్కరించడానికి కూడా ప్రత్యేక కార్యచరణ ఉందన్నారు. భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఆర్డీవో డి మధు, జిల్లా, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆక్యూపంక్చర్ థెరపీలో మరో ముందడుగు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ఆక్యుపంచర్, అక్యుప్రెషర్ సైన్స్ ప్రాక్టీస్‌లో జిల్లాలో ప్రముఖ స్థానం సంపాదించుకున్న హీలర్ సుగుణా రావు మరో సర్టిఫికెట్ అందుకోవడంతో ఆయనను పలువురు అభినందించారు. సికింద్రాబాద్లోని వెస్ట్ మారేడుపల్లి మహర్షి యోగ సెంటర్లో, ప్రముఖ ఆక్యుపంచరిస్ట్, ట్రైనర్, డా.రవీందర్ రాజు ఆధ్వర్యంలోని స్పర్శ ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెస్సర్ యోగ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహించిన ఎక్స్ట్రా ఆర్డినరీ వెస్సెల్స్ (ఇ.ఒ.వి) కోర్సును కొత్తగూడెం కు చెందిన పూర్తి చేసి సుగుణరావు పూర్తి చేసారు. దింతో ప్రముఖ ప్రకృతి కవి, కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమ వ్యవస్థాపకులు జయరాజు, పర్యావరణవేత్త మొక్కల వెంకటయ్య, స్టెప్ తెలంగాణ మేనేజర్ డా. బత్తుల కృష్ణయ్య, మన్ కి బాత్ మొక్కలరాజశేఖర్, నవభూమి పత్రిక స్టేట్ బ్యూరో తుమ్మలపల్లి ప్రసాద్, సింగరేణి రిటైర్డ్ జీఎం శనగ వెంకటేశ్వర్లు, ఎ .జి. ఎం గోనె శ్రీకాంత్, ఖైరో ప్రాక్టర్ కమలరాణి, కృతి ఆశ్రమం సభ్యులు కేహెచ్ ప్రసాద్, డాక్టర్ వెంకట్, సాగర్, శంకర్, రామవరం పరిరక్షణ సమితి అధ్యక్షులు మొహమ్మద్ ముస్తఫా, అంబేద్కరిస్ట్ తుంపురు శివలు సుగుణరావును అభినందించారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వద్దు: డీఎస్పీ

విశాలాంధ్ర - ఇల్లందు : అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొదని, గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ఇల్లందు డీఎస్పీ ఎన్.చంద్రభాను గొత్తికోయలకు సూచిం చారు. సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాలతో ఇల్లందు సబ్ డివిజన్ ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో టేకులపల్లి సిఐ సురేష్ నేతృత్వంలో గొత్తికోయ గ్రామమైన బూస్రాయిలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రానికి డీఎస్పీ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే చెప్పాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పోలీస్ శాఖ పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పించారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో నివసించే ఆదివాసులకు విద్యా, వైద్యం, రవాణా వంటి సౌకర్యాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని పలు సూచనలు చేశారు. ఆళ్లపల్లి ఎస్ఐ సోమేశ్వర్ కుమార్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

విశాలాంధ్ర - గార్ల : చత్తీస్‌గడ్ అడవుల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నరహంతక ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలని సిపిఐ ఎమ్-ఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా నాయకులు జడ సత్యనారాయణ డిమాండ్ చేశారు. శత్రుదేశంపై బాంబులు విసిరినట్లు ఒక సిద్ధాంతం కోసం పనిచేసే స్వప్రదేశీయులపై, అమాయకులైన ఆదివాసులపై కేంద్ర ప్రభుత్వం మారణ హోమం సృష్టిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని స్థానిక చాపల మార్కెట్ సెంటర్‌లో ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చత్తీస్గడ్‌లో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులైన అదాని, అంబానీలు, బిజెపి బడా బాబులకు కట్టబెట్టడానికే ఆదివాసులను, మావోయిస్టులను దారుణంగా హత్య చేస్తున్నారని విమర్శించారు. న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు జి. సక్రు, గౌని భద్రయ్య, మట్టపల్లి వీరభద్రం, మాలోత్ మాన్య, వాంకుడోత్ సక్రు, సూత్రపు మనోహర్, గోళ్ళ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు పారదర్శకంగా చేపట్టాలి : కలెక్టర్

విశాలాంధ్ర - పెనుబల్లి : కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్, పెనుబల్లి మండలంలో పర్యటించారు. రామచంద్రరావు బంజర్ గ్రామంలోని దుర్గా గ్రామ సమాఖ్య ఐకేపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రం ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సేకరించిన ధాన్యం లారీలకు లోడ్ చేసే ప్రక్రియ రిజిష్టర్లు నమోదు, ధాన్యం తేమ శాతం, గన్నీ బ్యాగుల లెక్కలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఏలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో బోర్డు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు టార్పాలిన్ పట్టాలు, గన్నీ బ్యాగులు ఎన్ని ఉన్నాయో స్పష్టమైన వివరాలు ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతులతో కలెక్టర్ ముచ్చటించారు. ధాన్యం నిల్వలు సమయానికి మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తేమ శాతం రెగ్యులర్‌గా చెక్ చేయాలని, తాలు లేకుండా ప్యాడీ క్లీనర్ ద్వారా శుభ్రం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట పెనుబల్లి మండల తహసీల్దార్ గంటా ప్రతాప్ రెడ్డి, ఎంపీఓ ఉపేంద్రయ్య, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు నరేష్, ఏపీఓ జ్యోతి ప్రసన్న రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

యుద్ధోన్మాదం ప్రమాదకరం

పహల్గాం దుర్ఘటన జరిగి వారం రోజులైంది. ఇంతటి తీవ్రమైన దారుణం జరిగిన తరవాత దేశవాసుల్లో ఆగ్రహ జ్వాలలు రగలడం మామూలే. ఆ తీవ్రవాదులు ముస్లింలు అయి ఉండొచ్చు. మతం ఏమిటో కనుక్కుని మరీ కాల్చి చంపి ఉండొచ్చు. అయితే బాధితులను ఆదుకున్నది కూడా ముస్లింలే అని గుర్తుంచుకోవాలి. స్థానిక కశ్మీరీలు బాధితులకు అండగా నిలబడినందువల్ల ప్రాణాలు కోల్పోయిన వారూ ఉన్నారు. కానీ ఈ ఘాతుకాన్ని మతం దృష్టితో చూడవలసిన అవసరం లేదు. దశాబ్దాలుగా కశ్మీర్‌లో తీవ్రవాదం కొనసాగుతోంది. వందలు, వేలమంది తీవ్రవాదానికి బలయ్యారు. కానీ వారిలో ముస్లింలే అధిక సంఖ్యాకులు. అయినా కశ్మీరీ పండితులను తరిమేయడం లాంటి వాటిని విస్మరించలేం. ఎంత చెప్పినా కశ్మీర్ అల్లర్లలో మత కలహాల ఛాయలు ఎన్నడూ లేవు. దాడి చేస్తున్నది తీవ్రవాదులు అయినందువల్ల దాన్ని ముస్లిం వ్యతిరేక దృష్టితో చూడవలసిన అగత్యం లేదు. పహల్గాం సంఘటన తరవాత దేశ వ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలు పెల్లుబుకడం సహజమే. అయితే వాటిలో మత దృష్టి కూడా కనిపిస్తోంది. ఇది ప్రమాదకరం. పహల్గాం సంఘటన తరవాత మోదీ తన సహజ శైలిలో ఈ దాడికి కారణమైన లేదా తీవ్రవాదులకు అండగా ఉన్న పాకిస్థాన్‌ను మట్టి గరిపిస్తాం లాంటి గంభీరమైన ప్రకటనలు మొత్తం వ్యవహారాన్ని మత దృష్టితో చూడడానికి అవకాశం కల్పించింది. సౌదీ అరేబియా నుంచి హుటాహుటిన తిరిగి వచ్చిన మోదీ ఆ తరవాత దిల్లీ నుంచి మాయమై పోయారు. బీహార్ వెళ్లారు. అక్కడ బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌తో కలిసి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అందువల్ల అఖిలపక్ష సమావేశానికి హాజరు కాలేదు. ప్రధానమంత్రి ఎందుకు హాజరు కాలేదని ప్రతిపక్షాలు నిలదీయక పోవడం విడ్డూరంగానే ఉంది. భద్రతా ఏర్పాట్లలో లోపాలు జరిగాయని అఖిలపక్ష సమావేశంలో చెప్పారు. అప్పుడైనా ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీయలేదు. మోదీ "మన్‌కీ బాత్" లో కూడా గంభీరమైన ప్రకటనలే చేశారు. ఇంత దారుణం జరిగిన స్థితిలో అఖిల పక్ష సమావేశానికి హాజరు కావడంకన్నా మోదీకి ముఖ్యమైన పని ఏముంటుందిగనక! పాకిస్థాన్ మీద ఏం చర్య తీసుకుంటారు, ఎప్పుడు తీసుకుంటారు, ఎలా తీసుకుంటారు అని ఎవరూ అడగడం లేదు. కానీ వీలైనంత త్వరలో ఏదో ఒక చర్య ఉండాలన్న భావన జనంలో బలంగా ఉంది. ఇది యుద్ధోన్మాదం కింద పరిణమించకూడదు. అదీ గాక పహల్గాంలో పర్యాటకులను అమర్నాథ్ యాత్ర జరిగే సందర్భంలోనే అనుమతిస్తారన్న ప్రచారం జరిగింది. అదీ అసత్యమే. పహల్గాం పర్యటించే వారిలో ఎక్కువ మంది బైసన్ర్ కూడా సందర్శిస్తారు. ఇది ఏడాది పొడవునా జరుగుతూనే ఉంటుందట. అలాంటప్పుడు అనుమతించడం, అనుమతించకపోవడం అన్న ప్రస్తావన ఎలా వస్తుంది. పైగా పర్యాటకులను తానే ఆహ్వానించానని కశ్మీర్ ముఖ్యమంత్రి ఉమర్ అబ్దుల్లా అంటున్నారు. అసలేం జరిగింది, ఏ లోపం వల్ల ఈ దారుణం జరిగిందన్న విషయంలో కూడా ప్రభుత్వం నుంచి తగిన వివరణ లేదు. అసలు జరిగిందేమిటన్న వాస్తవం తెలియకుండా న్యాయం చేద్దామనుకున్నా అన్యాయమే జరుగుతుంది. సకల వ్యవహారాలు బయట పెట్టాలని కాదు గానీ ప్రభుత్వం దగ్గరైనా నికరమైన సమాచారం ఉండాలిగా!

మోదీ ప్రభుత్వం ఏ చర్య తీసుకున్నా బుల్డోజర్ నడిపినట్టే ఉంటుంది. విమర్శలను పట్టించుకోదు. దిద్దుబాటు చర్యలు అసలే ఉండవు. 370వ అధికరణం రద్దు తరవాత మోదీ ప్రభుత్వం సరిగ్గా ఇదే వైఖరి అనుసరించింది. కశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితి ఉందని నమ్మబలికింది. 370వ అధికరణం రద్దు చేసిన తరవాత కశ్మీర్‌లో తీవ్రవాద ఘటనలు మందగించి ఉండొచ్చు. కానీ ఆ ప్రాంతం నుంచి రావలసిన సమాచారం కూడా రాకుండా చేసినందు వల్ల వాస్తవం ఏమిటో తెలియదు. జమ్మూలో తీవ్రవాదం పాకి పోవడంపై మోదీ ప్రభుత్వం ఎన్నడూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పెద్ద నోట్లు రద్దు చేసినప్పుడు సైతం ఇలాంటి ఏకపక్ష వైఖరే అనుసరించారు. పెద్దనోట్ల రద్దువల్ల తీవ్రవాదం తగ్గుతుందనీ అన్నారు. ఆ ఛాయలే లేవు. తీవ్రవాదులకు మద్దతు ఇచ్చే పాకిస్థాన్ ఎంతటి బీభత్సం సృష్టిస్తుందో కేంద్ర ప్రభుత్వం ఊహించినట్టు లేదు. పాకిస్థాన్ ఆగడాలను అరికట్టడానికి అమెరికా ప్రభుత్వం ఇస్తానన్న మద్దతును మోదీ సర్కారు గుడ్డిగా నమ్మినట్టుంది. పైకి ప్రశాంతంగా ఉన్నట్టు కనిపించినా తీవ్రవాదుల చొరబాటు, వారికి సకలవిధ సహాయం అందజేయడం లాంటివి ఆగిన సమాచారం లేదు. అదనంగా జమ్మూ ప్రాంతంలోకి కూడా తీవ్రవాదులు చొరబడుతూనే ఉన్నారు. పహల్గాం ఘటనను మత దృష్టితో చూడడం ఎంత పొరపాటో, పాకిస్థాన్ ను మట్టికరిపిస్తామన్న మోదీ మాటను గుడ్డిగా నమ్మి యుద్ధోన్మాదాన్ని ప్రదర్శించడమూ అంతే ప్రమాదకరం. గత మార్చి 11వ తేదీన పాకిస్థాన్‌లో జఫర్ ఎక్స్‌ప్రెస్‌నే దారి మళ్లించారు. అప్పుడు పాక్ ప్రభుత్వం బలూచిస్థాన్ ఉద్యమాకారులను మాత్రమే కాక వారికి అండగా నిలుస్తున్న మన దేశాన్ని కూడా తీవ్రంగా నిందించింది. అప్పుడూ మోదీ ప్రభుత్వం నుంచి గట్టి స్పందనేదీ లేదు. బహుశ: రైలును దారి మళ్లించినందుకు ప్రతీకారంగానే పహల్గాం సంఘటన జరిగి ఉండొచ్చు. పహల్గాంలో కిరాతకానికి పాల్పడిన తీవ్రవాదులు మహిళలు, పిల్లల జోలికి రాలేదు. రైలును అపహరించినప్పుడు కూడా ఇదే పద్ధతి అనుసరించడం గమనించవలసిన అంశం. పహల్గాం ఘటన పాకిస్థాన్ పరోక్ష ప్రతీకారానికి చిహ్నం కావొచ్చు. పాకిస్థాన్ సైన్యాధిపతి అసిం మునీర్ తాము జమ్మూ-కశ్మీర్ ను వదిలిపెట్టలేదని అన్నారు. ఈ ప్రకటనల మర్మాన్ని మోదీ ప్రభుత్వం గ్రహించినట్టు లేదు. తమ సమస్యలను ఎదుర్కొనే అవకాశం లేనందువల్లే అసిం మునీర్ తీవ్ర స్వరంతో మాట్లాడి ఉండవచ్చు. ఈ వ్యవహారాలన్నీ మోదీ ప్రభుత్వానికి తెలియవనుకోలేం. ఏ దుర్ఘటన జరిగినా మన గూఢచార విభాగం వైఫల్యం కింద తోసేస్తుంటారు. పాకిస్థాన్‌ను అదుపు చేయడానికి యుద్ధం జరిగితే బాగుండుననుకుంటున్న వారు తక్కువ సంఖ్యలో ఏమీ లేరు. కానీ యుద్ధం సమస్యలను పరిష్కరించదు. పైగా పైకి ఎంత గాంభీర్యం ప్రదర్శించినా యుద్ధమే జరిగితే తమ గతి ఏమిటో పాకిస్థాన్‌కు తెలియదనుకోలేం. ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టి దౌత్యపరంగా ఒత్తిడి తీసుకురావడమే ఉత్తమ మార్గం. పాకిస్థాన్ గత ప్రవర్తన ఆధారంగానే పాకిస్థాన్ పాత్ర ఉందంటున్నారు తప్ప కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు నికరమైన నిదర్శనాలేవీ చూపించలేదు. ఫలానా తీవ్రవాదముఠా ఈ ఘాతుకానికి పాల్పడిందని కూడా చెప్పలేదు. దౌత్యపరంగా పాకిస్థాన్‌ను ఏకాకిని చేయాలన్న అంతర్జాతీయ సమాజం మద్దతు కావాలి. దానికి తగిన సమాచారం మన దగ్గర ఉండాలి. ఇప్పటిదాకా ఈ ఘాతుకానికి కారణం ఇది అని మోదీ ప్రభుత్వం చెప్పనేలేదు.

వేరు పురుగు

చింతపట్ల సుదర్శన్

ఆకులు అడ్డంపెట్టి ఎండ నేలమీద పడకుండా, కాపు కాస్తున్న బాదం చెట్టు కింద విశ్రాంతి తీసుకుంటున్నది డాంకీ. ఈ ఎండలో ఆ మొండి గోడల కొంప అరుగు కాలిపోతూ ఉంటుంది. కాస్త ఈ ఎండ జోరు తగ్గేదాకా ఇక్కడే ఉందాం అనుకుని కళ్లు మూసుకుని అదేదో లోకంలోకి జారి పోబోతున్నదల్లా ఉలిక్కిపడింది.

ఎదురుగ్గా రోడ్డు మీద జనం కేకల చప్పుడు దాని ఉలికిపాటుకే కాదు కాస్సేపు విశ్రాంతిగా ఉందామనుకున్న ఆలోచన్ను భగ్నం చెయ్యడానిక్కూడా కారణమైంది. లేచి స్తంభం పక్కన నిలబడి చూడసాగిన డాంకీకి జనం ఒకళ్ల నొకళ్లు తన్నుకోవడం, పిడిగుద్దులు గుద్దుకోవడం కనిపించింది. చుట్టుపక్కల నిలబడ్డ జనం సెల్‌ఫోనులు పట్టుకుని చోద్యం చూస్తుండడం గమనించింది.

కేకలు పెరిగేయి. కర్రల చప్పుడు వినిపించింది. తలలు పగిలినట్టున్నాయి. ఇదంతా జరిగి ఒకళ్లిద్దరు నేలకు ఒరిగితే కదా పోలీసులు వస్తారు తీరుబడిగా. ఇక ఇక్కడ మనం మనలేం ఎండైనా వానైనా సొంత కొంపే నయం అనుకుంటూ తన కేర్ ఆఫ్ అడ్రస్ వైపు పరుగు తీసింది డాగీ. అప్పటికే అరుగు మీద ఉన్న డాంకీ డాగీ ఇలా ఎర్లీగా ఎందుకు వచ్చావు అన్న భంగిమలో ముఖాన్ని పైకెత్తింది. ఏం

రంగస్థలం

చెప్పను బ్రో, బాదం చెట్టు కింద ఓ కునుకు తీద్దామనుకుంటే అకస్మాత్తుగా యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. కర్రలు విరిగేయి. తలలు ఫట్టుమన్నాయి. నల్లటి తారురోడ్డు ముఖం రక్తంతో ఎర్రబడ్డది అంది డాగీ. వీధి పోరాటమా. మామూలే కద. రెండు పార్టీల వాళ్లు ఎదురెదురుగ్గా వచ్చేరా, గుళ్లో నించి వచ్చిన ఓ గుంపూ మసీదులో నుంచి వచ్చిన మరో గుంపూ ఎదురయ్యారా? అదేంకాదు. ఆ బస్తీవాళ్లే అనుకుంటా! దేనికి కొట్టుకుంటున్నారో తెలీదు కాని 'రీల్సు' తీసేవాళ్లు బిజీగా ఉన్నారు. పోలీసులకు ఫోన్ చేద్దామని ఒక్కడూ అనుకున్నట్టు లేదు. అసలు మనుషులు ఎందుకు కొట్టుకుంటారన్నా. మేం కుక్కలం అరుచుకుంటాం కరుచుకుంటాం మాది ఆకలి బాధ. అయినా మళ్లీ సర్దుకుంటాం కానీ ఒకళ్ల నొకళ్లను చంపేసుకోం. ఈ మనుషులేమిటన్నా కుక్కల కన్నా హీనంగా కొట్టుకోటమే కాక ఒకళ్లనొకళ్లు కోసుకుంటారు, నరుక్కుంటారు ఎందకన్నా అనడిగింది డాగీ.

మనుషులు ఒకరినొకరు చంపుకోడానికి అనేక 'వేరు' లున్నాయోయి. వేరులు అనగా వేరువేరు రకాల కారణాల వల్ల ఒకరికొకరు వేరు వేరయి కొట్టుకు చస్తారన్న మాట. మతం కోసం, కులం కోసం, ప్రాంతం కోసం, భాష కోసం ఒకళ్ల నొకళ్లు చంపుకోడానికి 'ఎవరెడీ' గా ఉంటారు. ఇంతేకాదు వేరు వేరు రంగుల మనుషులు రంగుల కోసం కూడా పీకలు తెగ్గోసుకుంటారు అంది డాంకీ. తిండి ఎక్కువై అనుకుంటా. గొప్పతనం కోసం పరువు కోసం అనుకుంటా అంది డాగీ. ఏదో ఒక కారణంతో సాటి మనుషుల ప్రాణాలు తీయడానికి వెనకాడరు. అసూయ, ద్వేషం, కోపం, కసి, స్వార్థం ఇలాంటి మాయ రోగాలేవో ఉంటాయి వాళ్లకి. వీటి కారణంగా వాళ్లు తాము మనుషుల మన్న మాటే మరిచిపోయి రెండు కాళ్ల పశువుల్లా ప్రవర్తిస్తారు. మనం నాలుక్కాళ్ల పశువులమైతే వాళ్లు రెండు కాళ్ల పశువులన్న మాట అని డాంకీ అంటుండగా అరుగు ఎక్కాడు అబ్బాయి.

ఎండ చల్లబడక ముందే వచ్చావేం 'బ్రో' అంది డాంకీ. అనుకోకుండా వచ్చాను కానీ రెండు కాళ్ల పశువు అంటున్నావు, నన్నయితే కాదు కదా అన్నాడు అబ్బాయి నవ్వుతూ. 'పురుషులందు పుణ్య పురుషులు వేరయా' అన్నారు కదా! మనుషుల్లో చాలామంది పశువులే కాదు, సింహం, పులి లాంటి క్రూర జంతువులు కూడా! అంది డాంకీ. అంటే మనిషికీ మృగానికీ తేడా లేదంటావు. ఎంత జ్ఞానం సంపాదించాడు ఎంత శాస్త్ర విజ్ఞానం పెంచాడు, ఎంత నాగరికతను సాధించాడు. ఒకప్పుడు అడవుల్లో పశువుల్లా నాలుగు కాళ్ల మీద నడిచిన అనాగరికుడు ఇవాళ ఎంత ఎదిగిపోయాడు అన్నాడు అబ్బాయి. అంతా బూడిదలో పోసిన పన్నీరే. ప్రపంచంలోని మనుషులంతా సాధించిన దేముంది. మనుష్య జాతి అంతా ఒక్కటిగా, ప్రశాంతంగా జీవించే అవకాశం ఉన్నా ఎన్నో రకాల 'వేరు' పడి 'వేరువేరు' కారణాల వల్ల, మృగ లక్షణాలను వదులుకోలేక పోవడం వల్ల తాము సుఖపడరు ఇంకెవరినీ సుఖపడనీయరు అంది డాంకీ. నాకు ఒకటి గుర్తుకు వస్తున్నది 'వేరు పురుగు చేరి వృక్షంబు చెరచు' అన్నారు కద! ఈ వేరు భావన మనిషి మెదడులో తిష్ట వేసుక్కూచున్నది. ఈ 'వేరు పురుగు' మనిషి మెదడులోంచి బయటకు పోనంత కాలం మనిషికి మనిషి శత్రువుగానే ఉంటాడు అన్నది డాగీ.

బాగా చెప్పావు డాగీ. నేను వేరు, నా స్థాయి వేరు, నా మతం వేరు, రంగూ రూపూ వేరు అనుకోవడమే కాక మరొకడి పట్ల సహనం చూపలేకపోవడం, మరొకడు సుఖపట్టం, బాగుపట్టం ఒర్వలేక పోవడం వల్ల మనుషులంతా రెండు కాళ్ల పశువులే, క్రూరమృగాలే అన్నది డాంకీ. ఒకప్పుడు నాలుక్కాళ్ల పశువులై ఉండీ, రెండు కాళ్ల పశువులుగా మనుషులు మారడానికి 'వేరు' అన్న 'వేరు పురుగే' నిజంగా కారణం అన్నాడు అబ్బాయి.

సింధుజలాల అస్త్రం సాధ్యమేనా!

పతకమూరు దామోదర్ ప్రసాద్

కశ్మీర్‌లోని పహల్గాంలో పాకిస్థాన్ ప్రేరేపిత మత ఉగ్రవాదులు 27 మంది అమాయక పర్యాటకులను కాల్చి చంపడంపై మన దేశం తీవ్రంగా స్పందించింది. మత ఉగ్రవాదులు జరిపిన దారుణ మారణహోమంపై దేశమంతా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. 60 ఏళ్ల క్రితం కుదుర్చుకున్న సింధునది జలాల పంపిణీ ఒప్పందాన్ని నిలిపి వేయాలని నరేంద్ర మోది నాయకత్వంలోని భారత ప్రభుత్వం నిర్ణయించడం పాక్‌లో కలకలం రేపింది. ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో 1960 వ దశకం ఆరంభంలో సింధునది జలాల పంపిణీ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం పశ్చిమ వాహినులైన సింధు, జీలం, చీనాబ్ నదుల జలాలను పాకిస్థాన్‌కు, తూర్పు దిశగా ప్రవహించే రావి, బియాస్, సట్లెజ్ నదీ జలాలను భారత్‌కు ప్రత్యేకించారు.

గత 60 ఏళ్ల కాలంలో భారత్, పాకిస్థాన్ మధ్య 1965, 1971, కార్గిల్ వంటి ఎన్నో యుద్ధాలు జరిగినా, ముంబై తాజ్ హోటల్‌పై ఉగ్రవాదులు దారుణ మారణహోమం జరిపి ఎందరో అమాయకులను కాల్చి చంపినా పాక్ గూఢచారి సంస్థలతో లష్కరే తోయిబా వంటి మతోన్మాద ఉగ్రవాదులు తెగబడి ఎన్నో హింసాత్మక విధ్వంసక దాడులు జరిపినా సింధు జలాల ఒప్పందం చెక్కు చెదరలేదు. అయితే పాక్ ప్రేరణతో పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన మారణకాండతో దేశమంతా ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. అందుకే ఉగ్రవాద హింసాకాండపై ధృఢమైన వైఖరిని భారత ప్రభుత్వం వ్యక్తం చేసింది. కొత్త దిల్లీలోని పాక్ రాయబార కార్యాలయ సిబ్బందిని సగానికి సగం తగ్గించింది. సైనిక సలహాదారులను, భారత్‌లో ఉన్న పాక్ పౌరులను వెంటనే దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. సరిహద్దుల్లో భారత సైన్యాన్ని సర్వసన్నద్ధంగా ఉంచింది. దేశంలోని కీలక ప్రాంతాలలో నిఘా పెంచింది. సింధు పరీవాహక ప్రాంతం నుంచి లభించే జలాలు పాక్‌కు "జీవ నాడి" వంటివి. అందుకే తీవ్రవాదం పెరిగిపోతున్న పాక్‌ను కట్టడి చేసేందుకు పాక్ ఆర్థిక మూలాలను దెబ్బతీసే వ్యూహాన్ని అమలు చేసి గుణపాఠం నేర్పాలని ప్రయత్నిస్తోంది.

పాకిస్థాన్ నీటి అవసరాలలో 76శాతం సింధు, బియాస్, సట్లెజ్ జలాల ద్వారానే తీరుతున్నాయి. 80 శాతం భూములకు ఈ నదులు జీవ జలాలను అందిస్తున్నాయి. పాక్‌లో 90 శాతం ఆహారోత్పత్తి సింధు నదీజలాల ద్వారానే జరుగుతున్నది. కేవలం 244 మిమీ వార్షిక వర్షపాతం గల పాకిస్థాన్‌కు సింధు నదీజలాల ద్వారానే తాగునీరు లభిస్తోంది. పాకిస్థాన్‌లో దాదాపు 40 శాతం శ్రామికులకు ఈ నదీజలాల ద్వారానే ఉపాధి లభిస్తోంది. పాక్ జాతీయోత్పత్తి, జీడీపీలో 24 శాతం సింధు నదీ జలాల ఆధారంగా జరిగే ఉత్పత్తి ద్వారానే వస్తోంది. టర్బేలా, మంగళ వంటి భారీ జలాశయాలు సింధు జలాల ద్వారా నిండుతున్నాయి. సింధు నది కాలువల వ్యవస్థ పాక్‌కు అత్యంత కీలకం. నీటి కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం అధిక నీరు అవసరమయ్యే వరి, గోధుమ వంటి ఆహార పంటలు, పత్తి వంటి వాణిజ్య పంటల సాగువల్ల తరచూ నీటి కొరత ఏర్పడుతోంది. తీవ్ర నీటి కొరత గల దేశాల్లో పాక్‌ది మూడో స్థానం అని ఆ సర్వేలో తేలింది. వాతావరణ మార్పుల వల్ల హిమ ఖండాలు కరిగి తొలుత నీటి లభ్యత పెరిగినా తదుపరి కొరత తప్పదు. ఈ పరిస్థితులలో సింధు నదీ జలాల ఒప్పందాన్ని నిలిపి వేయడం వల్ల పాక్‌కు 70 శాతం నీటి సరఫరా తగ్గి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయని నిపుణుల అంచనా.

పంజాబ్, సింధు వంటి సస్య శ్యామల రాష్ట్రాలు మరు భూములుగా మారవచ్చు. సింధు నదీ పంట కాలువలకు నీటిసరఫరా నిలిచి పోతే పాక్‌లో ఆహారోత్పత్తి పడిపోయి ధరలు, దారిద్ర్యం పెరిగి ఆకలితో అలమటించే దుస్థితి ఏర్పడవచ్చు. పాక్ జనాభాలో 80 శాతం గ్రామీణ ప్రజలు. పంటలు సాగుకోసం వారు ఉపాధి కోసం లాహోర్, కరాచి, పెషావర్, రావల్పిండి వంటి పట్టణాలకు వలస పోవలసి ఉంటుంది. ఇప్పటికే నీరు, విద్యుత్, రహదారులు ఇలా కొరతతో సతమతమవుతున్న ఆ నగరాల ప్రజావసరాలు మరింత దుర్భరంగా మారవచ్చు. సింధు నదీ జలాల ద్వారా జరిగే 30 శాతం జలవిద్యుత్ ఉత్పత్తి బాగా పడిపోయి పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు మూసివేస్తే నిరుద్యోగం మరింత పెరిగే అవకాశముంది. ఒక్కసారిగా సింధు జలాలను ఆపి వేస్తే ఆ నీటి నిల్వకు అనువైన జలాశయాలు భారత్‌లో లేవు. వానాకాలంలో అదనంగా వచ్చే నీటి నిల్వ కష్టం. పడమటి దిశగా వెళ్లే జలాలను ఇతర ప్రాంతాలకు మళ్లించాలంటే ఇంజినీరింగ్ నైపుణ్యాలే గాక సమయం అవసరం. భాక్రానంగల్ తదితర డ్యాంలు తూర్పు దిశగా పారే నీటి నిల్వకే సరిపోతాయి. వల్లపు ప్రాంతాలు ముఖ్యంగా కశ్మీర్‌లో ఎక్కువ భాగం ముంపునకు గురవుతాయి.

పాకిస్థాన్ నీటి అవసరాలలో 76శాతం సింధు, బియాస్, సట్లెజ్ జలాల ద్వారానే తీరుతున్నాయి. 80 శాతం భూములకు ఈ నదులు జీవ జలాలను అందిస్తున్నాయి. పాక్‌లో 90 శాతం ఆహారోత్పత్తి సింధు నదీజలాల ద్వారానే జరుగుతున్నది. కేవలం 244 మిమీ వార్షిక వర్షపాతం గల పాకిస్థాన్‌కు సింధు నదీజలాల ద్వారానే తాగునీరు లభిస్తోంది. పాకిస్థాన్‌లో దాదాపు 40 శాతం శ్రామికులకు ఈ నదీజలాల ద్వారానే ఉపాధి లభిస్తోంది. పాక్ జాతీయోత్పత్తి, జీడీపీలో 24 శాతం సింధు నదీ జలాల ఆధారంగా జరిగే ఉత్పత్తి ద్వారానే వస్తోంది.

పాక్ లో కూడా అత్యవసర పరిస్థితి రావచ్చు.

రక్తపుటేరులు, నీరు ఏక కాలంలో ప్రవహించే వీలు లేదని భారత ప్రధాని నరేంద్ర మోదీ పాక్ నేతలకు గట్టి హెచ్చరిక చేసినా ఫలితం లేకపోయింది. అందుకే సింధు జలాల నిలుపుదల ముందుకు తెచ్చారు. ఉగ్రవాదాన్ని నిరోధించకపోతే సింధు జలాలను ఇతర ప్రాంతాలకు మళ్లిస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి కూడా హెచ్చరించారు. ఇదే జరిగితే పాక్ పొరుగు దేశంగా ఉన్న చైనా సింధు నదికి ఎగువన డ్యామ్‌లు నిర్మించి భారత్‌ను కట్టడి చేసేందుకు ప్రయత్నించవచ్చు. సిందు జలాలను నిరోధిస్తే పాక్‌కు భారీగా నీటి కొరత ఏర్పడవచ్చు. పాకిస్థాన్ ఇప్పటికైనా మత చాందసవాదులను పైకి యెగదోసి, మతమారణకాండను ప్రేరేపించే దుశ్చర్యలకు స్వస్తి చెప్పి వాస్తవ దృష్టితో వ్యవహరించి ప్రజలకు అన్నవస్త్రాలు అందించే అభివృద్ధి పథంలో పయనిస్తేనే ఉపఖండంలో సుహృద్భావం, శాంతి సాధ్యం.

సీనియర్ జర్నలిస్ట్
సెల్: 9440990381

చైనా- అమెరికాలకు ఏ తరహా ఒప్పందం అవసరం?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 22వ తేదీ విలేకరులతో మాట్లాడుతూ చైనా సరుకులపై 145 శాతం పన్ను విధించడం చాలా ఎక్కువని, ఒకసారి చైనాతో ఒప్పందానికి వచ్చిన తరువాత చైనా దిగుమతులపై అమెరికా పన్నులు భారీగా తగ్గుతాయని చెప్పారు. "మేము చాలా సంతోషంగా జీవిస్తాము, ఆదర్శంగా కలిసి పనిచేస్తాము" అని అన్నారు. "చైనాతో వాణిజ్య యుద్ధం తాత్కాలికమైనది, త్వరలోనే యుద్ధ తీవ్రత తగ్గుతుందని" అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బిసెంట్ వ్యాఖ్యానించారు. చైనా నుంచి విడిపోవడం లక్ష్యం కాదని కూడా తెలిపారు. ఈ కథనాలు అంతర్జాతీయ సమాజంలో ఆసక్తిని రేకెత్తించాయి. ఈ ప్రకటనలు వచ్చిన మరురోజే చైనా విదేశాంగ మంత్రి స్పందిస్తూ, అమెరికా నిజంగా సంప్రదింపులతో పరిష్కరించుకోవాలని కోరుకుంటే చైనాను బ్లాక్ మెయిలింగ్ చేయటాన్ని, బెదిరించటాన్ని తక్షణం ఆపాలని, సమానత్వం, గౌరవం, పరస్పర ప్రయోజనం ప్రాతిపదికగా చర్చలకు ప్రయత్నించాలని చెప్పారు.

అమెరికా ప్రారంభించిన సుంకాల యుద్ధం వల్ల కలిగే గందరగోళం, విధ్వంసక ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల అమెరికా మార్కెట్ మాంద్యం, ద్రవ్యోల్బణంలో చిక్కుకున్నది. పీటర్సన్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనమిక్స్ ప్రకారం 2025లో అమెరికా ఆర్థిక వృద్ధి గత సంవత్సరం 2.5 శాతం ఉండగా 0.1 శాతానికి పడిపోతుందని అంచనా. ఈ ప్రతికూల దృక్పథాన్ని తిప్పి కొట్టడానికి, అమెరికా తన లోపభూయిష్ట వాణిజ్య, సుంకాల విధానాలను మార్చుకోవలసి ఉంటుంది. నివేదికల ప్రకారం వ్యవసాయం, నిర్మాణం, తయారీ, రిటైల్, సాంకేతికత తదితర రంగాలకు చెందిన లాబీయింగ్ వర్గాలు సుంకాల చర్యలను మరింత సులభతరం చేయాలని వైట్‌హౌస్‌ను కోరుతున్నాయి. సుంకాలు, కార్మికులు, ద్రవ్యోల్బణానికి, మొత్తం ఆర్థిక వ్యవస్థకు నష్టం చేకూరుస్తాయని మెజారిటీ ప్రజలు నమ్ముతున్నారని ఇటీవల సీఎన్‌బీసీ సర్వేలో తేలింది. అమెరికా వైపు నుంచి వెలువడిన సంబంధిత ప్రకటలను త్వరగా మార్కెట్ ప్రతి చర్యకు దారి తీశాయి. అంతకు ముందు జరిగిన భారీ నష్టాల నుంచి అమెరికా స్టాక్ మార్కెట్ బాగా పుంజుకుంది. యూరో స్టాక్స్ 3.24 శాతం పెరిగింది. ఆసియా మార్కెట్లు కూడా లాభాలను చవి చూశాయి.

ఈ సంకేతాలన్నీ అమెరికా- చైనా మధ్య ఘర్షణను కాదు, సహకారాన్ని అంతర్జాతీయ సమాజం కోరుకుంటున్నదని తెలియచేస్తున్నాయి. ఆర్థిక ప్రపంచీకరణ అనేది తిరిగి మార్చలేని చారిత్రక ధోరణి అని, అంతర్జాతీయ వాణిజ్య నియమాలు, న్యాయాన్ని సమర్థించడం ఉమ్మడి ఆకాంక్ష అని ఇది మరోసారి నొక్కి చెబుతున్నది. చైనా- అమెరికా ఆర్థిక, వాణిజ్య సంబంధాల ప్రాథమిక స్వభావం పరస్పర ప్రయోజనం, పరస్పర సహకారం అని మరోసారి ధృవీకరించింది. సుంకాలు, వాణిజ్య యుద్ధాలలో విజేతలు ఉండరని, రక్షణ వాదం ఎక్కడికీ దారి తీయదని, తనంతట తాను విడిపోయి పరాయీకరణ అవుతుందని చైనా మొదటిరోజు నుంచే చెబుతోంది. సుంకం 145 శాతం విధించడమే కాదు, వాణిజ్య సమతుల్యత ముసుగులో అది వాణిజ్య పరిమితులను విధించి చర్చలలో ఒత్తిడిని కలిగిస్తుంది. బెదిరింపులు, బలవంతం కోసం సుంకాలను ఒక సాధనంగా ఉపయోగించడం అమెరికా చేస్తున్న తప్పు. వాషింగ్టన్ ఆశించినట్లుగా పరస్పర సుంకాలు పని చేయడం లేదు. ఒక దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచదని చరిత్ర పదేపదే చూపించింది. దానికి బదులుగా ఇది ప్రపంచ వాణిజ్యం, పెట్టుబడి వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని కూడా ప్రేరేపిస్తుంది. ఇది తనతో పాటు అందరికి హాని కలిగిస్తుంది. చైనా- అమెరికా ప్రపంచంలో రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థలు రెండు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సహకారం చాలా పెద్దది, ప్రధానమైనది, చాలా విస్తృతమైనది. చాలామంది భాగస్వాములను కలిగి ఉంటుంది. కొన్ని విభేదాలు, వైరుధ్యాలు ఉండటం సహజం. ప్రతి ఒక్కరి మౌలిక ప్రయోజనాలను, ఆసక్తులను గౌరవించుకోవాలి. లక్ష్యశుద్ధితో, పరస్పర విశ్వాసంతో కూడిన చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలి. అమెరికా నిజంగా తన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించు కోవాలనుకుంటే అది సరైన వైఖరి అవలంబించాలి, నిజాయితీని ప్రదర్శించాలి. చైనాతో ఒప్పందం కుదుర్చుకోవాలని కోరుకుంటున్నట్లు చెబుతూనే, మరో వైపు ఒత్తిడిని తీవ్ర స్థాయిలో పెంచడం ఉభయ దేశాల మధ్య సంబంధాలు ఏర్పరచుకోవడానికి మాత్రం కాదు. స్పష్టంగా చెప్పాలంటే ఏవిధంగానూ పనిచేయదు. చైనా- అమెరికా రెండు అగ్ర రాజ్యాలు, అవి హుందాగా వ్యవహరించాలి. చైనాతో మంచి ఒప్పందం చేసుకోవాలని అమెరికా పదేపదే ప్రస్తావిస్తున్నది. నిజానికి రెండు దేశాల మధ్య అంత మహత్తర ఒప్పందం జరగాలంటే, అది పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం, పరస్పర సహకారంపై ఆధారపడి ఉండాలి. నేటి నూతన యుగంలో చైనా- అమెరికా సంబంధాలకు అదే అరుదైన మార్గం. పరస్పర గౌరవప్రదమైన రీతిలో చర్చలను ఎలా బలోపేతం చేయాలి, అభిప్రాయ భేదాలను ఎలా నిర్వహించాలి, పరస్పర ప్రయోజనం, సహకార స్ఫూర్తిని ఎలా ముందుకు తీసుకెళ్లాలి, అంతర్జాతీయ వ్యవహారాలపై బాధ్యతాయుతమైన రీతిలో సమన్వయాన్ని ఎలా పెంచాలి తదితర విషయాలపై రెండు పక్షాలు చర్చించుకోవాలి. ప్రపంచం నిజంగా కోరుకుంటున్న బృహత్తర ఒప్పందం ఈ విధంగా ఉండాలి. చైనా- అమెరికా కలిసి పని చేయవలసిన దిశ ఇదే. రెండు దేశాలతో సహా మొత్తం అంతర్జాతీయ సమాజం దీని నుంచి ప్రయోజనం పొందుతుంది.

ఒకప్పుడు అమెరికా సమర్థించిన బహుముఖ ఆర్థిక, వాణిజ్య నియమాలకు చైనా మద్దతుదారుగా ఉండేది. విస్తృత ఆమోదం పొందిన ఈ బహుళ పక్ష నియమాల అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య సహకార వ్యయాన్ని గణనీయంగా తగ్గించాయి. సామర్థ్యాన్ని మెరుగుపరిచాయి. సరసమైన, న్యాయమైన ప్రాథమిక స్థాయిని నిర్ధారించాయి. చైనా-అమెరికా ఆర్థిక, వాణిజ్య సంబంధాలు రెండు దేశాలకు గొప్ప ప్రాముఖ్యతను కలిగించడమేగాక, ప్రపంచ ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధిపై కూడా ముఖ్యమైన ప్రభావాన్ని చూపుతాయి.

"మనం ఒకరు చెప్పేది వినడమే కాదు, ఒకరు చేసే పనిని కూడా చూస్తాము" అని చైనా సామెత ఉంది. రెండు దేశాలు సమాన స్థాయిలో గౌరవప్రదంగా చర్చలు జరపాలి. సంప్రదింపుల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలి. ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సంబంధాలను అభివృద్ధి చేసుకోవడానికి, ఆరోగ్యకరమైన, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడానికి అమెరికా- చైనా చేతులు కలపాలి.

గ్లోబల్ టైమ్స్ సౌజన్యం, సంపాదకీయం

మాపై దాడి చేస్తుంటే చూస్తూ ఊరుకోం

పాక్‌కు ఒవైసీ తీవ్ర హెచ్చరిక

న్యూఢిల్లీ: సింధూ నది జలాలను భారత్ అడ్డుకుంటే రక్తం పారుతుందన్న పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ నేత బిలావల్ భుట్టో జర్దారీపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. పాక్ మాజీ ప్రధాని అయిన ఆయన తల్లి బెనజీర్ భుట్టో, ఆ దేశ మాజీ అధ్యక్షుడైన ఆయన తాత జుల్ఫికర్ అలీ భుట్టోను చంపింది ఎవరో గుర్తు చేసుకోవాలన్నారు. 'వారు (ఉగ్రవాదులు) మీ అమ్మని కాల్చిచంపితే అది ఉగ్రవాదం. వారు (ఉగ్రవాదులు) మా తల్లులు, కుమార్తెలను చంపినప్పుడు, అది ఉగ్రవాదం కాదా?' అని ప్రశ్నించారు. కాగా, భారత్‌పై బిలావల్ భుట్టో వ్యాఖ్యలు చిన్నపిల్లల మాటలని అసదుద్దీన్ ఒవైసీ ఎద్దేవా చేశారు. 'అలాంటి చిన్నపిల్లల మాటలు మర్చిపోండి. తన తాతకు ఏమి జరిగిందో ఆయనకు తెలియదు? ఆయన తల్లిని ఉగ్రవాదులు కాల్చి చంపారు. కాబట్టి కనీసం ఆయన ఇలా మాట్లాడకూడదు. మీరు ఏమి మాట్లాడుతున్నారో మీకైనా తెలుసా? అమెరికా మీకు ఏదైనా ఇస్తే తప్ప దేశాన్ని నడపలేరు. అలాంటి మీరు మమల్ని ఎత్తిచూపేలా మాట్లాడతారు' అని విమర్శించారు. మరోవైపు అణు బాంబులను గురిపెట్టామన్న పాకిస్థాన్ నేతల బెదిరింపులపై అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. ఒక దేశంలోకి ప్రవేశించి అమాయకులను చంపితే... ఎంత పవర్ ఉన్నప్పటికి ఏ దేశం మౌనంగా ఉండదని స్పష్టం చేశారు. మీరు ఏ మతం గురించి మాట్లాడుతున్నారని నిలదీశారు. 'మీరు మా దేశంపై దాడి చేసిన విధానం, మతం అడిగి కాల్చివేయడం... ఖవారిజ్ (ఇస్లాం మతం ఫిరాయింపుదారుల) కంటే హీనంగా ఉన్నారు. మీరు ఐఎస్ఐఎస్ సానుభూతిపరులు' అని పాక్ నేతలను దుయ్యబట్టారు. ఇక పహల్గాం దాడిపై ఘటనపై పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది చేసిన వ్యాఖ్యలపై కూడా ఒవైసీ మండిపడ్డారు. అతడో జోకర్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ విలేకరి షాహిద్ అఫ్రిది చేసిన వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు ఒవైసీ సమాధానమిస్తూ... 'అతనెవరు... ఇది ఒక డ్రామా. నా ఎదుట జోకర్ల పేర్లను ఎందుకు తీసుకువస్తున్నారంటూ' వ్యాఖ్యానించారు. దేనికి పనికి రానివాళ్ల గురించి మాట్లాడడం దండగ అంటూ చురకలంటించారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై పాకిస్థాన్ ఆఫ్రిదీ భారత్‌పై విషం కక్కాడు. ఇస్లాం శాంతిని బోధిస్తుందని... పాకిస్థాన్ ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వదని చెప్పాడు. పాకిస్థాన్‌పై నిందలు వేకుండా ఉగ్రదాడి సాక్ష్యాలను చూపాలని అన్నాడు. భారత్ తనను తానే నిందించుకోవాలని... అక్కడ టపాసులు పేలినా పాకిస్థాన్‌పై నిందలు వేస్తారంటూ నోటికి వచ్చినట్లు మాట్లాడాడు.

రాజకీయ ప్రేరేపితమే...

- బీహార్ ఎన్నికల్లో బీజేపీ లబ్ధి కోసం ఉగ్రదాడి కుట్ర
- పంజాబ్ దాటి పాక్‌పై యుద్ధానికి భారత్‌ను సిక్కులు రానివ్వరు
- ఖలిస్థాన్ ఉగ్రవాది పన్నూ ప్రేలాపన

న్యూఢిల్లీ : ఖలిస్థాన్ ఉగ్రవాది గురుపత్వంత్ పన్నూ భారతదేశంపై మరోసారి విషం కక్కాడు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి భారత్ కుట్రేనని, రాబోయే బీహార్ ఎన్నికలలో బీజేపీ రాజకీయ లబ్ధి పొందేలా పహల్గాం ఉగ్రవాద దాడికి పాల్పడింది భారతీయ ఏజెన్సీలే అని కూడా ఆయన ఆరోపించారు. ఏప్రిల్ 27న పాకిస్థాన్ ప్రచార యూట్యూబ్ ఛానెల్ ఆజాద్ సియాసత్... ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ ఇంటర్వ్యూను ప్రసారం చేసింది. ఈ ఇంటర్వ్యూలో పంజాబ్‌లో నివసిస్తున్న రెండు కోట్ల మంది సిక్కులు పాకిస్థాన్‌పై దాడి చేయడానికి భారత ప్రభుత్వాన్ని అనుమతించరని పేర్కొనడంతో సహా అనేక నిరాధారమైన, రెచ్చగొట్టే వాదనలు చేశాడు. ఇటీవల పహల్గాం ఉగ్రవాద దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ఈ ఇంటర్వ్యూ జరిగింది. ఈ సందర్భంగా పన్నూ పాక్ ప్రభుత్వం, సైన్యంచే ప్రేరించబడుతున్న ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని కప్పిపుచ్చేందుకు నిరాధారమైన వాదనలు చేశాడు. పహల్గాం ఉగ్ర దాడి వెనుక పాకిస్థాన్ హస్తం లేదని, అమాయక హిందువులను చంపింది భారత ఏజెన్సీలేనని ఆరోపించాడు. రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ రాజకీయ లబ్ధి పొందేందుకు ఈ దాడి రాజకీయంగా ప్రేరేపించబడిందని, అమెరికా నేతల సందర్శనలతో ఇటువంటి సంఘటనలు చాలా నిశితంగా జరుగుతున్నాయని, అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు భారత ఏజెన్సీలు దాడులకు తమ ప్రతినిధులను ఉపయోగించాయని అన్నాడు.

పాక్‌తోనే సిక్కులు... సిక్కు సైనికులు

తన పిలుపు మేరకు పంజాబ్ ప్రజలే కాకుండా సిక్కు సైనికులు, భారత సాయుధ దళాల అధికారులు కూడా పాకిస్థాన్‌తో ఉన్నారని పన్నూ దిగ్భ్రాంతికరమైన, దారుణమైన ప్రకటన చేశారు. సింధు జలాల ఒప్పందాన్ని ఇకపై అనుసరించబోమని భారత్ చేసిన ప్రకటనను ఉటంకిస్తూ...నీటిని ఆపేందుకు ఎలాంటి చర్య తీసుకున్నా యుద్ధ చర్యగా పరిగణిస్తామని భారత్‌ను హెచ్చరిస్తూ పాకిస్థాన్ ఆర్మీ చీఫ్, ఆ దేశ ప్రధాని చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన ప్రస్తావించారు. భారత్, పాకిస్థాన్ మధ్య వివాదం తలెత్తితే పంజాబ్‌లోని భారత వైపు నివసిస్తున్న సిక్కుల గతి గురించి పన్నూ ఆందోళన వ్యక్తం చేశాడు. సిక్కులు పాకిస్థాన్‌కు మద్దతు ఇస్తారని, ప్రస్తుత పరిస్థితి 1965, 1971 నాటి పరిస్థితులకు భిన్నంగా ఉందని చెప్పుకొచ్చాడు. 'ఇది 2025' అని చెబుతూ... సిక్కులు పాకిస్థాన్‌కు ఇటుక గోడలా నిలబడతారని నొక్కి చెప్పారు. పంజాబ్ ద్వారా పాకిస్థాన్‌పై దాడి చేసేందుకు భారత బలగాలను సిక్కులు అనుమతించబోరని ఆయన ఉద్ఘాటించారు. అయితే ప్రత్యేక సిక్కు దేశమైన ఖలిస్థాన్ వాదానికి పాకిస్థాన్ బహిరంగంగా మద్దతు ఇస్తేనే ఇది సాధ్యమవుతుందని కూడా పన్నూ చెప్పాడు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో పాకిస్థాన్ ప్రభుత్వం ఖలిస్థాన్ అంశాన్ని చురుకుగా లేవనెత్తాలని, శాంతియుత, ప్రజాస్వామ్య ప్రక్రియగా కొనసాగుతున్న ఖలిస్థాన్ ప్రజాభిప్రాయ సేకరణకు అంతర్జాతీయంగా చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశాడు. ఖలిస్థాన్ ఉద్యమానికి పాకిస్థాన్ అండగా నిలిస్తే సిక్కు సమాజం మొత్తం పాక్‌తో ఏకమవుతుందన్నాడు. పాకిస్థాన్‌పై భారత్ అనేక సార్లు దూకుడు ప్రదర్శించిందని, బంగ్లాదేశ్ ఏర్పాటుకు దారితీసిన 1971 యుద్ధాన్ని ఉదాహరణగా చూపిందని పేర్కొన్నాడు. పాకిస్థాన్‌ను అంతర్గతంగా అస్థిరపరిచేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించినట్లుగానే ఇప్పుడు బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ నుంచి విడగొట్టాలని భారత్ కోరుకుంటోందని నొక్కి చెప్పాడు. ఉద్యమానికి పాకిస్థాన్ అధికారిక ఆమోదం తెలిపినందున, భారతదేశంలోని పంజాబ్‌లోని లక్షలాది మంది సిక్కులు పాకిస్థాన్‌కు అండగా నిలుస్తారని పన్నూ అన్నాడు. చాలా మంది సిక్కులు ఇప్పటికే ఈ కారణంతో సైద్ధాంతికంగా జతకట్టారని, కేవలం అధికారిక మద్దతు కోసం ఎదురుచూస్తున్నారని తెలిపాడు. కాగా, భారత ప్రభుత్వంపై మరింత దాడి చేశాడు. పాకిస్థాన్ తమ శత్రువు కాదని సిక్కులకు ఇప్పుడు తెలుసునని పేర్కొన్నాడు.

1984 ఆపరేషన్ బ్లూ స్టార్, నవంబరు 1984లో సిక్కు వ్యతిరేక ఊచకోత, 1984, 1995 మధ్య పంజాబ్‌లో భారత బలగాలు తిరుగుబాటుకు వ్యతిరేకంగా చేసిన చర్యలను ప్రస్తావిస్తూ, 'మీ నిజమైన శత్రువు భారత ప్రభుత్వమే' అని అన్నాడు. గురుపత్వంత్ సింగ్ పన్నూ అమెరికాకు చెందిన ఖలిస్థానీ ఉగ్రవాది. ఇతను అమెరికా, కెనడా రెండింటిలోనూ పౌరసత్వం కలిగి ఉన్నాడు. భారతదేశ వ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (ఉపా) కింద భారత ప్రభుత్వం అతన్ని ఉగ్రవాదిగా గుర్తించింది. అతని సంస్థ 'సిక్కు ఫర్ జస్టిస్'ను కూడా తీవ్రవాద సంస్థగా ప్రకటించింది.

అతిథులను కాపాడటంలో విఫలమయ్యా

ఈ పరిస్థితిలో రాష్ట్ర హోదా అడగను : ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: అతిథులను కాపాడటంలో తాను విఫలమయ్యానని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. కానీ... ఆ 26 మంది ప్రాణాలను అడ్డం పెట్టుకొని తాను రాష్ట్ర హోదా డిమాండ్ చేయనని చెప్పారు. ఈ విషయాన్ని జాతి తీవ్ర వేదనల్లో ఉన్నప్పుడు కాకుండా... మరేదైనా రోజు లేవనెత్తుతానని చెప్పారు. పహల్గాం దాడిపై చర్చించేందుకు అసెంబ్లీ సోమవారం అత్యవసరంగా సమావేశమైంది. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అసెంబ్లీనుద్దేశించి మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇలాంటి దాడులు గతంలో చాలా చూశాం. కానీ... బైసరన్‌లో ఇంత పెద్ద స్థాయిలో దాడి చేయడం మాత్రం 21 ఏళ్లలో ఇదే తొలిసారి. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఎలా క్షమాపణలు చెప్పాలో కూడా తెలియడం లేదు. రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి పంపాల్సిన బాధ్యత మాదే. నేను ఆ పనిచేయలేకపోయాను. క్షమాపణలు చెప్పేందుకు నా వద్ద మాటలు కరవయ్యాయి' అని అన్నారు. 'పహల్గాం ఘటన తర్వాత ఏ ముఖం పెట్టుకొని రాష్ట్ర హోదాను డిమాండ్ చేయాలి. నా రాజకీయాలు అంత చౌకబారువి కావు. గతంలో రాష్ట్ర హోదా అడిగాం... భవిష్యత్తులో కూడా అడుగుతాం. కానీ... 26 మంది చనిపోయారు.. ఇప్పుడు రాష్ట్ర హోదా ఇవ్వండి అని కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటు' అని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, పర్యాటకశాఖ మంత్రిగా అతిథులను కాపాడలేకపోయానన్నారు.

ఉగ్రదాడి మృతులకు జమ్మూకశ్మీర్ అసెంబ్లీ నివాళి

ఈ నెల 22న పహల్గాం సమీపంలోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు జరిపిన క్రూర దాడిలో మరణించిన పర్యాటకులకు జమ్మూకశ్మీర్ అసెంబ్లీ నివాళులు అర్పించింది. వారి మృతి పట్ల సంతాపం ప్రకటించింది. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. గత మంగళవారం జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులే లక్ష్యంగా కాల్పులు జరిపి 26 మందిని పొట్టనపెట్టుకున్నారు. వారిలో 25 మంది భారతీయులు, ఒకరు నేపాల్ జాతీయుడు ఉన్నారు. ఈ ఉగ్రదాడి నేపథ్యంలో సోమవారం జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైంది. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలంతా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఉగ్రదాడిపై సభలో చర్చించారు. అనంతరం మృతులకు నివాళి అర్పించారు. ఓ ఉగ్రవాది నుంచి తుపాకీ లాక్కునే క్రమంలో తూటాలకు బలైన స్థానికుడి త్యాగాన్ని గుర్తుచేసుకున్నారు. ఆపై ఉగ్రదాడిని ఖండిస్తూ ఒక తీర్మానం చేశారు.

కొత్తతరహా పాక్ ఉగ్రవాదం... ఎలా పోరాడగలం?

బీజేపీ నేత నిశికాంత్ దూబే

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో దేశ ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ముఖ్య నేతలు పాకిస్థాన్‌పై మండిపడుతున్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదం కొత్తరూపు సంతరించుకుందని బీజేపీ నేత నిశికాంత్ దూబే వ్యాఖ్యానించారు. 'ఐదు లక్షల మంది పాకిస్థానీ యువతులు పెళ్లి చేసుకొని భారత్‌లో నివసిస్తున్నారు. ఇప్పటివరకు వారికి భారత పౌరసత్వం లేదు. దేశం లోపల ఉన్న ఈ తరహా శత్రువులతో ఎలా పోరాడాలి. వారికి ఇస్తున్న వీసాలకు సంబంధించి సమగ్ర దర్యాప్తు అవసరం అనిపించింది. పాక్ మహిళలు ఇక్కడ పెళ్లి చేసుకొని సంవత్సరాలుగా ఇక్కడే నివసిస్తున్నారు. ఆ దేశ యువకులు కూడా అలాగే పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. భారత్‌లో వివాహం చేసుకుంటున్న పాకిస్థానీ మహిళలు, పురుషుల ఉద్దేశాన్ని విచారించాలి' అని దూబే వ్యాఖ్యానించారు. ఇరు దేశాల పౌరులకు తమతమ దేశాల్లో తగిన సంబంధాలు దొరకడం లేదా అని ఆశ్చర్యపోయారు.

పహల్గాం ఉగ్రదాడి...కాంగ్రెస్‌లో విభేదాలు

గీత దాటొద్దని నేతలకు కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశం

న్యూఢిల్లీ: పహల్గాం దాడి విషయంలో కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత రావడంతో పార్టీ అధిష్ఠానం వారిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నేతలు గీత దాటొద్దని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. పార్టీ అభిప్రాయాలకు విరుద్ధంగా వ్యాఖ్యలు చేసిన నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దేశ ప్రతిష్ఠకు వ్యతిరేకంగా ఎవరూ ఎటువంటి వ్యాఖ్యలు చేయకూడదని సూచించారు. ఈ మేరకు అధికారికంగా పార్టీ నేతలకు ఆర్డర్లు జారీ చేశారు. పహల్గాం దాడి దేశ ఐక్యత, సమగ్రతపై జరిగిన ప్రత్యక్ష దాడి అని అన్నారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించివేసేందుకు కేంద్రంతో సహకరించేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని తెలిపారు. పహల్గాం దాడి అనంతరం భారత ప్రభుత్వం పాక్‌పై తీసుకుంటున్న కఠిన చర్యలను కొందరు కాంగ్రెస్ నేతలు తప్పుబట్టడంపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. భారత్‌ను కించపరిచేందుకు అనేక మంది కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను పాకిస్థాన్ తమ మీడియాలో ప్రసారం చేస్తోందని బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ అన్నారు. శత్రువుల ముందు దేశాన్ని తక్కువ చేసేలా కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్నారని.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అగ్ర నేత రాహుల్ గాంధీ సొంత పార్టీ నేతలను నియంత్రించలేరా? అని ప్రశ్నించారు. ఉగ్రదాడి తర్వాత ప్రపంచం మొత్తం భారత్‌కు మద్దతుగా నిలిచిందని.. కానీ మనలో ఉన్నవారే మనకు వ్యతిరేకంగా మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. జాతీయ ఐక్యతపై కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్న మాటలన్నీ ఉత్తివేనా అని నిలదీశారు. పహల్గాం ఉగ్రదాడి సమయంలో ఉగ్రవాదులు ప్రజలను చంపే ముందు వారి మతం గురించి అడిగి ఉండరని కాంగ్రెస్ కర్ణాటక మంత్రి ఆర్‌బీ తిమ్మాపుర్ అనడం సిగ్గుచేటని రవిశంకర్ విమర్శించారు. ఉగ్రదాడితో తనకు సంబంధం లేదని పాకిస్థాన్ చెబుతున్నా సింధూ జలాలను ఆపివేయడం సమంజసం కాదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత సైఫుద్దీన్ సోజ్ ఇటీవల వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌లో తాగునీటి అవసరాలకు, వ్యవసాయానికి నీరు చాలా ముఖ్యమని.. సింధూ జలాలను పాక్‌కు మళ్లించకపోతే పంజాబ్, జమ్మూకశ్మీర్ పూర్తిగా మునిగిపోతాయని ఆయన అన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రా మొదలైన కాంగ్రెస్ నేతలు పాక్‌కు మద్దతుగా వ్యాఖ్యలు చేయడంతో దేశవ్యాప్తంగా వారిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తహవ్వుర్ రాణా కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ముంబై ఉగ్రదాడి కేసులో ప్రధాన సూత్రధారి తహవ్వుర్ హుస్సేన్ రాణా ఎన్ఐఏ కస్టడీని సోమవారం ఢిల్లీ కోర్టు పొడిగించింది. దాంతో మరో 12 రోజులు అతడు దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కస్టడీలో ఉండనున్నాడు. ఇంతకు ముందు విధించిన 18 రోజుల కస్టడీ గడువు ముగియడంతో ఈ రోజు రాణాను కోర్టుముందు హాజరుపర్చారు. అతడి ముఖానికి ముసుగు తొడిగి... కట్టుదిట్టమైన భద్రత నడుమ న్యాయస్థానానికి తీసుకువచ్చారు. ఎన్ఐఏ అదుపులో ఉన్న రాణాను ఇటీవల ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు విచారించారు. ఈ విచారణకు అతడు సహకరించకుండా.. తప్పించుకునే రీతిలో సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. ముంబై ఉగ్రదాడులతో తనకు ఎలాంటి సంబంధం లేదని విచారణలో భాగంగా రాణా వెల్లడించినట్లు సమాచారం. తహవ్వుర్ రాణా పాకిస్థాన్‌కు చెందిన కెనడా జాతీయుడు. 26/11 ముంబై దాడుల్లో కీలక సూత్రధారి. ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నాడన్న ఆరోపణలపై 2009లో అరెస్టయ్యాడు. అమెరికా జైల్లో శిక్ష అనుభవించిన అతడిని అప్పగింత ప్రక్రియలో భాగంగా భారత్‌కు తీసుకువచ్చిన సంగతి తెలిసిందే.

సుప్రీంలో యూట్యూబర్ అల్లబదియాకు ఊరట

న్యూఢిల్లీ: యూట్యూబర్ రణ్‌వీర్ అల్లబదియాకు సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. పాస్‌పోర్టును అతనికి ఇచ్చేయాలని కోర్టు సోమవారం ఆదేశించింది. అతనిపై నమోదైన కేసుల విచారణ పూర్తి అయిన నేపథ్యంలో కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. యూట్యూబర్ అల్లబదియా... బీర్‌బైసెప్స్ షోతో పేరుగాంచిన విషయం తెలిసిందే. విదేశీ ప్రయాణం నేపథ్యంలో అతనికి పాస్‌పోర్టును అప్పగించాలని కోర్టు పోలీసుల్ని కోర్టు ఆదేశించింది. జస్టిస్ సూర్యకాంత్, ఎన్ కోటీశ్వర్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈమేరకు తీర్పు ఇచ్చింది. ఓ యూట్యూబ్ షోలో తల్లితండ్రుల శృంగారంపై అనుచిత కామెంట్ చేసిన అల్లబదియాపై పలు రాష్ట్రాల్లో కేసులు నమోదు అయ్యాయి. అయితే ఫిబ్రవరి 18వ తేదీన సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. అల్లబదియాను అరెస్టు చేయవద్దు అని పేర్కొన్నది. థానే పోలీసు స్టేషన్‌లో పాస్‌పోర్టును డిపాజిట్ చేయాలని ఆదేశించింది. అయితే విలువలు, హుందాతనంతో ద రణ్‌వీర్ షోను నడుపుకోవచ్చు అని మార్చి 3వ తేదీన సుప్రీంకోర్టు అల్లబదియాకు తెలిపింది.

'ఉగ్ర' వేట ఉధృతం

నాలుగుసార్లు లొకేషన్ గుర్తించిన సైన్యం

తృటిలో తప్పించుకున్న ముష్కరులు

శ్రీనగర్: పహల్గామ్ ఉగ్రవాదులను పట్టుకునేందుకు భద్రతా దళాల గాలింపు తీవ్రస్థాయిలో జరుగుతోంది. ఇప్పటికే నాలుగుసార్లు లొకేషన్లను ట్రాక్ చేయగా... వారు తృటిలో తప్పించుకొన్నారు. ఒకసారి భద్రతా దళాలు, ఉగ్రవాదులకు మధ్య కాల్పులు కూడా చోటుచేసుకొన్నాయి. దక్షిణ కశ్మీర్లోని అడవుల్లో భద్రతా దళాలు ముష్కరులకు అత్యంత దగ్గరగా వచ్చాయని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక పేర్కొంది. ముఖ్యంగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ ఎప్పటికప్పుడు వారి లొకేషన్లను గుర్తిస్తున్నారు. వారు మా కనుచూపు మేరలోకి వచ్చినా... కాల్పులు జరిపి తప్పించుకొంటున్నారు. ఇక్కడ అడవులు అత్యంత దట్టంగా ఉన్నాయి. మనకు కనిపిస్తున్నా... ధృవీకరించుకోవాల్సి ఉంటుంది. వారిని పట్టుకొని తీరతాం. కొన్ని రోజులు మాత్రమే మిగిలిఉంది' అని ఓ సైనిక అధికారి మీడియా వద్ద వ్యాఖ్యానించారు. తొలుత ఉగ్రవాదులను అనంతనాగ్‌లోని పహల్గామ్ తెహస్లీ వద్ద గుర్తించారు. కానీ దళాలు అక్కడికి చేరేలోపు వారు దట్టమైన అడవుల్లోకి పారిపోయారు. ఆ తర్వాత కుల్గాం అడవుల్లో వారి కదలికలు కనిపించాయి. అక్కడికి చేరుకొన్న భద్రతా దళాలపై కాల్పులు జరిపి పారిపోయారు. అనంతరం తిరిగి త్రాల్ కొండల్లో వారు ఉన్నట్లు దళాలు గుర్తించాయి. అక్కడి నుంచి వారు జారుకొన్నాక కొకెర్నాగ్‌లో లొకేషన్ బయటపడింది. వారు ప్రస్తుతం ఈ ప్రాంతం చుట్టుపక్కలే ఉండొచ్చని చెబుతున్నారు. ఒక గ్రామంలోని ఇంట్లో వారు రాత్రి భోజనానికి వెళ్లగా అక్కడికి దళాలు చేరుకోవడంతో.. ఆహారం తీసుకొని పారిపోయినట్లు సైనికాధికారి వెల్లడించారు. ప్రస్తుతం ఉగ్రవాదులు తమకు అవసరమైన నిత్యావసరాల సేకరణలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా వీరు గ్రామాల సమీపంలోకి వెళ్లినప్పుడు అక్కడ ఉండే స్థానిక సహాయకులను సంప్రదించి అడవుల్లోకి ఆహారం తెప్పించుకొంటారు. ఆ సమయంలో దళాలకు హ్యూమన్ ఇంటెలిజెన్స్ లభిస్తుంది. కానీ వీరు చాలా అప్రమత్తంగా ఉన్నారని అధికారులు చెబుతున్నారు. ఉగ్రవాదులు కిష్ట్వార్ ప్రాంతంలోకి ప్రవేశిస్తే.. భద్రతా దళాలకు సమస్యలు రావొచ్చని భావిస్తున్నారు. ఇక్కడి పర్వతాలు పహల్గామ్ వైపు శిఖరాలతో కలిసి ఉంటాయి. తక్కువ మంచు ఉండటంతో.. ఉగ్రవాదులు అక్కడి నుంచి వారు దట్టమైన అడవులు ఉన్న జమ్మూ ప్రాంతంలోకి ప్రవేశించడానికి అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఆర్మీ, సీఆర్పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు పహల్గామ్ చుట్టుపక్కల అడవులను జల్లెడ పడుతున్నారు. ఉగ్రవాదులు బైసరన్ లోయలో కొందరు సందర్శకుల నుంచి మొబైల్ ఫోన్లు లాక్కొన్నారు. తమ వారితో మాట్లాడేందుకు వాటిని వాడొచ్చన్న అనుమానాలు ఉండటంతో టెక్నికల్ ఇంటెలిజెన్స్ బృందాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయి.

జానపద గాయని నేహా రాథోడ్‌పై దేశద్రోహం కేసు

న్యూఢిల్లీ: జానపద గాయని నేహా సింగ్ రాథోడ్‌పై... ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో దేశద్రోహం కేసు నమోదైంది. జమ్మూకశ్మీర్‌లోని పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై సోషల్ మీడియాలో ఆమె వివిధ పోస్టులు పెట్టింది. వాటిల్లో ఆమె ఓ మత వర్గాన్ని టార్గెట్ చేసింది. అభయ్ ప్రతాప్ సింగ్ అనే వ్యక్తి ఆ సింగర్‌పై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. జాతి వ్యతిరేక వ్యాఖ్యలు చేసిందని, మత ఘర్షణలు ప్రోత్రహించేలా ఆ వ్యాఖ్యలు ఉన్నట్లు ఫిర్యాదులో ఆరోపించారు. 2020లో ఆమె యూట్యూబ్ ఛానల్ ప్రారంభించింది. రాజకీయ విమర్శకురాలిగా ఆమెకు గుర్తింపు వచ్చింది. 2023 లో ఆమె వివాదంలో ఇరుక్కున్నది. భారతీయ న్యాయ సంహిత చట్టం కింద నేహ సింగ్‌పై కేసు బుక్ చేశారు. లక్నోలోని హజ్రత్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో కేసు రిజిస్టర్ చేశారు.

'నీట్' నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్లు, ఎస్పీలతో అధికారుల వరుస భేటీలు

న్యూఢిల్లీ: దేశంలో వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నీట్ యూజీ పరీక్షకు కేంద్ర విద్యాశాఖ ముమ్మర కసరత్తు చేస్తోంది. గతేడాది నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, అవకతవకల ఆరోపణలతో తీవ్ర దుమారం నెలకొన్న వేళ ఈసారి పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మే 4న దేశవ్యాప్తంగా 550 నగరాల్లోని 5 వేలకు పైగా పరీక్ష కేంద్రాల్లో నీట్ యూజీ పరీక్ష జరగనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూసేందుకు విద్యాశాఖ అధికారులు దేశంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. గతేడాది నీట్ యూజీ, యూజీసీ నెట్ వంటి పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ, అవకతవకల ఆరోపణలు దుమారం రేగడంతో ప్రస్తుతం ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈసారి నీట్ పరీక్షకు పక్కా ప్రణాళికను రూపొందించేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈ పరీక్షను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ఉన్నతాధికారులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ లాజిస్టిక్స్, భద్రత, వంటి కీలక అంశాలపై చర్చిస్తుస్తూ అందరినీ సంసిద్ధం చేస్తున్నారు. మరోవైపు, ఈసారి పరీక్ష కేంద్రాల వద్ద ఎన్‌టీ ఏర్పాటు చేసే భద్రతతో పాటు ఆయా జిల్లాల పోలీసు భద్రతతో బహుళ అంచెల్లో తనిఖీలు చేయనున్నారు. ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు వంటి కీలకమైన సామగ్రి రవాణా పూర్తిస్థాయిలో పోలీసు భద్రతలోనే చేపట్టనున్నారు. అలాగే, వ్యవస్థీకృత మోసాలను అరికట్టేందుకు కోచింగ్ సెంటర్లు, డిజిటల్ ప్లాట్‌ఫాంల కార్యకలాపాలను పర్యవేక్షించనున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో తప్పనిసరిగా తనిఖీలు చేపట్టేలా డ్యూటీ మెజిస్ట్రేట్‌లను నియమిస్తున్నారు.

సీఎం కార్యాలయానికి, నివాసానికి బాంబు బెదిరింపు

తిరువనంతపురం: కేరళలో గత రెండు రోజులుగా బాంబు బెదిరింపుల పరంపర కొనసాగుతున్నది. కేరళ సీఎం కార్యాలయానికి, సీఎం నివాసానికి సోమవారం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. సీఎం కార్యాలయాన్ని, ఆయన నివాసం క్లిఫ్ హౌస్ ను బాంబులతో పేల్చివేస్తామని అగంతకులు ఆ మెయిల్‌లో పేర్కొన్నారు. దాంతో భద్రతా సిబ్బంది, బాంబ్ స్క్వాడ్ రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు. క్షుణ్ణంగా తనిఖీలు చేసి సీఎం కార్యాలయంలోగానీ, క్లిఫ్ హౌస్‌లోగానీ బాంబులేమీ లేవని తేల్చారు. దాంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సీఎం కార్యాలయం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. ఆదివారం కూడా తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో బాంబులు పెట్టామని బెదిరింపు మెయిల్ వచ్చింది. దాంతో భద్రతాసిబ్బంది అప్రమత్తమై తనిఖీలు చేసి బాంబులేమీ లేవని తేల్చారు. ఆ తర్వాత కాసేపటికే తిరువనంతపురం రైల్వేస్టేషన్‌లో బాంబులు పెట్టామని మరో మెయిల్ వచ్చింది. అది కూడా ఆకతాయి మెయిలేనని పోలీసులు తేల్చారు.

పాకిస్థాన్‌కు ఎలాంటి జవాబిస్తారో మోదీనే అడగండి: ఫరూక్ అబ్దుల్లా

శ్రీనగర్: పహల్గాం ఉగ్రదాడిపై పాకిస్థాన్‌కు... భారత్ ఎలాంటి సమాధానం ఇవ్వబోతోందని మీడియా అడిగిన ప్రశ్నకు జమ్మూకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధినేత ఫరూక్ అబ్దుల్లా తనదైన శైలిలో సమాధానం చెప్పారు. ఈ ప్రశ్న అడగాల్సింది తనను కాదని, ప్రధాని నరేంద్రమోదీని అడగాలని సూచించారు. జమ్ముకశ్మీర్ లోని పహల్గాం సమీపంలో పర్యాటకులే లక్ష్యంగా ఈ నెల 22న ఉగ్రవాదులు కాల్పులు జరిపి 26 మందిని దారుణంగా చంపేశారు. మృతుల్లో 25 మంది భారతీయులు, ఒక నేపాలీ ఉన్నారు. ఈ క్రూర దాడితో దేశం యావత్తు దిగ్భ్రాంతికి గురైంది. ఈ దాడికి తామే బాధ్యులమని లష్కరే తోయిబా అనుబంధ విభాగమైన ది రెసిస్టెన్స్ ఫోర్స్ ప్రకటించింది.

ఈ లష్కరే తోయిబా అనే ఉగ్రవాద సంస్థను దాయాది పాకిస్థాన్ పెంచి పోషిస్తున్నది. దాంతో ఉగ్రదాడికి ప్రతిగా పాకిస్థాన్‌కు భారత్ గట్టి సమాధానం ఇవ్వాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మీడియా ప్రతినిధులు తాము కలిసిన ప్రతి నాయకుడిని పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వం ఎలాంటి సమాధానం ఇవ్వబోతోందనే ప్రశ్న అడుగుతున్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన కొత్త సీఎస్ రామకృష్ణారావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అదివారం రామకృష్ణారావును తదుపరి సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం రామకృష్ణారావు అయన రాష్ట్ర సచివాలయంలో అయన సచివాలయంలో సీఎం.రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈనెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ప్రభుత్వం కె.రామకృష్ణా రావును నూతన సీఎస్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం కె.రామకృష్ణారావు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన 2014 సంవత్సరం నుంచి ఆర్థిక శాఖ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణి కార్యక్రమం లో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరిం చాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత అధికారు లను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందరర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (51) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవా లని సూచించారు. రెవెన్యూ శాఖ-16, ఇతర శాఖలకు-21, మొత్తం 51 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ చేసిన మైనంపల్లి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జర్నలిస్ట్ మనోహర్ సోదరుడు కీర్తిశేషులు బోడికే నరేష్ 4వ వర్ధంతి సందర్భంగా సోమ వారం వివైఎంఎల్ అమృత ధార ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, ఎంజెఎఫ్ జాతీయ ఇంచార్జ్ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ హాజరయ్యారు. వారి చేతుల మీదుగా నరేష్ కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులుతో కలసి రోగులకు బ్రెడ్, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ ట్రస్ట్, కుటుంబ సభ్యులు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిం చడం అభినందించదగ్గ విషయమని, మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు అందించాలని సమాజ సేవ చేస్తే అంతా మంచే జరుగుతుంద న్నారు. అనంతరం తిప్పారపు లక్ష్మణ్ మాదిగ మాట్లాడుతూ జర్నలిస్ట్ మనోహర్ కుటుంబ సభ్యులు ఇలాంటి సేవా కార్యక్రమాలు కాకుండా వర్గీకరణ ఉద్యమంలో కూడా ముందున్నారని, సమాజంలో కష్టపడే తత్వాన్ని తెలుసుకున్న వారే సేవను చేయగలుగుతారని వారి సేవలు ఉద్యమానికి, ప్రజలకు ముందు మరిన్ని అందిం చాలని కోరుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ సునీత, ఎ.ఓ డాక్టర్ సంగీత్, సీనియర్ హైకోర్టు అడ్వకేట్ నజీర్ హైమద్, ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా నాయకులు విజయ రావు మాదిగ, ఎంజీఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రామకృష్ణ, సీనియర్ జర్నలిస్టు సంగమేశ్వర్, విశాల్ యాదవ్, తేజ, కుమ్మరి రాజు, మహేందర్ యాదవ్, జ్యోతి కుమార్, తుపాకుల రమేష్, వెంకటరమణ, కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మి కాంత్ రెడ్డి, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ప్రపంచ కార్మికులారా ఏకంకండి అంటూ మే డే వర్ధిల్లాలి అంటూ యాప్రాల్ చౌరస్తాలో ఏఐటియుసి నాయకత్ తన 139వ మే డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎఐటియుసి ఉపాధ్యక్షులు రవి చందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మన జిల్లాలో ఉన్నటువంటి ఏఐటియుసి అరుణ పథకాలు ఎగరవేయాలని అల్వాల్ మున్సిపాలిటీ ముందు ప్రదర్శన, బహిరంగ సభ జయప్రదం చేయాలని కోరారు. దేశంలో, రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్నటువంటి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలంటూ, కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సరైన సమయంలో జీతాలు ఇవ్వకుండా కార్మికులను రక్షణ ధోరణితో ఉండాలని కోరారు. ఇందులో భాగంగానే సిపిఐ పార్టీ మండల కార్యదర్శి కే.సహదేవ్ మాట్లాడుతూ భావన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులు, మున్సిపల్ కార్మికులు, ఇంటి పని వారలైన మహిళల పైన జీత బత్యాలు సరైన టైంలో ఇవ్వకుండా గట్టిగా నిలదీసి అడిగితే ఏదో విధంగా తప్పు మోపి పనికి రావద్దంటూ వేధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు భవన నిర్మాణ కార్మికులు వై.వెంకటేష్, రమేష్ సింగ్, సిపిఐ పార్టీ సాయి, కార్యదర్శి చంద్రయ్య, బాబు, సాయిలు, గణేష్, మల్లేష్, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు జాతీయ కమిషన్ అండ

జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహత్కార్

విశాలాంధ్ర - హైదరాబాద్ : బాధిత మహిళలకు మహిళా కమిషన్ అండగా నిలుస్తుందని జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహత్కర్ అన్నారు. సోమవారం హైదరాబాద్ టూరిజం ప్లాజా సమగం హాల్‌లో ఏర్పాటు చేసిన మహిళా జన్ సున్వాయి (బహిరంగ విచారణ)లో ఆమే పాల్గొని కేసులు పరిష్కరించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్‌లో కమిషన్ మొదటగా ఏర్పాటు చేసి మహిళా బాధితుల నుండి 60 వరకు దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. కమిషన్ దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి బాధిత మహిళల నుండి వేల సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయని తెలిపారు. కమిషన్ ముఖ్య ఉద్దేశం మహిళలు పడుతున్న బాధలు, కష్టాలు బాధితుల సమస్యల సత్వరం పరిష్కరించటం కోసం కమిషన్ నేరుగా బాధితుల వద్దకే రావటం జరుగుతుందని ఆమె తెలిపారు. కమిషన్‌కు మహిళల గృహహింస కేసులు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ వేదింపుల కేసులు, చైల్డ్ కస్టడీ కేసులు, లైంగిక వేధింపులు, అత్యాచారాలు మరికొన్ని ఇతర కేసులు కూడా కమిషన్ దృష్టికి వచ్చాయని తెలిపారు. కమిషన్ పరిధిలో ఉన్న హైదరాబాద్ పరిధిలో 2022 నుండి 2024 ఉన్నటువంటి కేసులలో సత్వరమే 30 కేసులను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయటం జరిగిందని అన్నారు. అన్ని రాష్ట్రాలలో నెలలో నెలకు నాలుగు సార్లు కమిషన్ బాధిత మహిళల వద్దకు వెళ్లి సత్వర న్యాయం చేసి అండగా నిలుస్తున్నామని అన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ శారద నేరెళ్ల, మహిళా సంక్షేమ శాఖ సంచాలకులు క్రాంతి వెస్లీ, అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ క్రైమ్స్ విశ్వ ప్రసాద్, అదనపు కలెక్టర్ జి.ముకుంద రెడ్డి, డిసిపి లావణ్య, జిల్లా మహిళా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, వయోవృద్ధుల శాఖ అధికారి రాజేందర్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆశన్న వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాలు, బాధిత మహిళా కుటుంబాలు సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ విలన్ కేసీఆర్: మహేష్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ ఎంతో ఆటహాసంగా జరపాలనుకున్న పార్టీ రజతోత్సవ వేడుకలు ఆట్టర్ ఫ్లాప్ అయ్యాయని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్ అన్నారు. అదేసమయంలో సభలో కేసీఆర్ చేసిన ప్రసంగంలో పస లేదని యావత్తు తెలంగాణ కొడ్కై కూస్తుందని, దీంతో అయన శకం ముగిసిందనే విషయం స్పష్టం అవుతుందని చెప్పారు. తెలంగాణకు మొదటి చివరి విలన్ ఎవ్వరైన వున్నారంటే అది కేసీఆరే అని విమర్శించారు. సోమవారం నాడు గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలన... 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై చర్చకు కేసీఆర్ సిద్ధంగా వుంటే ట్కెం వేదిక మీరే డిసైడ్ చేయండి చర్చకు ఎక్కడికి రమ్మన వస్తా అని అన్నారు. అసలు ముందు కేసీఆర్‌కు ఫాం హౌస్ దాటి వచ్చే దమ్ముందా అంటూ నిలదీశారు. మొత్తం సభలో అసలు మహిళలే కనిపించలేదని అంటే మహిళలు ఎవ్వరూ కేసీఆర్‌ను నమ్మే పరిస్థితి లేదని ఈ సభతో అర్థమైందని అన్నారు. దేశం కోసం ఆస్తులు, ప్రాణాలు త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని నకిలీ గాంధీలు అనడం కేసిఆర్ దుస్సాహసానికి పరాకాష్ట అని, దీనికి కేసీఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మండిపడ్డారు. సభలో బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ, వక్ఫ్ చట్టంపై కేసీఆర్ ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ బిక్షతోనే కేసీఆర్ సీఎం అయ్యారనే విషయం గుర్తు పెట్టుకోవాలని అలాగే గాంధీ కుటుంబం పెట్టిన రాజకీయ భిక్షతో ఎదిగి దొంగ పాస్ పోర్టుల బిజినెస్ చేసుకుని మీ కుటుంబం లక్షల కోట్లకు పడగలెత్తిందని ఆరోపించారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం కేసిఆర్‌కి వెన్నతో పెట్టిన విద్య అన్నారు.

పదేళ్ళ పాటు వారు ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన కేసీఆర్ కాంగ్రెస్ పై విమర్శలు చేసే అర్హత లేదన్నారు. లాభాల్లో ఉన్న తెలంగాణని రూ.7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన కేసిఆర్‌ను ప్రజలు క్షమించరన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు వెంటనే అమలు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సమావేశము సోమవారం ఏఐటీయుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్‌లో ప్రేమపావని అధ్యక్షతన జరిగినది ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటీయుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్.బాలరాజు, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అతి తక్కువ వేతనాలు కేవలం మధ్యాహ్న భోజన వంట కార్మికులకు మాత్రమే కేవలం రూ 3000లు అదికూడా కేంద్ర ప్రభుత్వం కేవలం రూ 600 మాత్రమే ఇది ఏమైనా వేతనమేనా అన్నారు ప్రధాన మంత్రి అన్నీ మాట్లాడుతారు కానీ వంట కార్మికులు వారికి కనిపించడం లేదా పార్లమెంట్ సభ్యులు ఈ అంశాన్ని కేంద్రం ప్రభుత్వం ద్రుష్టికి తీసుకు వెళ్లి కనీస వేతనాలు అందించే విధంగా క్రుషి చేయవలసినదిగా డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ మేరకు రూ 10 వేల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎనిమిది నెలలుగా వంట బిల్లుల, అల్పాహారం బిల్లులు, వేతనాలు, కోడి గుడ్ల బిల్లులు, పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే 9,10, తరగతులకు మెస్ ఛార్జీలు పెంచలేదు అన్నారు, అందులో భాగంగా కార్మికులు అందరూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మేడే కార్యక్రమాల్లో పాల్గొని ఏఐటీయుసి జెండాలను ఆవిష్కరించాలని కోరారు. 44, కార్మిక చట్టాలను 4 కోడ్స్‌గా కుదించడం జరిగినది అవి పునరుద్ధరణకు మే 20వ తేదీన జరిగే ఒక్క రోజు సమ్మె లో వంట కార్మికులు అంకిత భావంతో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపుని చ్చారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, అంగన్వాడీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కరుణకుమారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటాల రాములు, తోపునూరి చక్రపాణి, కార్యదర్శులు ధర్మల రామ్మూర్తి, మీస లక్ష్మణ్, ముంతాజ్, నిమ్మటూరి రామకృష్ణ, పోలప్పోలు వెంకటేష్, రాష్ట్ర సమితి సభ్యులు, పోరెడ్డి ప్రమీల, గడ్డం భారతి, జాదే నాందేవ్, పద్మ, సరస్వతి, సుమలత, యశ్వంత్, ఇస్రు,ేంఖ, కాంతమ్మ, సోఫియా, సంఫీత, సరిత, సాయమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

నిర్ధిష్ట గడువులోపు పరిష్కరించేలా భూభారతి ఆర్ఓఆర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : రైతుల భూ సమస్య లను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టం ప్రవేశ పెట్టిందని ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్‌లోని తార కన్వెన్షన్ నందు నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సు లో స్థానిక శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. అవగాహన సదస్సులో ముందుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టంలోని మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించగా ఆ వివరాలను జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి రైతులు ప్రజలకు చదివి వినిపించారు. సదస్సులో పాల్గొన్న శాసన సభ్యులు మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతుకు భూ భద్రత కల్పిస్తామని, భూ సమస్య ఉన్న ప్రతి రైతుకు శాశ్వత పరిష్కారం చూపడం జరుగు తుందని, సామాన్య రైతుకు అర్థమయ్యేలా భూభారతి పోర్టల్‌ను రూపొందించడం జరిగిందని తెలిపారు. రైతాంగానికి భరోసా నిస్తూ, భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూభారతి చట్టం రూపొందించ డం జరిగిందని, భూమి ఉన్న ప్రతి రైతుకు భూ భద్రత కల్పించడమే ప్రధాన ధ్యేయంగా భూభారతి చట్టాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి చట్టం వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టం తెచ్చిందని తెలిపారు. ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం ద్వారా రైతులు సెక్షన్ 4లోని సబ్ సెక్షన్‌లు 4, 5 ప్రకారం భూ రికార్డులను సవరణ చేసుకునే అవకాశం కల్పించారని సూచించారు. భూ విస్తీర్ణంలో మార్పులు, రికార్డులలో నమోదు కాని విస్తీర్ణాన్ని నమోదు చేయడం వంటి వాటిని తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలలో పరిశీలన జరిపి చేసేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం ద్వారా అధికారాలు కల్పించిందని తెలిపారు. ఫలితంగా రైతులు తమ భూముల రికార్డులకు సంబంధించిన పొరపాట్లను స్థానికంగానే సరి చేసుకునేందుకు వెసులుబాటు కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ స్థాయిలో చేసుకున్న దరఖాస్తులకు సంబంధించి రైతు సంతృప్తి చెందకపోతే 60 రోజుల్లోపు ఆర్డీఓకు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. అక్కడ కూడా తగు న్యాయం జరగలేదని భావిస్తే 30 రోజుల్లోపు కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. నెదర్లాండ్ ఎక్స్ మినిస్టర్ జాన్ పోర్ట్, ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంత్ రెడ్డి, తహసీల్దార్లు, రైతులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూలే సినిమా థియేటర్లలో విడుదలపై హర్షం

విశాలాంధ్ర - ఎల్.బి.నగర్ : నాగోల్‌లోని ప్రజాసంఘాల కార్యాలయం డాంగే భవన్‌లో సోమవారం పాత్రికేయులతో మాట్లాడుతూ... అన్ని అడ్డంకులను అధిగమించిన తర్వాత భారతదేశం అంతటా కొన్ని సన్నివేశాలకు సంబంధించి బ్రాహ్మణ సంఘాల అభ్యంతరాల మేరకు సిబిఎఫ్ సి దాదాపు 30 నిమిషాల సినిమాను కట్ చేసిందని మహాత్మా జోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే ప్రారంభించిన సంఘ సంస్కరణ చరిత్ర నిజంగా ప్రశంసించదగినదని కట్స్ తర్వాత కూడా, సినిమా అద్భుతంగా దర్శకుడు తీర్చిదిద్దారని, వ్యర్థ పదార్థాలతో మట్టిపెట్టి ఆడపిల్లను చక్రాల బండిలో పాఠశాలకు తీసుకురావడం వంటి కొన్ని సన్నివేశాలు సినిమా వ్యతిరేకుల హృదయాలను తాకాయన్నారు. పూలే జంట గురించి ఆలోచిస్తూ థియేటర్ నుండి బయటకు వస్తున్నారని. మొత్తం మీద అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే దంపతులు సమాజానికి చేసిన అమూల్యమైన, అమూల్యమైన సహకారం, బాలికల విద్య, అంటరాని పిల్లలకు పాఠశాలలు, రైతుల సమస్యలు, శిశువులు వితంతువులను రక్షించడం, అతని ఇంటి నుండి నీరు అందించడం ద్వారా అంటరానితనాన్ని తొలగించడం చాలా చక్కగా చిత్రీకరించబడ్డాయన్నారు. ఇది ఒక మాస్టర్ పీస్, దానిని వెండిపై చూడాలని బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలు ఆదరించాలని వారు కోరారు. హైదరాబాద్‌లో ఇది పివిఆర్ ఇనాక్స్, కాచిగూడ, పివిఆర్ ఐనాక్స్, పంజాగుట్ట, అత్తాపూర్‌లో విడుదల చేయబడిందనివారు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో త్వరితన్యాయం చేసేలా చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆధ్వర్యంలో సోమవారం ఎస్సీ ఎస్టీ నేరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో షెడ్యూల్ కులాలపై దాడులు, వివక్షలకు సంబంధించిన కేసుల పరిణామాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసులను వేగంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసులను పరిశీలించి, వీలైనంత త్వరగా విచారణ పూర్తిచేసి న్యాయం అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టం (అట్రాసిటీస్ యాక్ట్) కింద నమోదైన ప్రతి కేసు పట్ల కూడా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ... తమ కమిషనరేట్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసుల్లో విచారణను వేగవంతం చేయడం ద్వారా అధిక శిక్షలు పడేలా చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. న్యాయ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా, బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, డిసిపి మల్కాజిగిరి పద్మజ, డిసిపి ఎల్బి నగర్ ప్రవీణ్ కుమార్, యాదాద్రి అక్షాన్స్ యాదవ్, డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, డిసిపి అడ్మిన్ ఇందిర, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ జి.నరసింహారెడ్డి, డిసిపి మహేశ్వరం సునీత రెడ్డి, అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, అన్ని జోన్‌ల లాండ్ ఆర్డర్ ఏసీపీలు, తదితరులు పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌ఆర్డీ వైస్ చైర్మన్‌గా శాంతికుమారి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శాంతికుమారి ఈనేల 30వ తేదితో రిటైర్ అవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమె స్థానంలో నూతన సీఎస్‌గా రామకృష్ణరావును నియమించి ప్రభుత్వం ప్రస్తుత సీఎస్ సేవలను వినియోగించుకోవాలని భావించింది. అందులో భాగంగా ప్రస్తుత సీఎస్ శాంతికుమారికి సిఎం.రేవంత్‌రెడ్డి కీలక బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం శాంత కుమారిని ఎంసీహెచ్‌ఆర్డీ వైస్ చైర్మన్‌గా నియమించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 30న పదవీ విరమణ తరువాత శాంత కుమారి ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు. తొలుత శాంత కుమారికి సమాచార హక్కు చట్టం ప్రధాన కమీషనర్‌గా బాధ్య తలు ఇస్తారని భావించారు. అయితే, ప్రస్తుతం సీఎంఓలో ఉన్న ఒక అధికారికి ఈ పదవి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో శాంతు కుమారికి ఈ పదవి ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా జరిగిన ఐఏఎస్ ల బదిలీల్లో సీనియర్లకు స్థాన చలనం కలిగింది. త్వరలోనే సీఎంఓలోనూ మార్పులు చేర్పులు ఖాయంగా కనిపిస్తున్నాయి. కేసీఆర్ హయాంలో సీఎస్‌గా నియమితులైన శాంత కుమారిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా రేవంత్ కొనసాగించారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు బకాయి జీతాలు వెంటనే ఇవ్వాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్ - మల్కాజిగిరి : తెలంగాణ గ్రామ పంచాయతి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్, షామీర్పేట్, మూడు చింతపల్లి, మండలం ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులకు బకాయిలు ఉన్న 5 నెలల జీతం వెంటనే ఇవ్వాలి డిమాండ్ చేస్తూ అడిషనల్ కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదు నెలల జీతం లేకుండా కార్మికులు ఎలా బ్రతకాలి అని ప్రశ్నించారు. రోజు వారు ఖర్చులకు స్కూల్ ఫీజు ఇంటికి రాయి నిత్యఅవసరాల సరుకులు కొనాలన్నా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు ఐదు నెలల జీతాలు ఇవ్వడం మర్చిపోయారని వెంటనే ఐదు నెలలు పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలు వెంటనే చెల్లించా లని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ, గ్రామ పంచాయతీ కార్మికుల నాయకులు సుధాకర్, ఆరోగ్యం, ప్రశాంత్, శ్రీనివాస్, కృష్ణ, రాములమ్మ, గ్రామపంచాయతీ కార్మికులు హాజరయ్యారు.

కగార్ ఆపరేషన్ నిలిపివేయాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి తక్షణమే కగార్ ఆపరేషన్ నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. కేంద్ర హెూంమంత్రి 2026 మార్చిలోపు నక్సలిజాన్ని నిర్మూలిస్తామని ప్రకటించి కగార్ ఆపరేషన్ పేరుతో మారణ హెూమానికి తలపడడం అత్యంత దుర్మార్గమన్నారు. తెలంగాణ, చత్తీస్‌గడ్, మహారాష్ట్ర సరిహద్దులలోని కర్రెగుట్టల ప్రాంతంలో కేంద్రప్యారా మిలిటరీ దళాలు వేలాదిగా మోహరించి నక్సలైట్లను పిట్టల్లాగా కాల్చిచంపడం అమానుషమన్నారు. చర్చలకు తాము సిద్ధమని మావోయిస్టులు ప్రకటిస్తున్న కేంద్రం స్పందించకపోవడం గర్హ నీయమన్నారు. ఇటీవల కాలంలో వందలాది మందిని ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపారని ఈనరమేదం ఇంకెంతకాలం కొనసాగుతుందని ఆయన ప్రశ్నించారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నక్సలిజాన్ని సామాజిక కోణంలో చూస్తున్నామని, శాంతి భద్రతల సమస్యగా పరిగణించడం లేదని పేర్కొనడమే కాకుండా కేంద్ర ప్రభుత్వంపై శాంతి చర్చలు జరిపే విధంగా ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్ గఢ్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో చంపుకుంటూ పోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని వెంటనే ఆపరేషన్ కగార్ నిలిపివేసి మావోయిస్టులను చర్చలకు పిలవాలని డిమాండ్ చేయడం స్వాగతించదగినదన్నారు. ప్రజా స్వామ్యవాదులంతా కగార్ ఆపరేషన్ నిలిపివేసి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

IN THE COURT OF 85th COMMERCIAL COURT BENGALURU AT BENGALURU

COM.OS No. 1659 / 2024

BETWEEN:
Mr. Harshit Jain ...Plaintiff
And:
M/s. Wind on Earth Vihant Pvt. Ltd & Others ...Defendants

No.1A Summons/Notice for Service by Advertisement in a News Paper (O.5 R.20) of CPC 1908

SUMMONS TO DEFENDANT BY WAY OF PAPER PUBLICATION.

Schedule Shop Premises Address:
1. M/s. Wind on Earth Vihant Pvt. Ltd., House# 11-5-334/1/A/1, Red Hills, Opp. Red Hills Park, Khairatabad, Hyderabad-560 004. (Represented by its Managing Director Sri Amarendra Nammi), Mob: 93925 02702. E-mail ID: amarendranammi@gmail.com
2. Sri. Sashikiran.K, aged about 48 years, No.569, Sanjeevini, 26th Cross, Kirloskar Layout, Hesaraghatta Main Road, Bengaluru-560 073 (Karnataka) (Authorized Manager of M/s. Wind on Earth Vihant Pvt. Ltd) Mob: 87627 32782. Email ID: amarendranammi@gmail.com

Whereas, Sri. Harshit Jain, S/o Sri. Jinendra Jain, aged about 37 years, R/at Flat No.S-603, Pramuk MM, Meridian MM, Industrial Road, Jayanagar 7th Block, Bangalore-560 011, has instituted the above Commercial Suit against you for recovery of money in COM-OS/1659/2024 on 06.12.2024, for recovery of due payment of Rs.6,72,750/- (Rupees Six Lakh Seventy-Two Thousand Seven Hundred Fifty Only). You are hereby summoned to appear in this Hon'ble Court in person or by a pleader on the **06.06.2025 at 10:30 AM** to answer the same, failing which the Plaint will be disposed of Ex-Partee.

Given under my hand seal of the court, this 22nd April 2025.

By Order of the Court
Sd/- Senior Sheristedar
Commercial Court Unit,
City Civil Court, Bengaluru

Advocate Address: Kumarpal Munoyath
No.32, Appaji Rao Lane,
C.T. Street Cross, Bengaluru-560 002.

ప్రజా ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో ప్రజలు అందచేసిన ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 80 దరఖాస్తులను అయన స్వీకరించారు. అట్టి అర్జీలను శాఖాధికారులు సత్వరమే పరిశీలన చేసిపరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో హౌసింగ్-25, పెన్షన్-19, రెవెన్యూ-15, ఇతర శాఖలకు సంబంధించినవి-21 దరఖాస్తులు అందాయని అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ. వెంకట చారి, ఆర్డిఓ రామకృష్ణ, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవేర్ సంస్థ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో అవేర్ సంస్థ అందరికీ అదర్శంగా నిలుస్తుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు ఎంపీ.డికె.అరుణ అన్నారు. సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని అమె కొనియాడారు. హైదరాబాద్ శాంతివనంలో అట్టహాసంగా అవేర్ కాలేజీ అఫ్ నర్సింగ్ స్నాతకోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డికె.అరుణ పాల్గొని అవేర్ గ్రూప్స్ ఫౌండర్ మాధవన్ జి, డైరెక్టర్ రాజవర్ధన్ రెడ్డితో కలిసి నర్సింగ్ విద్యార్థినులకు పట్టాలు అందజేశారు. ముఖ్యంగా మా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కల్వకుర్తిలో మాధవన్ చాలా సేవ కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. నిరుపేదలకు విద్య వసతులు, వైద్య సేవలు ఇలా ఎన్నో రకాల సేవలు కల్వకుర్తి వేదికగా చేసారన్నారు. ఈ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన 50 ఏళ్లల్లో అవేర్ సంస్థ అనేక సేవా కార్యక్రమాలను చేపటడం జరిగిందన్నారు. వైద్య రంగంలో నిష్ణాతులుగా నిరుపేదలకు సేవ చేసి మరేందరికో ఆదర్శంగా మీరు నిలవాలని సూచించారు. అవేర్ సంస్థ పేరుతో మాధవన్ జీ చేస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. నావంతుగా ఈసారి జాతీయ స్థాయి అవార్డు కోసం మాధవన్ పేరు నామినేట్ చేస్తానని చెప్పారు. ముమ్మందు అవేర్ సంస్థ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని కోరారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ స్వీకరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (68) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ సూచించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజాభవన్ నుండి వచ్చే ధరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించాలని డిఆర్ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి : కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : మావోయిస్టుల ఏరివేతకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తక్షణమే మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలకు ఆహ్వానించాలని కోరారు. సోమవారం నాడు ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని సూచించారు. శాంతి చర్చలకు సిద్ధమని ఇప్పటికే మావోయిస్టులు ప్రకటించిన నేపథ్యంలో కేంద్రం ముందుకు రావాలని అన్నారు. మావోయిస్ట ప్రభావిత రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీలతో మాట్లాడి ప్రభుత్వం సలహాలు, సూచనలు తీసుకోవాలని, కేవలం చర్చల ద్వారా మాత్రమే శాంతిని నెలకొల్పడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కాల్పులతో మావోయిస్టులను అంతం చేస్తామన్న కేంద్ర ప్రభుత్వపు విధానం సరికాదని సూచించారు. ప్రజాస్వామ్యబద్ధంగా శాంతి చర్చలు నిర్వహించాలని అన్నారు. సరెండర్లను ప్రోత్సహించి వారికి జీవనోపాధి కల్పించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. పోలీసులు, మావోయిస్టుల మధ్య ఆదివాసీలు నలిగిపోతున్నారని, ఎవరు చనిపోయినా కూడా మన దేశ పౌరులే కాబట్టి కేంద్రం చొరువ తీసుకోవాలని తెలిపారు.

కేసీఆర్ లాంటి లీడర్ మరొకరు లేరు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తప్పులు చేస్తున్న చిల్లర ప్రభుత్వంను ప్రశ్నిస్తే తప్పు అన్నట్లుగా మంత్రులు మాట్లాడుతున్నారంటూ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో ఆర్.ఆర్ టాక్స్ నడుస్తుందని, 20 నుంచి 30 శాతం ఆర్.ఆర్ ట్యాక్స్ కట్టాల్సిందే అనే నిబంధన రాష్ట్రంలో నడుస్తుందన్నారు. అదే సమయంలో ప్రభుత్వంలో మంత్రుల మధ్య సమన్వయం లేదని దుయ్యబట్టారు. తెలంగాణలో కేసీఆర్ లాంటి చరిష్మ వున్న లీడర్ మరొక్కరు లేరని అన్నారు. గతంలో నిర్వహిం చిన సభలు అన్నింటికి తలదన్నేలా అదివారం ఎల్కతుర్తి సభ జరిగిందని, సభను చూసి రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి అన్నం కూడా తినలేదంట అంటూ ఎద్దేవ చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ కేసీఆర్ పై ప్రజలకు అచంచలమైన విశ్వాసం ఉందని అందుకే ఎండలు సైతం లెక్క చేయకుండా ప్రజలు వచ్చారన్నారు. మాజీ నక్సలైట్, రాష్ట్ర మంత్రి సీతక్క, నక్సల్కెట్ల హక్కుల కోసం, ధర్మం కోసం మాట్లాడిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పాలని, రేవంత్ రెడ్డి చెప్పాడని కేసిఆర్‌ను సీతక్క తిట్టడం న్యాయమేనా అన్నారు. జీఓ నంబర్ 46 ద్వారా లక్షమంది కానిస్టేబుల్స్‌ను వాడుకుని చెత్తబుట్టలో పడేసారన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: చందానగర్ హుడాపేస్ శ్రీశ్రీ రెసిడెస్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ నందు మెడికవర్ చందానగర్ హాస్పిటల్స్ వారి సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో ఎత్తు, బరువు, కంటి, దంత, రక్తపోటు, షుగర్, పల్స్, ఈ.సీ.జీ., బీ.యం.డి. మొదలగు పరీక్షలు నిర్వహించారు. వైద్యులు డాక్టర్ ఆదిత్య (జనరల్ ఫిజీషియన్), డాక్టర్ నవీన్(కొ డెంటల్), విజన్ ఐ కేర్ డాక్టర్ శిరీష తదితరులు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మారిన జీవనశైలిలో పర్యావరణంలో వస్తున్న అనేక మార్పులవల్ల ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారు అని అన్నారు. ప్రతి ఒక్కరు నిత్యం వ్యాయామం, యోగ, ధ్యానం, నడక, కనీసం 40 నిమిషాలు చేయాలి. మనం తీసుకొనే ఆహారం సమయపాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చందానగర్ హుడాకాలనీ పేస్ శ్రీశ్రీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రాజయ్య, రమణారెడ్డి, సిద్ధిరాములు, రామరాజు, విద్యాసాగర్, రామిరెడ్డి, మరియు ఫ్రెండ్స్? వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులుకొక్కుల జబర్దన్, కౌడిన్యశ్రీ నందూరి వెంకటేశ్వరరాజు, పాలం శ్రీనివాస్, శివరామిరెడ్డి,పకీరయ్య, ఊరిటి వెంకటరావు, అలాగే హాస్పిటల్ ప్రతినిధి నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో 98 మందికి వైద్యసేవలు అందించారు.

సమగ్రమైన క్రీడా పాలసీలు వచ్చేందుకు కృషి చేస్తా

తెలంగాణ బ్యాట్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో సమగ్రమైన బ్యాడ్మింటన్ క్రీడా పాలసీలు వచ్చేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, భారత బ్యాట్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో బ్యాట్ ఏర్పాటు చేసిన వార్షిక సాధారణ సమావేశానికి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వై.ఉపేందర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు చాముండేశ్వరి నాథ్, జి వెంకటేశ్వర్ రావు, పి.రమేష్ రెడ్డిలు, సంయుక్త కార్యదర్శులు ఎల్.రవికుమార్, మనోజ్ కుమార్, యువిఎన్ బాబు (ఈవెంట్స్ అండ్ ప్రోటోకాల్), కోశాధికారి వంశిధర్, మెంబర్లు పిసిఎస్ రావు, రామ్మోహన్, రంగారావు, ఏఎస్ సూరి, రంగారెడ్డి జిల్లా బ్యాట్మెంటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, పి.సుధాకర్, నాగమణిలతో పాటు రాష్ట్రంలోని 19 జిల్లాల నుంచి బ్యాట్మెంటన్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు హాజరయ్యారు. అనంతరం పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ... రాష్ట్రంలో బ్యాట్మెంటన్ క్రీడలు అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యక్రమాలు రూపొందిస్తున్నామని, అందులో భాగంగానే నేడు తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. అనంతరం బ్యాట్ సలహాదారునిగా కే.లక్ష్మణ్, బ్యాట్ మీడియా కోఆర్డినేటర్‌గా వెంకటరమణారెడ్డిని నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి హర్ష, పెద్దపల్లి వైస్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఎండి గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ శివ కుమార్ నాయుడు అధికారులకు సూచించారు. సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగరంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అడిషనల్ కమిషనర్ శివ కుమార్ నాయుడు వినతులు స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను ఆయా విభాగాలకు పంపి తక్షణ చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదును ఆయా విభాగాల అధికారులు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 67 ఆర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు చంద్రకాంత్ రెడ్డి, సరోజ, వేణుగోపాల్ రెడ్డి, యాదగిరి రావు, రఘు ప్రసాద్, గీతా రాధిక, సత్యనారాయణ, అడిషనల్ సిసీపీలు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

జల్సాల కోసం బీఆర్ఎస్ సభ

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్ : ప్రజా సమస్యలను పక్కనపెట్టి జల్సాల కోసం బీఆర్ఎస్ సభ ఏర్పాటు చేశారన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం నిర్వహించారు. సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కొడుకు కేటీఆర్ డ్రగ్స్ రాజా అని కూతురు కవిత లిక్కర్ రాణి, అల్లుడు అగ్గిపెట్ట మచ్చ వీరందరి రాజకీయ ప్రాబల్యం పెంచేందుకు కెసిఆర్ 14 నెలల తర్వాత భారీ బహిరంగ సభను రజతోత్సవాల పేరిట ఏర్పాటు చేశాడని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన సన్యాసి కెసిఆర్ అంటూ తీవ్రంగా విరుచుకుపడ్డారు. మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఉన్న ప్రాంతాన్ని అప్పుల కుప్పగా మార్చి కుటుంబ ఆర్థిక ప్రయోజనాలకి పెద్దపీట వేసిన కేసిఆర్ కాంగ్రెస్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. 100 హామీలతో మోసాలు చేసిన కేసీఆర్ ఏ మొహం పెట్టుకొని 25 సంవత్సరాల రజతోత్సవ సభ ఏర్పాటు చేశారని సిగ్గు ఉండాలి అంటూ ఘాటుగా విమర్శించారు. టిఆర్ఎస్ రజతోత్సవ సభ గులాబి పార్టీ గులాముల సభగా ఆయన అభివర్ణించారు. ఏడాది తర్వాత కేవలం జల్సా చేసుకునేందుకు ఏర్పాటుచేసిన సభగా ఆయన విమర్శించారు. గత పది ఏళ్లలో కేసీఆర్ ఎన్నో హామీలు ఇచ్చి తప్పారని ఎమ్మెల్యే శంకర్ గుర్తు చేశారు. తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అభివృద్ధి సంక్షేమ ఫలాలు చూసి కెసిఆర్ కు కడుపునొప్పి వచ్చిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, బాలరాజు గౌడ్, కృష్ణారెడ్డి, రఘునాయక్, ఇబ్రహీం, శ్రీను నాయక్, ఆగనూరు బస్వం, చంద్రశేఖర్, సత్తయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక దృఢత్వం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: క్రీడలు ఆడడం వల్ల మానసిక దృఢత్వం పెరుగుతుందని బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 - సుభాష్ నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్ నందు సుమారు 2.90 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఇండోర్ షటిల్ కోర్ట్స్ క్రీడా ప్రాంగణాన్ని బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ పిల్లలు మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా క్రీడల్లో ప్రోత్సహించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో షటిల్ కోర్ట్స్ క్రీడా ప్రాంగణం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుభాష్ నగర్ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, శేషా చారి, దుర్గా రావు, భాస్కర్ రెడ్డి, హరిబాబు యాదవ్, నర్సింగ్ రావు, శ్యామ్, గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర రావు, పద్మ, అనిల్, శ్రీదేవి, సరిత, ఉమా, స్వర్ణ, ఎస్.ఆర్.నాయక్ సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు సదానంద చారి, ప్రభాకర్,జనప్రియ భాస్కర్ రెడ్డి,రమేష్ పాల్గొన్నారు.

వేగంగా సాగుతున్న మినీ చెరువుల నిర్మాణం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాల పెంపుదల లక్ష్యంగా సంస్థ చైర్మన్ ఎన్.బలరామ్ నీటి బిందువు జల సింధువు పేరుతో ఈ నెల ప్రారంభించిన మినీ చెరువుల నిర్మాణం వేగవంతంగా సాగుతోంది. మే 15 నాటికి సింగరేణి వ్యాప్తంగా మొత్తం 12 ఏరియాల్లో 62 కొత్త చెరువుల నిర్మాణం, 40 చెరువుల్లో పూడిక తొలగింపు పూర్తి చేయాలని చైర్మన్ ఎన్.బలరామ్ ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అన్ని ఏరియాల జీఎంలకు, సంబంధిత పర్యావరణ, సివిల్ శాఖల అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికి 20 శాతం పైగా పనులు పూర్తయ్యాయని, పనులను మరింత వేగిరపరుస్తూ మే 15 నాటికి మొత్తం చెరువుల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. రానున్న వర్షాకాలంలో సింగరేణి నిర్మించిన ఈ చెరువుల్లో నీరు పుష్కలంగా చేరే విధంగా తగు సివిల్ పనులు పూర్తి చేయాలన్నారు. రక్షణ చర్యలుగా మినీ చెరువుల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. తొలుత 50 మినీ చెరువులు నిర్మించాలని భావించినప్పటికీ, గనుల ప్రాంతంలో ఉన్న అవకాశాలను పరిగణలోకి తీసుకొని వీటి సంఖ్యను 62కు పెంచారు. 40 చెరువుల్లో నీటి సామర్థ్యం పెంపుదలకు పూడిక తొలగింపు పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ చెరువుల నిర్మాణం సింగరేణి సమీప ప్రాంత భూగర్భ జలాల పెంపుదలకు ఎంతగానో ఉపయోగపడే అవకాశం ఉంది. చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్‌తో పాటుకొత్తగూడెం కార్పొరేట్ నుండి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కొప్పుల వెంకటేశ్వర్లు, హైదరాబాద్ కార్యాలయం నుంచి సింగరేణి అటవీ శాఖ అడ్వైజర్ మోహన్ పరిగిన్, పర్యావరణ శాఖ జనరల్ మేనేజర్ సైదులు, ఏరియాల నుండి అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, పర్యావరణ, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులను ప్రారంభించిన మాజీ మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాది గూడ నగరపాలక సంస్థ పరిధిలోని 7వ డివిజన్‌లో సిసి రోడ్ల అభివృద్ధి పనులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాడుగుల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ప్రారంభిం చారు. ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ హాజరయ్యారు. మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడు తూ సిసి రోడ్ల నిర్మాణం ద్వారా స్థానికులకు రాకపోకలు సులభతరం అవుతా యని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతా యని అన్నారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాడుగుల చంద్రారెడ్డి, మోహన్ కుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతూ నూతన కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. నల్లగండ్ల గ్రామ శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకరోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై,ఆలయంలో ప్రత్యేక పూజ నిర్వహించి, నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. నల్లగండ్ల గ్రామంలోని శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయం గ్రామస్థులకు భక్తి, శ్రద్ధా కేంద్రంగా ఉందని, ఆలయ అభివృద్ధికి నూతన దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజ నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులను అభినందిస్తూ, ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని, భక్తుల సేవలో అంకితభావంతో పని చేయాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే,భక్తుల సౌకర్యార్థం ఆలయ అభివృద్ధి జరగాలని, నీటి సదుపాయాలు, ఇతర అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిటీకి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశరథ్, దయాకర్ యాదవ్, వెంకట్ రెడ్డి, పి.శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్, యాదగిరి, మల్లేష్, కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, నర్సింహ రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర- దుండిగల్: నిజాంపేట్, దిండిగల్, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో పనిచేసే మున్సిపల్ కార్మికులకు వేతనాలను వెంటనే చెల్లించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు అశోక్, చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా పరిధిలో నిజాంపేట్, దుండిగల్, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు మూడునెలలు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం అడిషనల్ కలెక్టర్ దీప్తికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నెలలు తరబడి జీతాలు పెండింగ్లో ఉన్నాయి. కార్మికులు జీతాలు అందక చాలా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కుటుంబం గడపడం కూడా చాలా కష్టంగా ఉన్నదని, ఇంటి అద్దెలు చెల్లించలేక నిత్యవసర వస్తువులు కొనుక్కోలేక పస్తులు ఉండవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్మికుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. ప్రతినెల 10వ తేదీలోపు జీతాలు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఉన్ని కృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

హిప్పోక్యాంపస్ పాఠశాలకు గ్లోబల్ సస్టైనబిలిటీ అవార్డు

విశాలాంధ్ర - కొత్తూరు : నందిగామ మండలం, రంగాపూర్ శివారులోగల హిప్పోక్యాంపస్ పాఠశాల విద్యార్థులు 2025 సియేనా సొల్యూషన్స్ ఛాలెంజ్ సస్టైనబిలిటీ అవార్డును సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల డిజిటల్ ప్రమిస్ ఆధ్వర్యంలో ప్రధానం చేయబడిన ఈ అంతర్జాతీయ పురస్కారం, విద్యార్థుల నేతృత్వంలో చేపట్టిన కంటి సంరక్షణ అవగాహన, సేవా కార్యక్రమానికి ప్రతిఫలంగా లభించిందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం నుండి ఈ అవార్డు అందుకున్న ఏకైక పాఠశాల హిప్పోక్యాంపస్ కావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 24 దేశాల నుండి 62 ఉత్తమ విద్యార్థి బృందాలను సియినా ఛాలెంజ్ గుర్తించిందని, ఇందులో 20 బృందాలకు రూ.3 వేలు, మిగిలిన 42 బృందాలకు హిప్పోకాంపస్ తో సహా రూ "750 నగదు బహుమతిగా అందించిందని అన్నారు. ఈ నగదు ప్రాజెక్టులను విస్తరించేందుకు దోహదపడుతుందని అన్నారు. హబీబా ముస్కాన్ మార్గదర్శకత్వంలో పాల్గొని అవార్డు సాధించిన బృందంలో సత్య ప్రకాష్, మారియా ఫాతిమా బి.శివాత్మిక, అపర్ణ ధనలక్ష్మి, సాయి దివ్య ఎ. యశస్వి వి.పి. అక్షయ, కెఎస్. అక్షిత, కె. నిఖిత్, బి. లోహిత, టి.కార్తిక విద్యార్థులు ఉన్నారు. వారికి పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - అమనగల్లు: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. సోమవారం ఆమనగల్లులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తాలు తీసే యంత్రంను పరిశీలించారు. కేంద్రాలలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ చైర్మన్ గీత నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కేశవరెడ్డి, శ్రీశైలం, శ్రీకాంత్, విజయ్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - కాప్రా : గత పదేళ్లుగా జరగని అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే ఏడాది కాలంలోనే జరిగిందని, నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేపడుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కప్పరా సాయి కిరణ్ గౌడ్ అన్నారు. సోమవారం మల్లాపూర్ డివిజన్లో వివిధ కాలనీలలో చేపడుతున్న సి సి, బిటి రోడ్ల నిర్మాణాల పనులకు నిధులు మంజూరు చేయించిన ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో మల్లాపూర్ అభివృద్ధి జరిగిందని కృతజ్ఞత తెలిపారు. రూ 64 లక్షలతో బీటీ రోడ్డు కార్పెటింగ్, బీరప్పగడ్డ నుండి మల్లాపూర్ ఇండస్ట్రీ, మనిక్ చంద్ వరకు రూ 35 లక్షలతో, వెంకటరమణ కాలనీలో సీసీ రోడ్డు పనులు రూ 30 లక్షలతో, బ్రహ్మపురి కాలనీలో సీసీ రోడ్డు పనులు రూ 45 లక్షలతో సింగం చెరువు తండా స్మశాన వాటికలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు మంజూరు చేసిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కప్పరా సాయి కిరణ్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గరీబి అటావ్ దేశ్‌కు బచావో అనే నినాదంతో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకలతో పాటు అభివృద్ధి పనులను చేపడుతుందని, గత పదేళ్లుగా బిఆర్ఎస్ పార్టీ ప్రజలను మాయ మాటలు చెప్పి ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆయన మండిపడ్డారు.

30న హెచ్ఎంఏటి ఆధ్వర్యంలో హోమియో ఫెస్ట్

విశాలాంధ్ర-బషీర్ బాగ్: హెూమియో వైద్య పితామహుడు డా.శామ్యూల్ హానిమన్ 270 వ జయంతి పురస్కరించుకొని, హెూమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (హెచ్.ఎం.ఎ.టి) హైదరాబాద్ ఆధ్వర్యంలో హెూమియో ఫెస్ట్ కార్యక్రమాన్ని ఈ నెల 30న ఖైరతాబాద్‌లోని ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఆడిటోరియంలో ఉదయం 9 నుండి సాయంత్రం 6 గం. వరకు జరుపుతున్నామని హెచ్.ఎం.ఎ.టి. హెూమియో ఫెస్ట్ కార్య నిర్వాహక వర్గం డా. కె.గోపాలకృష్ణ, డా.జి.దుర్గాప్రసాద్‌లు తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెూమియో ఫెస్ట్ ప్రారంబోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా కె.ఎన్.ఆర్.ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా.పి.వి. నందకుమార్ రెడ్డి, సి.బి.ఐ మాజీ ఉప సంచాలకులు వి.వి.లక్ష్మీనారాయణ హాజరు కానున్నారని వెల్లడించారు. ప్రముఖ హెూమియో వైద్యుడు, పూర్వ హెూమియో అదనపు సంచాలకులు డా.జి. జనార్ధన్ రెడ్డి, గెస్చర్స్ ద్వారా హెూమియోపతిక్ రెమెడీస్ సెలెక్ట్ చేసే అంశంపై ప్రత్యేక ప్రసంగం చేస్తారని, అనంతరం ఇండోర్ నుండి వస్తున్న ప్రముఖ హెూమియో వైద్యుడు డా వైభవ్ జైన్ ఆగ్రో హెూమియోపతిపై డా. ఎన్ రామయ్య స్మారక ఉపన్యాసం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్ గౌరీ, డాక్టర్ మధు వారణాసి, డాక్టర్ గౌతమ్, డాక్టర్ చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పద్మ అవార్డుల ప్రదానోత్సవం

రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న బాలకృష్ణ, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, అజిత్

న్యూఢిల్లీ: దేశంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం రాష్ట్రపతి భవన్‌లో సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రముఖులకు అవార్డులను అందజేసి గౌరవించారు. తెలుగు రాష్ట్రాల నుంచి వైద్య విభాగంలో పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన డాక్టర్ దువ్వూరు నాగేశ్వర్ రెడ్డి, కళా రంగంలో పద్మభూషణ్‌కు ఎంపికైన సినీ నటుడు బాలకృష్ణ, పద్మశ్రీకి ఎంపికైన మాడుగుల నాగఫణిశర్మ రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ విశిష్ట పౌర పురస్కారాలను అందుకున్నారు. సినీ నటుడు అజిత్, క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తదితరులు 'పద్మ' అవార్డులను అందుకున్నారు. ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, శివరాజ్‌సింగ్ చౌహాన్, జితేంద్రసింగ్, ఏపీ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి, పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది ఏడుగురికి పద్మవిభూషణ్, 19 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలను కేంద్రం ప్రకటించింది. వీరిలో సగం మందికి పురస్కారాలను ప్రదానం చేశారు. మిగతా వారికి త్వరలో ప్రదానం చేస్తారు.

తాడిపత్రి మున్సిపల్ వైస్ చైర్మన్ 2గా సీపీఐ కౌన్సిలర్ తలారి అరుణ

విశాలాంధ్ర-తాడిపత్రి: అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపల్ వైస్ చైర్మన్ -2 గా 12వ వార్డు సీపీఐ కౌన్సిలర్ తలారి అరుణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రొసీడింగ్ అధికారి కె.మల్లికార్జునుడు పర్యవేక్షణలో వైస్ చైర్మన్ ఎన్నిక జరిగింది. మొదట టీడీపీ కౌన్సిలర్ జింక లక్ష్మీదేవి ... తలారి అరుణ పేరును ప్రతిపాదించగా ఎవరూ పోటీకి దిగలేదు. దీంతో తలారి అరుణ... వైస్ చైర్మన్ 2గా ఎన్నికైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జునుడు ప్రకటించారు. అనంతరం ఆమెతో ప్రతిజ్ఞ చేయించారు. తనకు సహకరించిన ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిలకు అరుణ కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఆశయానికి అనుగుణంగా తాడిపత్రి మున్సిపల్ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, తాడిపత్రి నియోజకవర్గ ఇంచార్జ్ రాజారెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి హామీ ఇచ్చిన మేరకు తలారి అరుణకు మున్సిపల్ వైస్ చైర్మన్ 2గా నియమించారని తెలిపారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దుకు పోరాటం: ముస్లిం జేఏసీ

కర్నూలులో కులమతాలకతీతంగా భారీ ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: వక్ఫ్ సవరణ చట్టం రద్దుచేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామని ముస్లిం జేఏసీ నాయకులు పిలుపు నిచ్చారు. జేఏసీ అధ్వర్యంలో సోమవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ముస్లిం, వైసీపీ, బీఎస్‌పి, ఎస్‌డిపిఐ, సీపీఐ, ఆవాజ్, సీపీఎం, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా తదితర పార్టీలన్నీ ఐక్య ర్యాలీ నిర్వహించాయి. కిడ్స్ వరల్డ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ రాజ్ విహార్ మీదుగా కలెక్టరేట్ చేరుకుంది. గాంధీ విగ్రహం వద్ద పహల్గాం మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎంఏ హమీద్ సాహెబ్ అధ్యక్షత న జరిగిన సభలో జేఏసీ నేతలు మాట్లాడుతూ.... మోదీ ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఇది అమలైతే క్రైస్తవులు, బౌద్ధులు , జైనులు అందరిపై దీని ప్రభావం పడుతుందన్నారు. జేఏసీ నేత సయ్యద్ జాకీర్ అహ్మద్ సాహెబ్ మాట్లాడుతూ భారతదేశ ఒక లౌకిక రాజ్యం అని, మోదీ ప్రభుత్వం నల్ల చట్టం తీసుకురావడంతోనే మనమంతా రోడ్డుపైకి రావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ముస్లిం... హిందువులను విడదీసి పాలించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఖదీర్ సాహెబ్ మాట్లాడుతూ కలిసికట్టుగా పోరాడి వక్ఫ్ చట్టాన్ని రక్షించుకుంటామన్నారు. ఎస్‌డిపిఐ నాయకులు అబ్దుల్లా ఖాన్ మాట్లాడుతూ వక్ఫ్ భూములను... ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ తీసుకోవాలని చూస్తుందని విమర్శించారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి,ఎస్వీ మోహన్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, రామకృష్ణారెడ్డి, గౌస్‌దేశాయ్, సి.మహేష్, నాగరాజు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ రంజిత్ బాషాకు జేఏసీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. తొలుత రాజ్యాంగ పీఠికను అందరి చేత చదివించి ప్రతిజ్ఞ చేయించారు.

యువతే దేశ భవిష్యత్

- ఉద్యోగ సాధన కంటే సంస్థలను స్థాపించాలి: సీఎం చంద్రబాబు
- 'విట్'లో నూతన భవనాల ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను వారు అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. ఉద్యోగంతోనే సంతృప్తి చెందకుండా, సంస్థలను స్థాపించే స్థాయికి యువత ఎదగాలని ఉద్బోధించారు. ఏపీని ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామని, క్వాంటమ్ వ్యాలీకి అమరావతి కేరాఫ్ అడ్రస్ కానుందని అన్నారు. విట్ వర్సిటీలో 'వి లాంచ్‌పాడ్ 2025 - స్టార్టప్ ఎక్స్ పో'లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. క్యాంపస్‌లో మహాత్మాగాంధీ బ్లాక్, వి.వి.గిరి బ్లాక్, దుర్గాబాయి దేశ్ ముఖ్ బ్లాక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీఎం చంద్రబాబు మాట్లాడారు. విట్ అధినేత విశ్వనాథన్ సాధారణమైన వ్యక్తిగా తన జీవితం ప్రారంభించి అసాధారణమైన వ్యక్తిగా ఎదిగిన తీరు అభినందనీయమన్నారు. ఆ రోజు విట్ కోసం విశ్వనాథన్ గారు 200 ఎకరాలు అడిగారు. నేను 100 ఎకరాలు ఇచ్చాను. వారికి కావాల్సిన మరింత భూమి ఇచ్చే బాధ్యత నాది. అయితే... రాబోయే ఏడేళ్లలో 50 వేల మంది స్టూడెంట్స్ విట్‌లో చదివేలా అభివృద్ధి చెందాలన్నారు. విట్ విద్యాసంస్థల్లో మన అమరావతి విట్ నెంబర్‌వన్‌గా ఉండాలని కోరుకుంటున్నానని చంద్రబాబు అన్నారు.

అమరావతి ఇక అన్‌స్టాపబుల్

ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పనులు పున: ప్రారంభమవుతాయని చంద్రబాబు తెలిపారు. నాపై నమ్మకం పెట్టుకుని 29 వేల మంది రైతులు, 34 వేల ఎకరాల భూమి రాజధానికి ఇచ్చారు. అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని రైతులు ముందుకురావడం అభినందనీయమన్నారు. గతంలోనే భవిష్యత్ ఐటీదే అని గ్రహించి దానికి అధిక ప్రాధాన్యత ఇచ్చానని,14 నెలల్లో హైటెక్ సిటీ నిర్మించామని చెప్పారు. ఇప్పుడు రాజధాని అమరావతిపై దృష్టి కేంద్రీకరించామన్నారు. త్వరలో అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయబో తున్నాం. సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీకి ఫౌండేషన్ వేస్తున్నాం. భవిష్యత్‌లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యూనివర్సిటీలు అమరావతికి రాబోతున్నాయని సీఎం పేర్కొన్నారు. సిలికాన్ వ్యాలీ నుంచి స్పేస్ ఎక్స్ వరకు, గూగుల్ నుంచి మైక్రోసాఫ్ట్ వరకు, నాసా నుంచి వాల్ స్ట్రీట్ వరకు అన్ని చోట్ల మన తెలుగు వారే సత్తా చాటుతున్నారని... సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల, ఇంద్రానూయి, అజయ్ బంగా, శాంతను నారాయణ్ వంటి వారు గ్లోబల్ సంస్థల్ని బలోపేతం చేస్తుండటం మనకు గర్వకారణమన్నారు.

విశాఖకు త్వరలో మెట్రో రైల్

అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నామని, విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. విశాఖకు కొత్త ఎయిర్ పోర్టు, మెట్రోతో పాటు త్వరలో గూగుల్ రాబోతోందన్నారు. ఇప్పటికే విశాఖలో స్టీల్ ప్లాంట్ ఉంది. అనకాపల్లిలో ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ దిగ్గజ కంపెనీ రూ.లక్ష కోట్లతో పెట్టుబడులు పెడుతోంది. రాయలసీమలోనూ స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపడతాం. అనంతపురంలో లేపాక్షి మొదలు ఓర్వకల్లు వరకూ నాలెడ్జ్ హబ్‌గా తయారుచేస్తాం. రాయలసీమను డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటో మొబైల్స్, డ్రోన్, శాటిలైట్ లాంచింగ్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అభివృద్ధి చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. భవిష్యత్ డ్రోన్లదేనని, ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం అమరావతిలో అభివృద్ధి పనులు, రాష్ట్రంలో కొత్త విద్యా సంస్థల ఏర్పాటు, ఐటీ, ఏఐ వినియోగంపై విట్ విద్యార్థులు పలు ప్రశ్నలు అడగ్గా ముఖ్యమంత్రి వాటికి సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, శాసనసభ్యులు తెనాలి శ్రావణ్‌కుమార్, వీఐటీ వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్, కాదంబరి ఎస్.విశ్వనాథన్, వైస్ ఛాన్సలర్ ఎస్వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ముగింపు కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎండా... వాన

- ఏపీలో భిన్న వాతావరణం
- మరో నాలుగు రోజులు ఇలాగే
- అప్రమత్తంగా ఉండాలని విపత్తుల శాఖ హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఓ పక్క ఉరుములతో కూడిన వర్షాలు, మరోపక్క తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవే పరిస్థితులు మరో నాలుగు రోజులపాటు కొనసాగనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కొన్నిచోట్ల ఎండలు, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని, వాతావరణ అనిశ్చితి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. అలాగే విజయనగరం జిల్లా బాడంగి, బొబ్బిలి, దత్తిరాజేరు, గుర్ల, కొత్తవలస మండలాలు, పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట, గరుగుబిల్లి,సీతానగరం మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఉష్ణోగ్రతలు 40-42 డిగ్రీల మధ్య రికార్డు అయ్యే అవకాశం ఉందన్నారు. బుధవారం శ్రీకాకుళంలో రెండు మూడు చోట్ల భారీ వర్షాలుంటాయని, విజయనగరం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, ఎన్టీఆర్, పల్నాడు, శ్రీసత్యసాయి,చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలులి కురిసే అవకాశం ఉంటుందని వెల్లడించారు. వర్షాలు పడుతున్న పరిస్థితుల్లో ప్రజలు ఏ చెట్ల క్రింద నిలబడవద్దని హెచ్చరించారు. మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్ళాల్సి వస్తే తలకు టోపి, కర్చీఫ్ కట్టుకోవాలని, గొడుగు ఉపయోగించడంతోపాటు, చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగకూడదని, శారీరక శ్రమతో కూడిన కఠిన పనులను ఎండలో చేయవద్దని కోరారు.

బర్లీ పొగాకుపై నేడు సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బర్లీ పొగాకు కొనుగోలు వెంటనే ప్రారంభించాలని, రైతులకు గిట్టుబాటు ధరకుగాను క్వింటా రూ.14వేల నుంచి రూ.18వేలకు కొనుగోలు చేయాలన్న తదితర డిమాండ్లపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం దశల వారీగా చేస్తున్న ఆందోళనలకు ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు 29వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు ఏఎన్‌జీఆర్‌ఏయూలో సమావేశం జరగనుంది. వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు అధ్వర్యంలో జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, పొగాకు బోర్డు డైరెక్టర్ హాజరు కానున్నారు. పొగాకు బోర్డు పరిధిలోకి బర్లీ పొగాకును తీసుకురావాలని, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు..ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని తదితర డిమాండ్లపై పొగాకు రైతులకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ అధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్న విషయం విదితమే. దీనిపై స్పందించిన అధికారులు సమావేశాన్ని నిర్వహించి, టుబాకో ట్రేడర్లు, రైతులు, ఆయా రంగాలకు చెందిన ప్రతినిధులు హాజరు కావాలని ఢిల్లీరావు సమాచారం పంపారు.

ఉగ్రవాదంపై ఐక్యంగా ఉద్యమిద్దాం: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-ఒంగోలు: ఉగ్రవాదంపై ఐక్యంగా ఉద్యమించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ మాజీ కార్యదర్శి జి.ఈశ్వరయ్య, జాతీయ కార్యదర్శి నక్కి లెనిన్ బాబు పిలుపు నిచ్చారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం జరిగింది. వీరు మాట్లాడుతూ... ఉగ్రవాదాన్ని పూర్తిగా రూపుమాపాలన్నారు. ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మే మూడో తేదీన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞా కార్యక్రమం నిర్వహించాలని కోరారు. పహల్గాంలో ఉగ్రదాడి పిరికిపంద చర్య అని అన్నారు. ఇది భారత ప్రజాస్వామ్యంపై చేసిన దాడిగా అభివర్ణించారు. హిందువులనే లక్ష్యంగా చేసుకొని అత్యాధునిక ఆయుధాలతో వెంటాడి చంపడం దుర్మార్గమన్నారు. మూడంచెల భద్రత కలిగిన జమ్మూకశ్మీర్ లోకి ఉగ్రవాదులు ఎలా ప్రవేశించారన్న దానిపై సమగ్రమైన విచారణ చేపట్టాలన్నారు. ఉగ్రమూకలకు సహకరించిన వారిని వదిలిపెట్టరాదన్నారు. మే 15 నుంచి 18 వరకు తిరుపతిలో జరిగే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలకు యువత పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం.యుగంధర్, పరుచూరి రాజేంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి. సంతోష్ కుమార్, కత్తి రవి, నాగ రాముడు, ప్రభాకర్, శుభాని పాల్గొన్నారు.

దేశం కన్నా రాజకీయం ముఖ్యమా?

మోదీపై నిప్పులు చెరిగిన ఖర్గే



జైపూర్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. పహల్గాం ఉగ్రదాడిపై చర్చించేందుకు ఏప్రిల్ 23న ఢిల్లీలో ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశానికి మోదీ గైర్హాజరు కావడాన్ని ఆయన తప్పుపట్టారు. సోమవారం రాజస్థాన్‌లోని జైపూర్‌లో కాంగ్రెస్ నిర్వహించిన 'సంవిధాన్ బచావో' ర్యాలీలో ఖర్గే మాట్లాడుతూ... "అన్ని పార్టీల ముఖ్య నేతలు ఆ సమావేశానికి వచ్చారు. కానీ ప్రధాని మోదీ రాకపోవడం బాధాకరం. బీహార్‌లో రాజకీయ ప్రసంగం ఇవ్వడానికి మాత్రం ఏప్రిల్ 24న మోదీజీ వెళ్లారు. అఖిలపక్ష సమావేశానికి హాజరై ప్రభుత్వం వద్దనున్న ప్రణాళికను ప్రధాని వివరించి... మా నుంచి ఎలాంటి సహకారం కావాలో అడిగి ఉండాల్సింది" అన్నారు. "కాంగ్రెస్ పార్టీలోని ప్రతీ నేతకు భారతదేశమే ముఖ్యం. అదే పరమావధి. దేశం తర్వాతే పార్టీలు, మతాలు. దేశం కోసం మనమంతా ఏకమై నిలవాలి. దేశం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను అందరూ సమర్థించాలి. కాంగ్రెస్ పార్టీ ఐకమత్యం గురించి చెబుతుంటే బీజేపీ విభజనవాదంతో ముందుకుపోతోంది' అన్నారు. భారతదేశంలో రాజ్యాంగమే అత్యున్నతమైంది. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ శక్తి వల్లే టీ అమ్ముకునే వ్యక్తి కూడా ప్రధానమంత్రి కాగలిగారన్నారు. పహల్గాం ఉగ్రదాడితో మనదేశం ప్రతిష్ఠకు భంగం కలిగింది. అటువంటి కష్టకాలంలో ప్రధాని మోదీ బీహార్‌లో ఎన్నికల ప్రచారం చేయడం దారుణమన్నారు. మోదీ సర్కారు వల్ల మన దేశానికి ద్రవ్యోల్బణం, నిరుద్యోగమే మిగిలాయి. అలాంటి పాలకులు దేశాన్ని బలహీనపరుస్తారు. మోదీజీ 56 ఇంచుల ఛాతీ చిన్నదైపోయిందని విమర్శించారు. మోదీ సర్కారు దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని, వాటిని వాడుకొని కాంగ్రెస్ నేతలను వేధిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎదగడాన్ని బీజేపీ లాంటి పార్టీలు ఓర్వలేవన్నారు. 'మేం అణచివేతకు కునారిల్లిపోయే రకం కాదు. కాంగ్రెస్ కాస్త బలంగా కనిపించగానే బీజేపీ వాళ్లు కలవరపడతారు. మా పార్టీ నేతలను బలహీనపర్చేందుకు కుట్రలు పన్నుతారు. కొందరు నేతలపై కేసులు పెట్టినంత మాత్రాన యావత్ ప్రజాస్వామిక వ్యవస్థ బలహీనపడదు. బీజేపీ వాళ్లు దేవుడి పేరు స్మరిస్తారో లేదో తెలియదు కానీ, మా నేతల పేర్లయితే నిత్యం స్మరిస్తారు. మా స్థాయిలో భారత దేశానికి ఏ పార్టీ కూడా సేవలు చేయలేదు. ఎరువుల భద్రత, ఉపాధి హామీ పథకం, విద్యా వసతులను మేమే దేశ ప్రజలకు ఇచ్చాం. తప్పకుండా మేం కేంద్రంలో అధికారం లోకి వస్తాం' అని ఆయన పేర్కొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం: ఐదుగురి దుర్మరణం

- తిరుపతి జిల్లాలో కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొన్న కారు
- ఇద్దరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-పాకాల: తిరుపతి జిల్లా పాకాల మండలంలో సోమవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అక్కడికక్కడే ఐదుగురు దుర్మరణం చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతి చెందిన వారిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు, ఒక బాలుడు ఉన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రం హోసూర్‌లోని ఒక కంపెనీలో పని చేస్తున్న వారు తిరుమల వెంకన్నను దర్శించుకుని టీఎన్70ఎహెచ్ 2745 నంబరు గల ఎర్టిగా కారులో తిరుగు ప్రయాణమయ్యారు. అయితే వీరు ప్రయాణిస్తున్న కారు సోమవారం మధ్యాహ్నం 1:45 నిమిషాల ప్రాంతంలో పాకాల మండలం తోటపల్లి వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై జార్ఖండ్ నుంచి బెంగళూరు వెళుతున్న కంటైనర్‌ను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారు నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న త్యాగరాజన్ (43), విజయలక్ష్మి (50), సహనా (34), రజిని (27), లేఖన్ గౌడ (11) అక్కడికక్కడే మృతి చెందారు. గీత (51) ,క్రిస్ విన్ (15) తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే పాకాల సీఐ సుదర్శన ప్రసాద్ తన సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని క్రేన్ సాయంతో కారును బయటకు తీసి గాయపడ్డ వారిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ ప్రమాదంపై పాకాల సీఐ సుదర్శన ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, సీఎంవో ఆదేశాల మేరకు స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సందర్శించి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని క్షతగాత్రులకు ధైర్యం చెప్పారు.

చంద్రబాబు దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన సంఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు రుయా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా సాయం అందించాలని సీఎం అధికారులకు సూచించారు.

పవన్ కల్యాణ్ విచారం

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

'హజ్ యాత్రికుల వద్ద ఆ కార్డు ఉండాల్సిందే!'

న్యూఢిల్లీ: ముస్లింల పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే తొలి బ్యాచ్ యాత్రికులు ఈనెల 29న యూపీలోని లక్నో విమానాశ్రయం నుంచి బయలుదేరనున్నారు. ఈ నేపథ్యం లోనే భారత హజ్‌కమిటీ యాత్రికులకు మార్గదర్శకాలు జారీ చేసింది. అన్ని సమయాల్లో తప్పనిసరిగా నుసుక్ కార్డ్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది. దీంతో పాటు ముఖ్యమైన పత్రాలు, గుర్తింపు కార్డులు వెంట తీసుకెళ్లాలని చెప్పింది. "యాత్రికుల వద్ద నుసుక్ కార్డ్ లేకపోతే సౌదీ అరేబియా ప్రభుత్వం నిలిపి వేస్తుంది. మక్కా, మదీనా, మీనా, అరాఫత్ స్థానిక అధికారులు యాత్రికులను అడ్డుకుంటారు. ఇలాంటి ఇబ్బందులు పడకూడదంటే తప్పనిసరిగా నుసుక్ కార్డ్‌ను తమ వద్దే ఉంచుకోవాలి" అని యూపీ హజ్‌కమిటీ కార్యదర్శి ఎస్పీ తివారీ పేర్కొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.